

బాపు బొమ్మ

# త్యాగయ్య

రమణ రచన

# ఋగయ్య

రమణ రచన

శ్రీ రమణ చిత్రకథ

విజయ

మద్రాసు-26

# 'THYAGAYYA' SCREEN Bo

SCREEN PLAY & DIALOGUES

MULLAPUDI VENKATA RAMANA

SCREEN BOOK

SRI RAMANA

PUBLISHERS

VIJAYA

80, DHANALAKSHMI COLONY

MADRAS-600 026

PRINTERS

VIJAYA GRAPHICS

210, ARCOT ROAD

MADRAS-600 026

PRICE

FOUR RUPEES

# నవత సినీ ఆర్ట్స్
# 'త్యాగయ్య'

నటీనటులు;

జె. వి. సోమయాజులు, రావుగోపాలరావు
రాళ్ళపల్లి, రాంబాబు, యమ్. బి. కె. వి. ప్రసాదరావు
సాక్షి రంగారావు, అర్జాజనార్ధనరావు,
సత్తిబాబు, మిఠాయి చిట్టి
రామారావు, రాజేష్‌బాబు, ఆర్. పి. నరసింహం
హేమసుంధర్, రాఘవయ్య, కృష్ణమూర్తి
చంద్రరాజు, తారాకృష్ణ మరియు శ్రీధర్
కె. ఆర్. విజయ, ఝాన్సీ, జ్యోతిలక్ష్మి
రోహిణి, అత్తిలి లక్ష్మి, విజయబాల
అన్నపూర్ణ మరియు సంగీత.

నృత్య తారలు:

ప్రియవదని, జయ

**సాంకేతిక నిపుణులు:**

కె. వి. మహదేవన్, పుహళేంది
ఎస్. పి. బాలసుబ్రహ్మణ్యం, పి. బి. శ్రీనివాస్
పి. సుశీల, ఎస్. జానకి, వాణీజయరాం
వేటూరి సుందర రామమూర్తి
బాబా అజ్మి, లోక్‌సింగ్
భాస్కరరాజు
రామచంద్రయ్య, అనిల్ దత్తాత్రేయ
టి. యమ్. సంతానం
కె. వి. రావు
వాలి
సి. హెచ్. శ్యామ్‌ప్రసాద్, యమ్. అర్జునరావు
సుబ్బారావు, బాబూరావు, బాబు
కృష్ణమోహన్, భాస్కర్, రాజు
దుర్గ, వల్లూరి రవి, ప్రసాద్‌బాబు

---

**డిస్ట్రిబ్యూటర్స్:**

అన్నపూర్ణ, స్వర్ణయుగ మూవీస్

---

**స్క్రీన్ ప్లే, సంభాషణలు:**

ముళ్ళపూడి వెంకట రమణ

---

**నిర్వహణ:**

యన్. అచ్యుతరామరాజు

---

| నిర్మాత: | దర్శకత్వం: |
|---|---|
| **యన్. కృష్ణంరాజు** | **బాపు** |

# నాదో మాట

ఏదో సినిమా ఎవరితోనో తీయాలనే ఆలోచన వున్న నన్ను 'శంకరాభరణం' యొక్క ఆదరణ చూసి "సోమయాజులుగారితో 'త్యాగయ్య' ఎందుకు తీయకూడదు అన్నారు- వైజాగ్, ఆర్. కె. లంచ్ హోమ్ ప్రొప్రైటర్ నా మిత్రులు అప్పారావుగారు. అవును, ఎందుకు తీయకూడదు?....? ఎందుకు తీయ కూడదు?....అవును తీయొచ్చు....చూద్దాం....తీద్దాం....ఈ రకమైన ఆలోచనా పరంపరతో తీయాలనే నిర్ణయానికి వచ్చాను.

సరే, ఎవరితో తీయాలి? బాపు లేక విశ్వనాథ్. ఇద్దరన్నా నాకు అభిమానమే. ఇద్దరితోను నాపరిచయం అంతంత మాత్రమే. అయితే త్యాగయ్య గురించి పదేళ్ళుగా ఆలోచన చేస్తున్నారు—బాపు రమణలు. ఓనాడు రమణగారితో "నాకీ ఆలోచన వచ్చింది. మీతో మాట్లాడాలి. మీరు వస్తారా? నేనురానా?" అయిదు నిముషాల్లో ఆయున వచ్చారు. అర నిముషంలో ఆయనతో విషయం చెప్పాను. అర క్షణంలో ఆయన ముఖంలోకి కాంతి వచ్చింది. ఆ కాంతే 'త్యాగయ్య' చిత్రానికి నాంది.

ఈ సినిమా ఎందుకు చేస్తున్నట్టు? డబ్బుకోసమా? కాదు. డబ్బు పోగొట్టుకోవడం కోసమా? అసలే కాదు. డబ్బు రాకపోకల ప్రభావం దీనిమీద లేదు. జీవశాస్త్ర ప్రకారం ప్రతి ప్రాణీ గుర్తింపు కోరుతుంది. అందులో కీర్తి కండూతి వుండవచ్చు. లేక ఆత్మ సంతృప్తి వుండవచ్చు. జీవితంలో ఏదో ఒక మంచి పని చేయాలనే తపన. ఈ సినిమా తీయడానికి నన్ను ఉసికొల్పింది.

ఈ రకంగా ఇందులోకి దిగాను గనుక కథా నాయకుడిని గురించి కొంత పరిశీలన చేయవలసి వచ్చింది. అలా చేయగా చేయగా నాకు అనిపించింది ఏమిటంటే త్యాగరాజు అమాయకుడు, నిరాడంబరుడు, నిర్మలుడు, నిర్భయుడు—భక్తి కన్నా నన్నాకర్షించిన విషయాలు ఇవి. అందుకే పరమనాస్తికుడి నయిన నేను పరమ భాగవతోత్తముడయిన శ్రీత్యాగయ్యకు భక్తుడనయ్యాను. అంటే భక్తుణ్ణి కాకుండా, భక్తుడికి భక్తుడనయ్యాను.

పవిత్రమైన ఈ యజ్ఞం నూరు రోజులు సాగింది. ఈ నూరు రోజుల యజ్ఞానికి నూరు రోజులు ముందు సాధన సంపత్తి సమకూర్చుకోవాలి. ఈ సాధన సంపత్తి అంటే సంగీత సాహిత్యాలు. వాటి సారధి శ్రీ ముళ్ళపూడి వెంకట రమణ. దీనికోసం ఆయన హరికథలు చెప్పించాడు. సిరి కథలు విన్పించాడు. అడుగుజాడ త్యాగయ్యాదిగా అన్ని పవిత్ర స్థలాలు తిరిగాడు. మమ్మల్ని తిప్పాడు. శోధన చేశాడు. పరిశోధన చేశాడు. భక్తిపూనకం ఆధారంగా ఈ భక్తిరస సంగీత కావ్యాన్ని రసమయంగా రచించి పెట్టాడు.

సత్తిరాజు లక్ష్మీ నారాయణ అంటే బాపు. ఈయన్ని గురించి వ్రాయడానికి నాకలం మెడ్‌వారీ చేస్తోంది. ఒకే ఒక మాటలో చెప్పాలంటే బాపు ఋషి. డబ్బుకి లొంగడు. డబ్బాకి లొంగడు. పనికి లొంగుతాడు. పని పిచ్చోడు. పని విశ్రాంతి. విశ్రాంతిలో పని ఆయన పని. పనిలో అందం. అందంలో ఆనందం. ఆనందంలో పరమానందం. Inspirat on + Perspiration; కసి + కృషి = బాపు.

త్యాగయ్యకు శిల, వులిసేనిస్తే అపురూపమైన ఆకృతి నిచ్చిన శిల్పులు బాపు—రమణలు. థాంక్స్ చెప్పాలా? మరేమి అయినా చెప్పాలా? ఈ నిర్మాణంలో నేనేమీ కష్టాలు పడలేదు. నష్టాలు పొందలేదు. ఏవో చిక్కులు మబ్బుల్లా కనిపించినట్టే కనిపించి మటుమాయమయి పోతుండేయి. ఆర్టిస్టులు, టెక్నీషియన్స్ విరామం ఎరగకుండా శ్రమించారు. 'డేట్లు' అడిగారే తప్ప 'రేట్లు' అడగలేదు. అడిగిందే తడవుగా ఓ. కె. చేసి కాల్‌షీట్స్ ఇచ్చి తమ సంపూర్ణ సహకారం ఇచ్చిన సోమయాజులుగారికి, కె. ఆర్. విజయగారికి, రావు గోపాలరావుగారికి, శ్రీధర్‌గారికి, సంగీతగారికి బాకీ పడి పోయాను.

ఖరీదైన తమ కాలాన్ని మాకోసం అధికాధికంగా ఖర్చు పెట్టి ఇబ్బంది పడిన మహదేవన్, పుహళేందులకు, బాలూకు, బాబాకు, వేటూరికి, రామశాస్త్రులకు నమస్కరించకుండా వుండలేను.

అల్లంత దూరం మాతో వచ్చి మమ్మాశీర్వదించిన అమృత హృదయులు డి. వి. యస్. రాజుగారికి యం. యస్. రెడ్డిగారికీ నా నమోవాకాలు.

వెన్ను చరిచి మాట సహకారమే కాక, చేయి చాపి మూట సహకారం, అదీ సకాలంలో అందించిన కృష్ణప్రసాద్ గారికి సదా కృతజ్ఞుణ్ణి.

ఈ సినిమా తీయమనే అలోచన అందించిన అప్పారావు గారికి, ఈ ఊహకు ఊపునిచ్చిన 'శంకరాభరణం' మేకర్స్‌కు నమస్కృతులు.

అందరికన్నా ముందుగా లేచి, అందరికన్నా చివరికి ఇంటికి వెళ్ళే మా స్టాఫ్‌కు, డ్రైవర్స్, బోయ్స్‌కు నా కృతజ్ఞతలు. 'నవతా' అవతరణకు నాధుడు, మిత్రుడు కె. యస్ రామారావు (శ్రీరామా కార్పొరేషన్, విజయవాడ) ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేను.

యాభైఏళ్ళు నిండిన నాకు ఈరోజు ఈ భూమి మీద నూకలు నిండినా మరో వందఏళ్ళ పాట శాశ్వతత్వం చేకూర్చి పెట్టిన బాపురమణలకు శాశ్వతంగా కృతజ్ఞుణ్ణి.

ఆఖరిమాట. అలనాటి 'తాగయ్య' ద్వారా ఈనాటి త్యాగయ్య'కు స్ఫూర్తినిచ్చిన మహానుభావుడు ఆ నాగయ్యా గారికి ఈ చిత్రాన్ని అంకితం చేస్తున్నాము. పైనుండి ఆయన ఆశీర్వదిస్తున్నాడు. మీరూ నాలుగు అక్షింతలు వేయండి.

ఎందరో మహానుభావులు
అందరికీ వందనములు.

ఎస్. కృష్ణంరాజు.

# ఏమని పొగడుదురా....?

వాగ్గేయకారునిగా, సంగీత కోవిదునిగా. వీటన్నిటిని మించిన రామభక్తి సామ్రాజ్య సార్వభౌమునిగా అజరామర కీర్తినార్జించిన త్యాగయ్య, కర్నూలు జిల్లాలోని కాకర్ల గ్రామంనుంచి దక్షిణదేశానికి వలసవెళ్ళిన ఆంధ్ర కుటుంబంలో 1767 లో జన్మించారు.

త్యాగయ్య తండ్రి రామబ్రహ్మం గొప్ప పౌరాణికుడుగా తంజావూరు ప్రభువుల అభిమానం సంపాదించాడు. త్యాగయ్య జన్మస్థలం తిరువైయూర్ సమీపంలోవున్న తిరువారూరు. సంస్కృత పాఠశాలలో త్యాగయ్య సంస్కృతాంధ్రాలు చదివారు. తండ్రిద్వారా రామనామోపదేశం స్వీకరించాడు. చిన్ననాటినుంచి త్యాగయ్య జయదేవుని అష్టపదులు, పురందరదాసు కీర్తనలు, రామదాసు కీర్తనలు, పోతన భాగవతం, నిత్యం గానం చేస్తుండేవాడు. పూజా సమయంలో, భజనలలో ఆశువుగా కీర్తనలు పాడడం ఆరంభించాడు. త్యాగయ్య తండ్రి ఆ కీర్తనలను పండితులకు వినిపించగా వారు విని మృదు మధురంగా భక్తిప్రపూరితంగా ఉన్నాయని శ్లాఘించారు. త్యాగయ్యకు సంగీతములో క్రమశిక్షణ ఇప్పించాలనే సంకల్పంతో తంజావూరు ఆస్థాన విద్వాంసులైన శొంఠి వెంకటరమణయ్య భాగవతార్‌వద్ద శిష్యునిగా చేర్చాడు. త్యాగయ్య ఏక సంథాగ్రాహియై ఒక్క ఏడాదిలోనే గురువువద్ద సంగీతాభ్యాసము పూర్తి చేశాడు.

బమ్మెర పోతనగారి పంథాలో తన సంగీత సాహిత్యాలను శ్రీరామునికి అంకితముచేసి, ఉంఛవృత్తిలో జీవనం గడిపాడు. భక్తి పారవశ్యంలో, బాధలలో, యాత్రలలో ఆయన ఆశువుగా గానంచేసిన కృతులు అసంఖ్యాకంగా వున్నాయి. రామాయణంలో వాల్మీకి 24,000 శ్లోకములు రచించినట్టే, త్యాగయ్య 24,000 కృతులలో రామకథను గానం చేశాడని ప్రతీతి. అయితే ఇప్పుడు కొన్ని వందల కృతులు మాత్రమే లభ్యమవు తున్నాయి. ఇవిగాక 'ప్రహ్లాద భక్తవిజయము', 'నౌకాచరిత్రము', 'సీతారామ విజయము' అనే మూడు సంగీత ప్రబంధాలను, 'కీర్తన శతకము 'ను

'శతరాగ రత్నమాలికను' ఆయన రచించిన స్వరపరిచారు. త్యాగయ్య కృతులలోని ఊహాసౌకుమార్యం, కవితా చమత్కృతి అనితర సాధ్యం. స్వర, సంగీతరచనలు అన్ని రకముల గాత్రములకు అద్దినట్లు సరిపోతాయి. అందుకే త్యాగయ్యకు ఎందరో శిష్య, ప్రశిష్యులున్నారు. వారిలో గొప్ప నాయకులుగా, కృతికర్తలుగా విశేషఖ్యాతి నార్జించిన వారెందరో వున్నారు. నేటికీ ఆ సంగీత జగద్గురు పరంపర శాఖోపశాఖలుగా విస్తరిల్లుతూనే వుంది. త్యాగయ్య జ్యోతిష, మంత్ర శాస్త్రాలలో కూడా పండితుడు. గొప్ప వైణికుడు.

సంగీత సాహిత్యాలు రాజాస్థానాలకు, విద్యత్సభలకు మాత్రమే పరిమితమైన కాలంలో త్యాగయ్య వాణి, బాణి కొత్త ఒరవడిని, వురవడిని సమకూర్చాయి, జనసామాన్యానికి సైతం సంగీత రసాస్వాదన అందుబాటులోకి వచ్చింది. త్యాగయ్య సుమారు 200 రాగములలో కీర్తనలు రచించారు. ఇన్ని రాగాలను వుపయోగించిన వాగ్గేయకారుడు ఈయనే. కొన్ని అపూర్వరాగములు నేటికీ ప్రచారములో వున్నాయి. ఉపనిషత్తులలోని గూఢ భావాలను, సామాన్య భాషలో కీర్తనలలో చెప్పడంవలన త్యాగరాజ కృతులకు "త్యాగబ్రహ్మోపనిషత్తు" అని కూడా పేరు వచ్చింది.

త్యాగయ్య పరతత్త్వమును 'నాదబ్రహ్మ' గా స్వీకరించి ఉపాసించాడు. 'నాదాన్ని' 'తన దావి' గా చేసుకున్నాడు ఆయన సుఖదుఃఖాలు, ఇష్టాయిష్టాలు, స్మృతులు, విస్మృతులు అన్నీ సంగీతభరితమై కృతులుగా ఆకృతులు దిద్దుకున్నాయి. సంగీత యోగవేత్త అయిన త్యాగయ్య ఒక విశ్వవిద్యాలయం.

భార్యా వియోగానంతరం త్యాగయ్య సన్యాసాశ్రమం స్వీకరించి 'నాద బ్రహ్మనంద' అనే ఆశ్రమనామం ధరించాడు. 1847 లో ఆయన సిద్ధి పొందారు. పవిత్ర కావేరీ తీరంలో త్యాగరాజు సమాధి వుంది. ప్రతీ ఏటా అక్కడ జరిగే త్యాగరాజు ఆరాధనోత్సవాలు ప్రపంచ సంగీతోత్సవాలుగా రూపు దిద్దుకున్నాయి.

త్యాగయ్య నివాసగృహము నేటికీ మనం చూడవచ్చు. ప్రస్తుతము అది ఆరాధన మహోత్సవ సభవారి ఆధీనములో వుంది.

శ్రీ శంకరమంచి సత్యంగారి "అమరావతి కథలు" అనే సుధాసముద్రంలో "తులసి తాంబూలం" అనే ఆణిముత్యాన్ని సంగ్రహించి శ్రీ త్యాగరాజస్వామి కథలో ఒక ఘట్టంగా నిలిపి అలంకరించాను.

శ్రీ సత్యంగారి శిల్పచాతురికి, ఆ కథలోని ఆర్ద్రతకు మరో మారు నమస్కరిస్తూ కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

—ముళ్ళపూడి వెంకట రమణ.

* * *

ఉషః కాలం.

ఆకాశంలో ఉద్భవించిన కాంతి బిందువు క్రమంగా పెద్దదవుతోంది. ఓంకార నాదం, లయాత్మకంగా విస్తరించి సర్వవ్యాప్తం అవుతోంది. ఆ నాదంలో సామవేదం ఉదయించి వికసించింది.

అకారో విష్ణు రూపంచ
ఉకారో బ్రహ్మ రూపకం
మకారో భర్గ రూపంచ
సర్వమోంకార రూపకమ్.

ఆ ఉషఃకాంతిలో ధ్వని మాత్రంగా వున్న ఓంకార నాదం ప్రతిధ్వనిస్తోంది. ఓంకారానికి రూపం స్ఫురించింది. అంచుపై నాదస్వరూపుడైన సదాశివుని రూపం క్రమంగా దర్శనం యిస్తోంది. అనేక స్త్రీ పురుష కంఠాలుః

"ఆత్మ మధ్య గతః ప్రాణః
ప్రాణ మధ్య గతో ధ్వనిః
ధ్వనిర్మధ్యగతో నాదః
నాద మధ్యే సదాశివమ్"

అంటూ ఓంకార నాదంగా సాక్షాత్కరించిన సదాశివుని స్మరించాయి—

* * *



త్రిరువారూరు త్యాగరాజస్వామి కోవెల శిఖరం ప్రత్యూష కిరణాలకాంతిలో, పసిడివన్నెలు వెదజల్లుతోంది. ఉంఛవృత్తి యాత్ర నడిపే త్యాగయ్య ఆయన శిష్యబృందం శిఖర దర్శనం చేసుకున్నారు.

శ్రీ గణపతిని సేవింపరారే
శ్రితమానవులారా
వాగాధిపాది సుపూజల చేకొని
బాగా నటింపుచును వెడలిన ॥శ్రీగణ॥

త్యాగయ్య బృందం శ్రీ గణపతిని స్మరిస్తూ గోపురద్వారంలోంచి కోవెలలో అడుగుపెట్టింది. కోవెల గోపురాలు, కావేరిజలాలు త్యాగయ్య సంగీత మధురిమలో పులకితమైనట్లు గోచరిస్తున్నాయి. చేసేది ఉంఛవృత్తే అయినా ఎంతో ఠీవిగా వీధులవెంట కదులుతోంది త్యాగయ్య బృందం. ఎడమ చేతిలో చిడతలు, కుడిచేత తంబుర ధరించిన త్యాగయ్య చేతులు జోడించి వందనంచేస్తూ ఆలయ ముఖద్వారంలో అడుగు పెట్టాడు.

వందనము రఘునందన సేతు
బంధన భక్తచందన రామ
శ్రీదమా నాతో వాదమా నే
భేదమా ఇది మోదమా రామ ॥వంద॥

పక్కన నడచి వస్తున్న శిష్యులు గురువు గారి గానానికి వంత పాడుతున్నారు. శిష్యుడు వెంకటరమణ మెడలో మృదంగం వేసుకుని గురువుగారి పాదాలని, పదాలని అనుసరిస్తున్నాడు-మరొక శిష్యుడు గణపతి కంచుతాళం వాయిస్తున్నాడు. మరి నలుగురు బృందం సభ్యులు తళ తళ మెరిసే కంచు పాత్రలను జోలెలుగా ధరించి వెంట నడుస్తున్నారు.

కోవెలలో కొందరు భక్తులు దేవుని ప్రసాదంగా తెచ్చుకున్న పళ్లు త్యాగయ్య బృందానికి సభక్తికంగా సమర్పిస్తున్నారు. వీధివెంటవారు కదలి వెళుతుంటే పాటకి రెక్కలువచ్చి కదలి వెళుతున్నట్లువుంది. తొలిసంజెకి, ప్రత్యూష పవనాలకు త్యాగయ్య గళం క్రొత్త సోయగాలను, వింత పరిమళా లను అందిస్తోంది.

తిరువారూరు తిరుమంజనం వీధిలో త్యాగయ్య గారిల్లు మధ్య తరగతి శ్రేణిలో సంసార పక్షంగా వుంది. ముంగిట తీర్చిదిద్దిన ముగ్గులు, వాకిట్లో తిన్నెలున్న పౌగడమానులు రమణీయ వాతావరణాన్ని కల్పిస్తున్నాయి. అది తంజావూరు తులసింగ మహారాజు త్యాగయ్య తండ్రి రామబ్రహ్మంను ఆదరించి, కట్టించి యిచ్చిన ఇల్లు.

తాగయ్య అర్థాంగి కమలాంబ కృతికి తగిన రాగంలా, త్యాగయ్యకు తగిన ఇల్లాలు. తల్లిదండ్రుల కనుసైగలలో మెలిగే పదేళ్ళ కూతురు సీత. త్యాగయ్య అన్న జపేశం, వదిన గంగమ్మలతో కుటుంబం ఉమ్మడిగా సాగిపోతోంది. రోజులాగే స్వామివారి మేలుకొలుపుతో త్యాగయ్య దినచర్య ప్రారంభం అయింది ఆ రోజు కూడా. సింహద్వారానికి ఎదురుగా పూజా మందిరం, అందులో గోపురాకారంలో అమర్చిన గూడు, అందులో శ్రీరామ పంచాయతనం సాలంకృతంగా వుంది.

మందిరానికి చెరో వేపున త్యాగయ్య, కమలాంబ భక్తి ప్రపత్తులతో కూచుని వున్నారు. కూతురు సీత చామరం పట్టుకుని స్వామివారి సేవకు సిద్ధంగా నిలబడి వుంది. త్యాగయ్య చేతులు జోడించి స్వామికి మేలు కొలుపులు చెబుతున్నాడు.

మేలుకోవయ్యా మమ్మేలుకో రామ
మేలైన సీతాసమేత నా భాగ్యమా॥ మేలుకో॥

కమలాంబ పువ్వులు, గంధం, ధూపం, దీపం స్వామికి నివేదిస్తోంది. రాములవారిని మేలుకొలిపి త్యాగయ్య శిష్యులతో ఉంఛవృత్తికి బయల్దేరారు.

బాగా పొద్దెక్కింది. ఇంటిసావడి మధ్య గంగమ్మ కాళ్ళు చాపుకు కూర్చుని జుట్టు దువ్వుకుంటూ పేలు నొక్కుకుంటోంది. అటు చూస్తే ముగ్గులతో తీర్చిదిద్ది పవిత్రంగా కనిపిస్తున్న పూజామందిరం. ఇటు చూస్తే నడిమింట్లో జ్యేష్ఠాదేవిలా కూచున్న గంగమ్మ. పక్కన చిన్న గిన్నెలో అటుకులు, బెల్లంముక్క పెట్టుకుని తల దువ్వుకుంటూ మధ్య మధ్య అటుకులు నోట్లో వేసుకుంటోంది. కమలాంబ ఇంటి పనులలో నిమగ్నమై వుంది. గంగమ్మ "కోడలు లేని అత్త గుణవంతురాలూ, ఓయమ్మ... అత్తలేని...." అని పాడుకుంటూ పేను దొరికినప్పుడల్లా చిటుక్కున నొక్కుతోంది. చిక్కుతీస్తే వచ్చిన వెంట్రుకల్ని ఉంగరం మెలికచుట్టి నట్టింట్లోనే విసిరేసింది. అవతలింట్లో దండెంమీద మడిచీర ఆరేస్తున్న కమలాంబ అది గమనించి అటు వెళ్ళుతున్న కూతురికి సైగ చేసింది.

"వేడి పాలమీద వెన్న వుండేనా ఓయమ్మ

పచ్చి పాలమీద మీగడుండేనా ఓయమ్మ"—తన ధోరణిలో తాను వున్నది గంగమ్మ. సీత ఆవెంట్రుకల చుట్టని మునివేళ్ళతో తీసింది. ఇంతలో ఎవరో వాకిట్లోకి రావడం గమనించి "పెద్దనాన్నగారూ" అని పిలిచింది. ఆ పిలుపు విని జపేశం లోపల్నుంచి హడావిడిగా బయటకు వచ్చాడు. ఆయన తీరు చూస్తే అప్పుడే నిద్రలేచి ముఖం కడుక్కు వస్తున్నట్టు స్పష్టంగా తెలుస్తోంది. ముఖం జిడ్డోడుతోంది. బట్టలు నలిగి

వున్నాయి. ఎగ్గట్టిన పంచెతో గబగబా వచ్చి ఏమిటన్నట్లు సీతవంక చూశాడు.

"మీకోసం ఎవరో వచ్చారు" అన్నది సీత.

"వచ్చి నించున్నాడా? కూర్చున్నాడా?" వచ్చింగెవరో అంచనా వేసుకోడానికి అడిగాడు జపేశం.

"అరుగు మీద కూర్చున్నారండి" సీత ఆ ముక్క చెప్పగానే జపేశం వులిక్కి పడ్డాడు.

"పేద్ద వెండి మీసాలు- పేద్ద వెండి పొన్నుకర్ర- పేద్ద వెండి పాలేరు" అంటూ వర్ణించి చెప్పింది సీత.

"అమ్మయ్యో! ఆ యొక్క సెట్టిగారు!" అని నిశ్చయించుకుని, వీధి అరుగుమీదకు విన్పించేలాగా "మహా ప్రభో! వచ్చేస్తున్నా ఒక లిప్త- ఒక్క లిప్త" అంటూ కంగారుగా పరుగెత్తి దేవుడి మందిరం దగ్గరున్న గిన్నెలోంచి యింత విభూతి తీసి నుదుట దట్టంగా పూశాడు. రూపాయి కాసంత కుంకుమ బొట్టు పెట్టుకున్నాడు. సీత పెదతండ్రిని వింతగా చూస్తోంది. పంచె కుచ్చెళ్ళు సర్దుకుని, గదిలోకెళ్ళి ఓ తాటాకుల గ్రంథం అందుకున్నాడు. హడావిడిగా వాకిట్లోకి వెళుతుంటే "పెదనాన్నగారూ! నీళ్ళు పోసుకోకుండా విభూతీ బొట్టూనా?" విలదీసి అడిగింది సీత. జపేశం గతుక్కుమని ఆగాడు. కొంచెం తేరుకుని, "నోరు మూయవే ముదిపేరక్కా. ఆ యొక్క నీళ్ళు పోసుకోవడం, ఆ యొక్క తలంటూ అవన్నీ ఒంటికి క్కాదు. ఆ యొక్క మనసుకుండాలి" అంటూ అద్దంలో బొట్టు, విభూతి సరిదిద్దుకున్నాడు.

"పై మెరుగులు కాదు లోమెరుగులు ముఖ్యం. ఎలికతోలు తెచ్చి ఎందాక వుతికినా ఏవి లాభం?" అని చాలా పెద్దగా వీధిలో కూచున్న శెట్టి గారికి విన్పించేలా అంటూ, వడివడిగా బయటకు వచ్చాడు—

గట్టి రామిశెట్టిగారంటే ఆ ఊళ్ళో బాగా డబ్బున్న ఘటం. ఠీవిగా తలపాగా, వెండిపొన్ను కర్ర, జరీ అంచు కండువాతో అరుగు మీద ఆసనశుద్ధిగా కూచుని వున్నాడు. ఆయన్ని చూడగానే 'మహాప్రభో' అని

సంబోధించి "శ్రీరస్తు....శుభమస్తు। ఆ యొక్క కల్యాణమస్తు...." అని ఆశీర్వదించాడు. శెట్టిగారు వెంటనే అందుకుని "ఏవి కళ్యాణమో ఏవి శోభనమో। మస్తు మస్తు అంటూ నా దగ్గిర డబ్బులు వడుక్కుంటున్నావు దప్ప పని జరగలేదు. మా చంచలాక్షికి కిందటి నెలలోనే రాజనర్తకి ఉద్యోగం వస్తుందన్నావు- ఆ నెలలో ఇంకో ముగ్గురికి వచ్చింది గని దీనికి రాలేదు." ఆయన మాటలన్ని జపేశం నోరు వెళ్లబెట్టి విన్నాడు.

గబగబా చేతిలో వున్న తాళపత్ర గ్రంథం విప్పాడు. కాసేపు అటూ యిటూ తిప్పాడు-

శెట్టిగారికి దగ్గరగా జరిగి కూచుని "కుజక్షేత్రే కుజాంశస్థే మందే కుజ సమన్వితే" అన్నాడు శాస్త్రకారుడు. ఆ యొక్క కుజుడుగారు స్వక్షేత్రంలో అనగా సొంత కొంపలో తొమ్మిదో అంశలో కూర్చున్నాడు. మీ చంచలకేసి ప్రేమగా చూస్తున్నాడు. కాని-ఆ శనిగ్రహంగాడు కుజుడుని కోరగా చూస్తున్నాడు ఇటు రాహుకేతువులు ఎడమొహం పెడమొహం- అంచేతనే ఆ యొక్క రాజుగారి పిలుపు ఆలస్యం-రేపు శని ఇల్లు మారగానే...."

"శనిగాడు ఇల్లు మారినా, మాసినా నిన్ను ఊరు మార్పించేస్తాను శాస్తుర్లూ" జపేశం సంజాయిషీ సాంతం వినకుండానే చెప్పేశారు రామిశెట్టి కోపంగా అరుగుదిగి "రేపు పున్నమి తిరిగేలోగా చంచలకి రాజుగారు కబురు పంపక పోతే అది ఖాయం. అదేకాదు అది నన్ను వదిలిపోడం కూడా ఖాయం- రామిశెట్టి నిక్కచ్చిగా చెప్పాడు. వెళ్లబోతూ "శాస్తుర్లూ కాస్త బాగా చూడవయ్యా శాస్త్రం" అన్నారు బ్రతిమాలుతున్న ధోరణిలో.

సొగసుగా మృదంగ తాళము జతగూర్చి నిను
జొక్కజేయు ధీరుడెవ్వడో-
నిగమ శిరోర్థము గల్గిన నిజ వాక్కులలో స్వరశుద్ధముతో
॥సొగసు॥

దూరంనుంచి త్యాగయ్య పాట సవ్వడి వినిపించింది రామిశెట్టికి. ఏదో గుర్తువచ్చినట్టు తిరిగి జపేశంవైపు రెండడుగులు వేసి "నీకు తెలియక పోతే మీ తమ్ముడిగారిని అడగవయ్యా మగడా. ఆయనకి శాస్త్రం బాగా పలుకు తుందని చెప్పుకుంటారు." అనేసి శెట్టి చరచరా వెళ్ళిపోయాడు.

త్యాగయ్య ఉంఛవృత్తి యాత్ర సాగిస్తున్నాడు. బాగా పొద్దు పోయింది. శిష్యులు తన్మయులై పాడుతూ గురువుగారిని అనుసరిస్తు న్నారు. ఒక ఇంటిముందు భిక్ష యివ్వడానికి ఇంటి ఇల్లాలు ముందుకు వచ్చింది—

"తల్లీ సరిపడ(గాసం వచ్చింది. మించి సేకరించడం నిషిద్ధం. ఈ వేళకు చాలు-లాంఛనంగా రెండు గింజలు వెయ్యండి" అన్నాడు శిష్యుడు. అలాగే గుప్పెడు గింజలు మాత్రం తీసుకున్నాడు. త్యాగయ్య బృందం ఇంటి వైపుగా నడిచింది.

# 2

త్యాగయ్య ఇంటి గుమ్మంలో నిలిచాడు. శిష్యులు వెనక ఆగారు. శిష్యుల చేతులలో ఆ రోజు భిక్షలో ముట్టిన కూరగాయలు, బియ్యం వగైరా సామగ్రి వున్నాయి. కమలాంబ ఎదురొచ్చి భర్త పాదాలు కడిగి పాదోదకం శిరసున జల్లుకుంది. త్యాగయ్య ఇంట్లో అడుగు పెట్టబోతుండగా "త్యాగూ" అని గద్దించాడు బయటకు వస్తూ జపేశం. త్యాగయ్య ప్రశాంతంగా తలెత్తి అన్నగారి వంక చూశాడు.

"ధర్మ భ్రష్టుడా ఈ జన్మలో బాగుపడవ(రా!"

బావగారి మాటలకు కమలాంబ కలవరపడింది. తోడుకోడలు గంగమ్మ వీధి గుమ్మంలో నిలబడి ఠీవిగా, విలాసంగా జరుగుతున్నది వింతగా చూస్తోంది. త్యాగయ్య అన్నగారి మాటలకు ఏమిటన్నట్లు తలెత్తి చూశాడు.

"ఆయొక్క గౌరవప్రతిష్ఠలు గంగలో కలిపేస్తున్నావురా. నాన్నగారి ఆత్మకి నరకచెర పెడుతున్నావురా" అప్పటికీ అసలు విషయం ఏమిటో త్యాగయ్యకి బోధపడలేదు. అర్థం కానట్లు జపేశం వైపు చూశాడు.

"ఆయన మనకి వేద వేదాంగాలు, పురాణేతిహాసాలు, గణితశాస్త్రం, జ్యోతిశ్శాస్త్రం, ఇవన్నీ ధారపోస్తే నువ్వు వాటన్నిటినీ త్రోసి రాజని యీ దిక్కుమాలిన ముష్టిపాటలు పాడుతూ ముష్టెత్తుతావట్రా" అన్నగారేం మాట్లాడుతున్నారో అర్థమైంది-త్యాగయ్య మనసు చివుక్కుమంది.

"అన్నయ్యా! ఇది ముష్టికాదు-ఉంఛవృత్తి. పెద్దలు ఏర్పరచిన పవిత్రమైన మార్గాలలో యిదొకటి" అని నమ్రతగా నచ్చ చెప్పాలని ప్రయత్నించాడు.

"ఏడిపినట్లుంది. ఎడం చెయ్యిదీపి పుర్రచెయ్యి బెట్టమన్నాడని పేరేదైతేనేం? ఒకడిదగ్గర 'దేహీ' అనడమేగా! ఆ అనేదేదో సాటి ముష్టాడి కొంపదగ్గర కాక, కాస్త కలవాడి ముందు అనచ్చుగా!"

"త్యాగూ! ఆయొక్క తండ్రి తరవాత తండ్రంతటి వాడిని నేను నా మాట వినరా. నువ్వు జాతకాలు గుణిస్తే చాలురా. నీకు చాలా మంచి పేరుందిరా. నువ్వు చెప్పు. నేను ఫలాలు రాస్తాను. లక్షలు కురుస్తాయి. మనం కూడా మహారాజుల్లా బతకచ్చు. అంతే గాని ఈ పిచ్చి సంగీతం ఎందుకురా? నీ రామభజన పొట్టకాయనా? బట్టకాయనా చెప్పు."

అన్నగారు చెప్పవలసినదంతా చెప్పి అభిప్రాయం కోసం తమ్ముడి వంక ఆశగా చూశాడు.

"అన్నయ్యా! మన్నించండి. పొట్టకూటి కోసం విద్యని అమ్ముకోడం నాకు చేత కాదు. రామ కథను గానం చెయ్యడమే నాకు తెల్సిన మార్గం. ఆ దారి తప్పి నడవలేను" అంటూ లోపలకు కదిలాడు త్యాగయ్య. వెనకనే శిష్యులు కదిలారు.

"దారిట దారి....పీడి బతుక్కో దారి" తనలో తాను గొణుక్కున్నాడు జపేశం.

# 3

ఆది పవిత్ర కావేరీతరం. తీరాన వటవృక్షచ్ఛాయలు. ఆ ఛాయలలో అలంకరించిన తిన్నెలు. అది త్యాగయ్య ఆధ్వర్యంలో నడిచే గురుకులం. సంగీత సాధనాలయం.

సూర్యుడి ఉదయకిరణాలు ఏటవాలుగా చొచ్చుకు వచ్చి ఆ పరిసరాలకు మరింత శోభను సమకూర్చుతున్నాయి. కొమ్మలమీంచి వినిపిస్తూన్న కోకిల రవాలు అందానికి శ్రుతి కలుపుతున్నాయి. చెట్లక్రింది తిన్నెలు రంగవల్లులతో ముచ్చటగా వున్నాయి. అల్లంత దూరాన నాలుగైదు పర్ణకుటీరాలు ప్రశాంతతకు ప్రతిబింబాలుగా గోచరిస్తున్నాయి.

ఒక తిన్నెపై అయిదారుగురు విద్యార్థులు వీణెలపై 'వరాళి' రాగంలో తానం సాధన చేస్తున్నారు. మరో తిన్నెపై మృదంగ బృందం గాత్రం, మరికొందరు వేణువు సాధన చేస్తున్నారు. త్యాగయ్య ప్రతి తిన్నె దగ్గరా ఆగి, వారి సాధన క్రమాన్ని ఆలకించి ముందుకి కదులుతున్నారు.

త్యాగయ్య చేతిలో తంబుర, చిడతలు వున్నాయి. సీత ఓ చేత పూల సజ్జతో, మరో చేత రాగిచెంబుతో మంచి తీర్థం పట్టుకుని తండ్రిని అనుసరిస్తోంది. త్యాగయ్య వీణెలు సాధన చేసే తిన్నెదగ్గర ఆగి కాసేపు ఆలకించారు. సంతృప్తిగా తలవూపి మృదంగ నాదంవైపు కదిలారు.

ఇద్దరు విద్యార్థులు మృదంగాలు వాయిస్తూనే బడబడా మాట్లాడుకోవడం ఆయన గమనించాడు. గురువుగారి రాకను వారు గమనించలేదు. ఆయన చిన్నగా గొంతు సవరించుకోగానే వారు అదిరిపడి గురువుగారివంక భయం భయంగా చూశారు. ఆయన చిరునవ్వుతో

“నాయనా! సంగీత సాధన దేవుడికి పూజలాంటిది. దాని మీద శ్రద్ధ, భక్తి నిలిపి మరీ నేర్చుకోవాలి. భక్తిశ్రద్ధలు లేని సాధన ఫలించదు”—హితవు చెప్పారు. ఆ శిష్యులిద్దరూ సిగ్గుతో తల దించుకున్నారు.

త్యాగయ్య కావేరీ అంచున తోటలోకి నడిచారు. సీత తండ్రి వెనుక నడుస్తోంది. ఆయన తంబుర శ్రుతి, తుమ్మెదల ఝుంకారాలు తోట అంతటా విహరిస్తున్నాయి. తంబుర మీటుతూ కృతి అందుకున్నాడు త్యాగయ్య—

సంగీత జ్ఞానము భక్తి వినా
సన్మార్గము గలదే మనసా
భృంగి నటేశ సమీరజ ఘటజ మ
తంగ నారదాదు లుపాసించే ॥ సంగీ ॥

న్యాయా న్యాయము తెలుసును జగములు
మాయా మయములని తెలుసును దుర్గుణ
కాయజాది షడ్రిపుల జయించే
కార్యము తెలుసును త్యాగరాజునికే ॥ సంగీ ॥

# 4

అది రాజనర్తకి కావాలని కలలుకంటున్న చంచల నివాస భవనం. చక్కగా అలంకరించబడి వుంది. సువిశాలమైన సావడి. సావడి మధ్య పెద్ద పరుపులతో అమర్చిన వేదిక. పరుపుల మీద బాలీసును ఆనుకొని నిర్లక్ష్యంగా కూర్చుని వుంది చంచల. ఎదురుగా మరో పరుపుమీద రామిశెట్టి. వాళ్ళిద్దరూ సొగటాలు ఆడుతున్నారు, సరసల్లాపాలు చేసుకుంటూ. పక్కనే కూర్చుని వున్న జపేశం ఆట చూస్తూ వినోదిస్తున్నాడు.

చంచల చేతిలో పాచికలు ఎంతకీ వూడిపడకపోవడం చూసి, "వెయ్యి ఎంతసేపూ" అన్నాడు రవ్వంత విసుగ్గా రామిశెట్టి.

"నా ఇష్టం వచ్చినంతసేపు, లేకపోతే మానేసిపోండి" కోపం తెచ్చుకుని పాచికలు కిందపడేసి బాలీసుమీద వొత్తిగిలింది చంచల. చంచలకు కోపం రావడంతో శెట్టికి కంగారు పుట్టింది.

"అబ్బే అదేం కాదు. నువ్వు రాత్తిరి తెల్లవార్లూ ఆలోచించినా జాగారం చెస్తూ కూచుంటా" అన్నాడు పెదాలకు నవ్వు అతికించుకుంటూ.

"బాగా చెప్పారు. ఆ యొక్క చంచలాక్షిని చూసే ఆయొక్క కన్ను లకు అసలు రెప్పలుండవు. ఉన్నా పడవు" వంతపాట పాడాడు జపేశం.

"సర్లేగాని, ఈ పందెం గెలుస్తానా లేదా, చెప్పండయ్యావార్లూ" విలాసంగా అడిగింది చంచల.

"ఏదీ? చెయ్యేదీ" అంటూ ముందుకు జరిగి తటాలున చంచల చెయ్యి అందుకుని, మునివేళ్ళతో ఆమె చేతి గీతల్ని తడుముతూ, తన్మ యుడై పోతున్నాడు జపేశం.

"ఆహా! ఆ యొక్క జెర్రిపోతులాంటి లక్ష్మీరేఖగల చిన్నదానా! నీకు...." జపేశం మాట పూర్తికాకుండానే రామిశెట్టి చిరాకుపడి వాళ్ళిద్దర్నీ విడగొట్టాడు. చంచల నవ్వుకుని, పక్కనున్న అద్దంలో ముఖం చూసుకుని కాటుక సరిదిద్దుకునే పనిలో వుంది.

"అయివార్లూ! పెతిసారీ చెయ్యిపట్టుకు కదిపితేగాని సాముద్రికం కుదర్దా!" కోపంగా అన్నాడు రామిశెట్టి. జపేశం గతుక్కుమన్నాడు.

"నువ్వు జోశ్యం చెప్పక్కర్లేదుగాని నామీద నీ తమ్ముడిసేత పాట రాయించగలవా చెప్పు" రామిశెట్టి ఆశగా అడిగాడు.

"భలే వారే! గట్టి రామిశెట్టి గారడగడం, ఆ యొక్క మావాడు— ఏవుందండీ—వాడు రాముడి మీద ప్రతి నిత్యం పాడుతూనే వుంటాడు గదా—ఆ యొక్క రాముడికి ఇటు 'గట్టి' అటు 'శెట్టి' తగిలించి పాడరా అంటే పాడి పారేస్తాడు. నేను ఆ యొక్క తండ్రి తరవాత తండ్రంతటి వాడిని కదా" క్షణం కూడా ఆలోచించకుండా, ఏ మాత్రం సంశయం లేకుండా చెప్పేశాడు జపేశం.

"మరయితే రాయించవేం" అని అడిగాడు శెట్టి. అందుకు సీక్కు నమిలి నట్లు నవ్వి "గట్టి రామిశెట్టిగారు గట్టిగా పలకాలేగాని వాడి నోట పాట

పలికించడం ఎంత సేపు" బొటనవేలుని, చూపుడు వేలుని కలిపి డబ్బు అనే అర్థం స్ఫురించేలా మీటుతూ అన్నాడు జపేశం.

అప్పటివాకా వీరి మాటల్ని వినోదిస్తున్న చంచల ఒక్కసారి తుళ్ళి పడి వేదిక మీంచి లేచింది. త్యాగయ్య పాట ఆ ఇంటివైపే వస్తోంది.

రమించు వారెవరురా రఘూత్తమా నిను వినా
శమాది షడ్గుణ గణ సకల భువన జనులలో
॥రమించు॥

'రమ్'యనే సుమర్మము 'రామ' యనే శర్మము లస
దమరవరుల కబ్బెనో త్యాగరాజ సన్నుత

సొగటాలు ఎగరేసి, చేతితో ఆ పాటకు లయ వేస్తూ, కాలితో చిందువేస్తూ గుమ్మంలోకి నడిచింది చంచల. రామిశెట్టి, జపేశం ఆమెను చూస్తూ వుండిపోయారు అక్కడే.

పాట గుమ్మం దాటి, చూపు దాటి, చెవి దాటి వెళ్ళేదాకా చంచల వీధిగుమ్మంలోనే నిలబడి వుంది. కాసేపటికి చంచల నిట్టూర్చి మళ్ళీ పరుపు మీదికి వచ్చింది. ఆమె మనసు మనసులో లేదని గమనించి—

"చంచలాక్షి! నీ పేరులాగానే నీ చూపులూ, నీ మనసూ కూడా చంచలమే-ఎలా అన్నాను అయ్యోర్లూ" రామిశెట్టి అభినందనల కోసం జపేశం వంక చూశాడు.

"అద్భుతం గదండీ? నాదగ్గర మీకున్నంత డబ్బే వుంటే మీకీపాటికి అక్షరలక్షలు యిచ్చేద్దును తప్ప-మీలా బద్ధకించను" జపేశం ధోరణి డబ్బు మీదికి మరలే సరికి శెట్టి తక్కున ధోరణి మారిస్తే అన్నింటికీ మంచిదని-

"ఎందు కవెల్లావు? పూనక వొచ్చినట్లు" చంచలని అడిగాడు చిరు కోపం ప్రదర్శిస్తూ—

"ఆ పాట విని"- తన్మయురాలైంది, చంచల ఆ మాట చెప్పే టప్పుడు.

"ఏదీ? ఆ ముష్టెత్తే... అయ్యోరి తమ్ములుం గారి...." శెట్టిగారి వ్యాఖ్య పూర్తి కాకుండానే జపేశం అందుకున్నాడు—

"భాగా చెప్పారు. వాడివి పిచ్చి-వెధవ పాటలు. చంచలా! ఆ యొక్క వద్దురా అంటే వినడు."

వారిద్దరి సంభాషణా చంచలకి చిరాకు కలిగించింది.

"ఆయొక్కా లేదు. అరటి తొక్కా లేదు. ఆయన పిచ్చి పాటలే నా కిష్టం"

రామిశెట్టి ఇరుకున పడ్డాడు. వెంటనే తిప్పుకుని "అంతే కదా" అన్నాడు అనుకూలంగా. శెట్టిగారి ధోరణి మారగానే జపేశం కూడా తన వైఖరి మార్చేసి—

"నే జెప్పేదదే గదా! చంచలా! వాడి గుండెల్లో దేవుడి గుడుందే.... వాడి గొంతులో కోకిల కాపరం పెట్టిందే—అందుకే అలా పాడేస్తాడు. తండ్రి తరవాత తండ్రంతటి వాడిని, వాడిని పొగిడితే వాడికి ఆయుక్షీణం- అందుకని తప్ప...."

"అయ్యోరూ! హరికథ మానేసి నామాట వినండి. నేను రాజుగారి ముందు నాట్యమాడ్డానికి పనికొచ్చే నాలుగు పాటలు ఆయనచేత రాయిం చండి"-చంచల అడిగింది.

"రాయించడమా?....వాడిచేత నీ గుమ్మంలో పాడించేస్తా- మళ్ళీ మాట్లాడితే నాట్య మాడించేస్తా-కాని-నువ్వు ఆయొక్క శెట్టిగారింటి పేరులా-గట్టిగా-పురమాయించాలి" అంటూ మళ్ళీ వేళ్ళు మీటి కాసుల సంగతి చెప్పాడు.

చంచలాక్షి మెడలోంచి ముత్యాలహారం తీసి యిచ్చింది.

"ఇది మీకు-రేపు మీరాయన్ని—అదే ఉంఛ్వాటనం వెళ్ళేప్పుడు-నా గుమ్మంలో ఆపు జేస్తే...."

"అదెంతసేపే పిచ్చిపిల్లా! ఆపేయటం గాదు. నీయింటి రాట కట్టేస్తా" ఉత్సాహంగా వాగ్దానాలు చేసేస్తున్నాడు జపేశం.

"మీరు ఆపితే, నేనే వారికి పట్టుబట్టలూ, కానుకలూ యిచ్చి, కాళ్ళకి మొక్కి పాట కావాలని అడుగుతాను" చంచల చెప్పింది.

"తథాస్తు-నా మాట వాడికి సుగ్రీవాజ్ఞ" అమీనగ ముట్టిన వుత్సాహంతో ఇంటికి నడిచాడు జపేశం.

# 5

త్యాగయ్య అన్నగారి పంక్తిన భోజనానికి కూర్చున్నాడు. కొంచెం అవతల పక్కగా గంగమ్మ కాలుబార చాపుకుని భోజనం చేస్తోంది.

కమలాంబ అందరికీ వడ్డిస్తోంది. సీత విసనకర్ర పట్టుకుని తండ్రికి, పెద తండ్రికి గాలి విసురుతోంది.

"త్యాగం! తండ్రి తర్వాత తండ్రతటి వాడిని. నా మాటకాదంటావా? నాన్నగారే ఆజ్ఞాపిస్తే...." జపేశం గొంతు ఆజ్ఞాపిస్తున్నట్టువుంది.

అన్న చెప్పిన మాటవిని యిష్టం లేదనట్టు తల వూపాడు త్యాగయ్య.

"మనసుకు ఒప్పని పని చెయ్యమని మన తండ్రిగారు మాత్రం అనతిస్తారా అన్నయ్యా" తలవంచుకునే వినయంగా అన్నాడు.

జపేశం తమ్ముడి మీది కపి అంతా అన్నం మీద చూపి కలుపుతున్నాడు.

"ఆ దైవకృపవల్ల నాకు అబ్బిన కొద్దిపాటి సంగీతాన్ని సాహిత్యాన్ని నా సర్వస్వాన్నీ నా రాముడికేనాడో కైంకర్యం చేసుకున్నాను." మరిది మాటకి గంగమ్మ చాలా చిరాకు పడ్డది.

"ఈ నాడు కాసుల కాశించి ఒకరింటి గుమ్మంలో నిలబడలేను. ఉంఛ వృత్తికి అది ధర్మంకాదు."

త్యాగయ్య ధర్మసూక్ష్మాలు గంగమ్మకి బొత్తిగా నచ్చలేదు. పుర్ర చెయ్యి ఎగరేస్తూ నోరు చేసుకుంది.

"చాల్లేవయ్యా! నీ మెట్ట వేదాంతం-నువ్వూను. ఓ అరటిపండు కర్పూరం ముక్క పళ్ళెంలో పట్టుకుని నిలబడితే దేవుడిపల్లకి, దేవుడి రథం, ఆ దేవుడూ, వాడి అమ్మ మొగుడూ కూడా గుమ్మంలో గంటసేపు ఆగుతారు."

వదినగారి మాటలు వినలేక తినడం ఆపి, కళ్ళు మూసుకుని 'హరి, హరి' అనుకున్నాడు త్యాగయ్య.

"నువ్వేం వాళ్ళకన్నా పొడిచేశావా? ఇంకా ఎత్తునుంచి దిగొచ్చావా నాయనా" వదినెగారి వాక్ప్రవాహానికి ఆనకట్ట ఎలా కట్టాలో త్యాగయ్యకి అర్థం కాలేదు.

"నలుగుర్లాగే నువ్వూ మెడకో గుదిబండని కట్టుకునికాపురం చేస్తున్నావు. పిల్ల పెళ్ళీడు కొచ్చింది. సంసారం చట్టుబండలూ చూసుకోకుండా నరుణ్ణి అడగను—నరుణ్ణి అడగను అంటూ రాంభజన చేస్తూ ఊరేగితే-" భార్య మాటలను జపేశం అందుకుని పొడిగించాడు—

"అయొక్క రాముడూ నరుడేగా పుట్టినప్పుడు? దరిమిలాను నీబోటి వాళ్ళు దేవుణ్ణి చేశారుగాని."

త్యాగయ్య భోజనం చెయ్యడం ఆపి నిరుత్తరుడై కూర్చున్నాడు. జపేశం భోజనం యథావిధిగా చేస్తూనే సంభాషణ సాగిస్తున్నాడు.

"చూడు మరిదీ! నరవాసన అంత నచ్చకపోతే సన్యాసం పుచ్చుకుని నరమానవులు లేని చోటికి పోవాలి" ఆమె మాటలకు కమలాంబ నొచ్చుకుంది. తలవంచుకొని పక్కకి తప్పుకొంది, అంతకంటె ఏమీ చెయ్యలేక.

"బాగా అన్నావు. ఏరా? ఆ పని చేస్తావా?" తమ్ముణ్ణి సూటిగా చూస్తూ అడిగాడు జపేశం.

"ఈశ్వరేచ్ఛ అదే ఐతే అలాగే జరుగుతుంది" అన్నాడు త్యాగయ్య ముక్తసరిగా.

జపేశం అగ్గిమీద గుగ్గిలం అయ్యాడు.

"అంతే తప్ప వాళ్ళకి నేనిచ్చిన మాట నిలబెట్టవు."

"మన్నించడన్నయ్యా, అది సాధ్యం కాదు" తమ్ముడి జవాబులో అన్నగారి కోపం తారాస్థాయికి చేరింది. చేతిలో వున్న నీళ్ళ చెంబుని త్యాగయ్య విస్తరి మీద విసిరి కొట్టాడు. ఆ విస్తరినిండా నీళ్ళు ఒలికాయి.

కమలాంబ అదరిపడి చూసింది. ముందుకు రాబోయి విగ్రహించుకుంది. ఆమె కంట నీరు తిరిగింది. కూతురు సీత హడలిపోయి బిక్కచచ్చి నిలబడి వుంది. తండ్రివంక అమాయకంగా చూసింది.

త్యాగయ్య నిశ్చలంగా తలవంచుకొని, చూపువాల్చి కూచున్నాడు. తలెత్తి భార్యను చూశాడు. బాధపడవద్దని కనులతోనే చెప్పాడు. నిశ్చలంగా కూచున్న త్యాగయ్య మనసుకు బోధ చేసుకున్నాడు.

> శాంతము లేక సౌఖ్యము లేదు-సారస దళ నయన
> దాంతునికైన వే-దాంతునికైన
> దారసుతులు ధన ధాన్యములుండిన
> సారెకు జపతప సంపద కల్గిన ॥శాంత॥

# 6

క్రిందటి రోజు జపేశం చేసిన వాగ్దానాన్ని పురస్కరించుకుని చంచల పొద్దున్నే ఒక పెద్ద పళ్ళెంలో పట్టుబట్టలు, పది బంగారు కాసులు,

తాంబూలం పళ్ళు పట్టుకుని- చక్కగా ముస్తాబై వీధి మెట్లమీద నుంచుంది. రామిశెట్టి కండువా కప్పుకుని దర్జాగా ఆమె సరసన నిలబడ్డాడు. మారంగా త్యాగయ్య పాట విన్పించింది.

రామిశెట్టి ఎందుకైనా మంచిదని "చూడు పిల్లా! పాటలు ఒకటో రెండో కావాలని అడక్కు- పాతికో పరకో రాసిమ్మను. దాంతోపాటు మన మీద కూడా నాలుగు పద్యాలు, పాటలు చెప్పమను. 'కష్టం వుంచుకోము. బాగా ముట్ట చెబుతాము' అని చెప్పు" అని సలహా యిచ్చాడు——

రామిశెట్టి సలహాకి "ఉండవయ్యా మింద మగడా! తాదూర సందు లేదు- మెడకో డోలు" చిరాకు పడింది చంచల. త్యాగయ్య బృందం గానం చేసుకుంటూ చంచల వీధికి వచ్చింది.

శూర అహల్యను చూచి బ్రోచితివి
ఆరీతి ధన్య సేయవే త్యాగరాజ గేయమా
శ్రీరామ పాదమా నీ కృప చాలునే-చిత్తానికి రావే
॥శూర॥
వారిజభవ సనక సనందన వాసవ శ్రీనారదాదులెల్ల
పూజించే

శ్రీరామ పాదమా నీ కృప చాలునే-చిత్తానికి రావే.

వారు చంచల ఇల్లు సమీపించారు. చంచల మెట్లుదిగి సిద్ధంగా నిల బడ్డది. శెట్టి గర్వంగా మీసం దువ్వాడు.

కాని త్యాగయ్య చూపు అటు లేనే లేదు. భక్తిపారవశ్యంలో పాడుకుంటూ సాగిపోయాడు. ఆ వీధి మలుపు తిరిగాడు. చంచల, రామిశెట్టి కొయ్యబారి పోయారు. చంచల కోపంగా చేతిలో పళ్ళాన్ని నేలకేసి కొట్టింది. ప్రశాంత వదనంతో త్యాగయ్య నడిచి వెళుతున్నాడు. పాట క్రమేపీ దూరమైంది. చంచల రోషంతో, అవమానంతో వణికి పోతోంది. జపేశం పరుగు పరుగున వచ్చాడు. నేలపాలయిన కాసుల్ని శెట్టి పళ్ళాని కెత్తుకున్నాడు.

"రాజుగారి సభలో చేరాక, నీ పని పడతాను" హూంకరించింది చంచల.

"ఆ యొక్క పిచ్చిక మీద బ్రహ్మాస్త్రమా పిచ్చిపిల్లా" ఓదార్పుగా అన్నాడు జపేశం.

"చాల్లేవయ్యా నా పరువు దీశావు గదయ్యా" విసుక్కున్నాడు శెట్టి.

"అబ్బే! వాడికి చచ్చే మతిమరుపు" అని నచ్చచెబుతూ పైకండువా లోంచి నాలుగు తాళపత్రాలు తీసి అందిస్తూ-

"ఇదిగో ఆ యొక్క రాత్తిరి తెల్లవార్లూ మేలుక్కూచ్చుని నీకోసం రాశాడు పాటలు. నా చేతికిచ్చాడు. అన్నయ్యా ఇవిగో పాటలు ఒకవేళ నేను మర్చిపోతే ఆవిడకి ఒప్పగించు" జపేశం చేతిలోంచి పత్రాలు అందుకుని చూస్తోంది చంచల. ఆమె కళ్ళు మెరుస్తున్నాయి. జపేశం ఆమె ముఖ కవళికల్ని గమనించి——

"ఆ యొక్క రాంభజనలోపడి, ఆగడం మర్చిపోయుంటాడు తప్ప- నా మాటంటే ఎంత గురి! ఎంత భక్తి!" అన్నాడు జపేశం.

చంచల చూపుడు వేలితో ఆ తాళపత్రం మీదనే తాళం వేస్తూ పరవశించి పోతోంది.

"అక్షరలక్షలు చేస్తాయి. ఏమంటావ్? అందాకా...." అని పళ్ళెం లోంచి పది కాసులు తీసుకోబోయాడు. శెట్టిగారు ఆపి, సగం మాత్రం తీసుకోనిచ్చాడు-

"అందాకా సగం చాలు-రాజాగారి కొలువులో ఆడి, ఆరు బాగుందని సొమ్ములిస్తే కడమావి ఆనక." శెట్టిగారి మాటలకు జపేశానికి చిర్రెత్తి పోయింది.

"అందుకే మా తమ్ముడికి డబ్బన్నా, డబ్బున్న వాళ్ళన్నా మహా చెడ్డ చిరాకు" ముఖం చిట్లించుకున్నాడు జపేశం. చేతిలో కాసులు జారి పోయినందుకు.

# 7

చంచలకు రాజాస్థానం నుంచి పిలుపు వచ్చింది. శరభోజి మహారాజు సపరివారంగా కొలువు తీరి వున్నారు. ఆస్థాన విద్వాంసులైన శొంఠి వెంకటరమణయ్య భాగవతార్, ప్రముఖ రాజోద్యోగులు వుచితాసనాలు అలంకరించి వున్నారు. జపేశం, రామిశెట్టి ముందు వరుసలో దర్పంగా కూచుని వున్నారు, రాజమందిరంలో చంచల నాట్యప్రదర్శన ప్రారంభ మయింది—

ఓడను జరిపే ముచ్చట కనరే
వనితలార నేడు—
ఆడువారు యమునకడ కృష్ణుని కూడి
ఆడుచు పాడుచు అందరు చూడగ ॥ ఓడను ॥

కొందరు హరికీర్తనములు పాడ
కొందరానందమున ముద్దులాడ
కొందరు యమునాదేవిని వేడ
కొందరి ముత్యపు సరులసియాడ ॥ ఓడను ॥

కొందరు తడబడ పాలిండ్లు కదల
కొందరు బంగరు వల్వాలు వదల
కొందరు కుటిలాలకములు మెదల
కొందరు బల్కుచు కృష్ణుని కథల ॥ ఓడను ॥

నాట్యం పూర్తి కాగానే రాజుగారు చంచలను చూపి 'భళీ' అన్నారు. సభికులంతా హర్షధ్వానాలు చేశారు. చంచల వినమ్రంగా రాజుగారికి, సభకు నమస్కరించింది—

"నృత్యం కనులవిందు-గీతం, సంగీతం వీనుల విందు—మూడూ కలిపి హృదయానికి విందు" రాజుగారు ప్రశంసా వాక్యాలు పలికారు. సభికులలో హర్షాతిరేకం చెలరేగింది.

రాజుగారు క్షణకాలం ఆగి, వెంకటరమణయ్యగారిని చూపి, "వెంకటరమణయ్యగారూ! నృత్యం కన్న గీతం మహత్తరంగా వుందనిపించింది" అభిప్రాయం వెలిబుచ్చారు. ఆ మాటలకు చంచల ముఖం కొద్దిగా చిన్నబోయింది.

"ఇట్టి సంగీతం, ఇంత చక్కని సాహిత్య శిల్పం. ఇవి సంకల్పించి కల్పించిన మహనీయు లెవరో?" అన్నారు శరభోజి మహారాజు.

సభ మధ్యలో నిలబడివున్న చంచల రెండడుగులు ముందుకు వచ్చి —"మహాప్రభూ! ఈ పాట పలికిన వారు మా తిరువయ్యూరులో భజన పాటలు పాడుకునే ఒకానొక అయ్యవారు. నేను విని, బాగుందని, వారిని సత్కరించి గైకొని, దానిని ప్రభువుల సమక్షంలో సమర్పించ తగునని, అందుకు తగినంతగా మార్పులు చేర్పులూ చేసి, మెరుగులు దిద్ది ఈవిధంగా, ఈ రూపంలో తమ ఆమోద ముద్ర పడడంతో ధన్యురాల నయ్యాను."

చంచల చెప్పడం ముగించగానే సభలో సముచితాసనంపై కూచుని వున్న శొంఠి వెంకటరమణయ్యగారు మందహాసం చేసి-

"కొందరు త్యాగరాజు సఖుడే యనగ...." అన్నారు. చంచల ఆ మాటలు విని ఉలిక్కిపడి వెంకటరమణయ్యగారి వంక చూసింది.

"చిరంజీవీ! మీ వూరి అయ్యవారి పాటలో చిట్టచివరి చరణం మరి చావు చిన్నారి!" అన్నారు రమణయ్యగారు కొద్దిపాటి వ్యంగ్యాన్ని స్ఫురింపచేస్తూ.

చంచలకు ముచ్చెమటలు పట్టాయి. రాజుగారు కుతూహలంగా పరిస్థితిని గమనిస్తున్నారు. సభలో కలకలం ప్రారంభమైంది. రామిశెట్టి, జపేశం కంగారు పడుతున్నారు. ఏమిచెయ్యాలో అర్థంకాక——

శొంఠివారు రాజుకేసి తిరిగి "మహారాజా! తమను, ఈ సభనూ సమ్మోహితులను చేసిన ఈ వాగ్గేయ కర్త నా శిష్యుడు- చిరంజీవి కాకర్ల త్యాగబ్రహ్మం- నౌకాచరితము అనే సంగీత ప్రబంధం కల్పించి, దృశ్య కావ్యంగా ప్రయోగించాడు. ఈ కీర్తన ఆ ప్రబంధంలోది.

పూజ్యులూ కీర్తిశేషులూ అయిన తమ పితృపాదులు తులజాజీ మహారాజుగారి సమక్షాన వీరి తండ్రి కాకర్ల రామబ్రహ్మంగారు శ్రీ వాల్మీకి రామాయణం పై వ్యాఖ్యానం చెప్పేవా రానాడు. ఈ చిరంజీవి త్యాగబ్రహ్మం రామాయణ శ్లోకాలు చదవటం...." వివరించారు. ఆ మాటలు విని "తమరెప్పుడూ నాకీ విషయం చెప్పనే లేదే!" అన్నారు రాజుగారు.

"అంతా ఆ పంచనాదేశ్వరేచ్ఛ. చిరంజీవి త్యాగరాజు పది పన్నెండేళ్ళ పసివయసులో నా దగ్గరకు శిష్యుడుగా వచ్చాడు. ఆనాడా బాలుడు ఏక సంథాగ్రాహి. ఈశ్వరుడు నాకు ప్రసాదించిన విద్యనంతటినీ ఒకే ఒక సంవత్సరంలో అంటే పన్నెండు పున్నెమలలో స్వీకరించాడు. 'ఇటుపైన ఏమి?' అని అడిగాడు. నేను విస్తుపోయాను. 'నాయనా! సంగీత సాహిత్యాదులు సముద్రాలు అనంతాలు-నాకు తెలిసిన కొద్దిపాటి విద్యనీ గ్రహించావు. ఇంతకు మించిన విద్య నీకాపరమేశ్వరుడే అనుగ్రహిస్తాడు' అని చెప్పాను."

శరభోజి మహారాజు శొంఠివారి మాటలను ఎంతో ఆసక్తితో విన్నారు. నాటి సభ ముగిసింది. చంచల నాట్యం పరోక్షంగా త్యాగయ్య ప్రతిభను రాజుగారు తెలుసుకోడానికి దోహదం చేసింది.

# 8

ఉదయకిరణాల కాంతిలో కావేరి వింత సొగసులు సంతరించుకుంటోంది.

కావేరీతీరాన చెట్లనీడన కూర్చుని, త్యాగయ్య ఓంకారనాద సాధన చేస్తున్నారు. త్యాగయ్య పలికే ఓంకారానికి ప్రతిధ్వనిగా మరో ఓంకారం వినుపించసాగింది. ఆయన కంఠానికి మరో కంఠం జత కూడినట్టు వినిపిస్తోంది.

నాదతను మనిశం శంకరం
నమామి మే మనసా శిరసా
మోదకర నిగమోత్తమ సామ
వేదసారం వారం వారం ॥నాద॥

సద్యోజాతాది పంచవక్త్రజ
సరిగమ పదనీ వరసప్తస్వర
విద్యాలోలం విదళిత కాలం
విమల హృదయ త్యాగరాజపాలం॥ నాద॥

కీర్తన పూర్తయింది. త్యాగయ్య నెమ్మదిగా కన్నులు తెరిచాడు. ఏదో సంశయం కలిగింది. వెను తిరిగి చూశాడు. కొద్దిదూరంలో మరూ చెట్టు క్రింద ఒక సాధువు కూర్చుని ఏకె తార మీటుతున్నాడు. ఆ తేజస్విని ఆపాద మస్తకం చూశాడు, త్యాగయ్య. ఇంతవరకు తన మాటకు ముందుండి పల్కించింది ఆ మహానుభావుడేనని త్యాగయ్య నిశ్చయించుకొన్నాడు. చేతులు జోడించి ఆ సాధుపుంగవునికి నమస్కరించాడు.

"స్వామీ తమరు?" ఎవరన్నట్టు అడిగాడు త్యాగయ్య.

"నా పేరూ వూరూ ఎందుకులే నాయనా? నేనూ నీలాగే సంగీతంపై భక్తిశ్రద్ధలుగలవాడిని, ఇంతకుముందు నువ్వు పడుతున్న తపన గమనించి

నేనూ ఒక్క క్షణం వరస కలిపాను" ఆ మహానుభావుని మాటలకు త్యాగయ్య నివ్వెరపోయి "వరస కలపడం కాదు, పలికించారు. కొద్ది క్షణాల క్రితం నాకు కలిగిన అనుభూతి ఇప్పుడే అర్థమవుతోంది" త్యాగయ్య పలుకులాలకించి చిన్నగా నవ్వాడు సాధువు. భుజాన వున్న జోలె నుంచి ఒక తాళపత్ర గ్రంథాన్ని తీసి—

"ఇది పరిశీలించు నాయనా" అంటూ త్యాగయ్యకు అందించాడు.

త్యాగయ్య పదిపన్నెండు గుచ్ఛాలున్న ఆ తాళపత్ర గ్రంధాన్ని భక్తితో అందుకుని, కన్నుల కద్దుకొని పరిశీలనగా చూశాడు. దానిపై "స్వరార్ణవం" అని వ్రాసివుంది, ఆశ్చర్యంతో తలెత్తి చూశాడు త్యాగయ్య.

ఎదుట సాధువు లేడు! ఆకాశంలోంచి ఓంకారనాదం వీణపై వినబడింది. త్యాగయ్య అప్రయత్నంగా పైకి చూశాడు. ఆకాశంలో నారదుడు సాక్షాత్కరించాడు!

త్యాగయ్య సంతోషంతో వుప్పొంగిపోయాడు. తన జన్మ ధన్యమైందనుకున్నాడు. నారదుని స్తుతిస్తూ ఓ కృతి గానం చేసాడు.

శ్రీ నారదమౌని గురురాయ కంటి
ఏనాటి తపమో గురురాయ
మనసార కోరితి గురురాయ నేడు కనులార కనుగొంటిని
శ్రీ నారదమౌని-రాజిల్లు వీణెగల గురురాయ
త్యాగరాజుని బ్రోచిన గురురాయ-శ్రీ నారదమౌని ॥శ్రీ॥

పూర్ణచంద్రబింబంలో నారదమహర్షి గోచరించి త్యాగయ్యను ఆశీర్వదించాడు.

"నాయనా! ఆ జగన్మాత పార్వతీదేవికి పరమేశ్వరుడుపదేశించిన సంగీత శాస్త్రం అంతా పొందు పరచిన గ్రంథం ఆ 'స్వరార్ణవం.' ఆ పవిత్రగ్రంథం నీ హృదయాంతర్గతమయిన నాదశక్తిని, ఉద్దీప్తం చేస్తుంది. నీలో జ్ఞానదీపాన్ని వెలిగిస్తుంది. నీవు తలపెట్టి సాగిస్తున్న తొంబది ఆరు

కోట్ల రామనామ జపం సంపూర్ణం కాగానే శ్రీరామ కటాక్ష వీక్షణ వర ప్రసాదివి కాగలవు" అని చెప్పి మహర్షి అంతర్ధానమయాడు.

త్యాగయ్య బ్రహ్మానందభరితుడై స్వరార్ణవ గ్రంథాన్ని కన్నుల కద్దు కొని, పైనున్న నారద మహర్షికి అంజలి ఘటించాడు.

# 9

క్రోవెల మంటపంలో కూర్చుని త్యాగయ్య రామనామం జపిస్తున్నాడు. నేపథ్యంలో ఓంకారం వినిపిస్తోంది. శ్రీ రామనామం శతసహస్రాధి కమై రోదసి నిండిపోతోంది. అంతా రామమయంగా వుంది.

ఆకాశంలో శ్రీ రామచంద్రుడు బాలరాముని రూపంలో దర్శన మిచ్చాడు. చల్లని చిరునవ్వులు వెదజల్లుతున్నాడు. ఆయన ధరించిన చేలము ధగద్ధాయ మానంగా వుంది. త్యాగయ్య ముగ్ధుడై, తన్మయుడై వర్ణించడానికి మాటలు చాలక, స్వరాలు అందక, అభిక్యావేశంలో పాడు తున్నాడు—

బాల కనకమయచేల సుజన పరిపాల
శ్రీరమాలోల
విధృత శరజాల, శుభధ కరుణాల వాల
ఘననీల నవ్య వనమాలికా భరణ...

కంటనీరు కరడు కట్టింది.

ఇంతలో రాముడు అంతర్ధానం చెందాడు. త్యాగయ్య ముఖం వెల వెల పోయింది. దీనంగా చేతులు జోడించి

ఏల నీదయ రాదూ?
పరాకు చేసే వేలా?
సమయము కాదు—

అంటూ పరిదీనంగా వేడుకో సాగాడు. చేతులు ముకుళించి అర్ద్రిత
నిండిన హృదయంతో ఆహ్వానించాడు-

రారా! దేవాది దేవా
రారా! మహాను భావా!
రారా! రాజీవ నేత్ర
రఘువీర పుత్ర
సారతర సుధాపూర హృదయ
పరివార జలధి గంభీర
దనుజ సంహార దశరథకుమార
బుధజన విహార
సకల శ్రుతి సార
నాదుపై ఏలా
నీదయ రాదూ?

త్యాగయ్య కన్నులు ఆనందం, దుఃఖం. కలబోసుకున్న కన్నీటితో
నిండి మసగబారి పోయాయి.

ఆ మసక తెరలో చిరుదీపం వెలిగి, క్రమంగా అది పెరిగి, పెరిగి
శతకోటి సూర్యప్రభాభాసమై విజృంభించి శాంతించింది.

పచ్చని అడవిమధ్య నీలమేఘశ్యాముడు రాముడు, వెంట విశ్వామిత్ర
మహర్షి, తన తమ్ముడు లక్ష్మణుడు యాగరక్షణార్థం తరలి వెళుతున్న
భువనైక మోహన దృశ్యాన్ని, వెనుతిరిగి చూస్తూ తన్మయుడై పోతున్న
బ్రహ్మర్షినీ, తలవంచుకుని నడిచే బాలరామునిలో పరమాత్ముడు అభిన
యించే సమ్మోహనాస్త్రాన్ని త్యాగయ్య దర్శించాడు. అంతలో చిరుగాలికి
బాలరాముని ముంగురులు కదిలాయి. ఆ దృశ్యం త్యాగయ్య హృదయంలో
కోటివీణెలు మీటినట్టు కాగా గుండె ఝల్లు మనిపించింది. హృదయం
స్పందించి పాటగా సాగింది-

అలకలల్ల లాడగ గని
ఆ రాణ్ముని ఎటు పొంగెనో
అలకలల్ల లాడగ గని-

అంతలో-మిథిలానగరం, జనకరాజ సభ దృగ్గోచరమైనాయి. శివ ధనువు ఎక్కుపెట్టే వీరులు లేని తరుణాన విశ్వామిత్రుడు రాముని వంక చూశాడు. శ్రీరాముడు గురువుగారిని పసివాడివలె అమాయకంగా చూశాడు. బ్రహ్మర్షి నవ్వుకుని, గాంభీర్యం తెచ్చుకుని ఠీవిని అభినయించి కార్య సాఫల్యం చెయ్యమని కనుసైగ చేశాడు. లక్ష్మణుని ముఖంపై చిరునవ్వు తొణికింది.

రాముడు తలవంచి సభకు నమస్కరించాడు. వీరునివలె తల పైకెత్తి సభంతా ఒక్కసారి కలయచూశాడు-మోవిపై ముంగురులు నాట్య మాడాయి-ఒక్కొక్క దృశ్యమే త్యాగయ్య కనులముందు కనిపిస్తోంది. దృశ్యాన్ని పాటకడుతున్నాడు-

ముని కనుసైగ దెలిసి
శివ ధనువును విరిచే సమయమున
త్యాగరాజ వినుతుని, మోమున రంజిల్లు
అలకలల్ల లాడగ గని
ఆరాణ్ముని ఎటు పొంగెనో
అలకలల్ల లాడగ గని
ఆ... ఆ.... ఆ....

అంతా రామమయంగా వుంది త్యాగయ్యకు. ప్రతిచోటా రాముడే కన్పిస్తున్నాడు-

పెరట్లో తులసికోట దగ్గర నిలబడ్డ కూతురు సీత, త్యాగయ్య కనులకు బాలరాముడిలా కన్పించింది. తనకేసి వింతగా చూస్తున్న తండ్రిని గమనించి విస్తుబోయింది. సీత చెంపన చేతులు చేర్చి వింతగా చూసి,

చిన్నగా నవ్వింది. త్యాగయ్యకు ఆమె 'బాలరాముడి' లాగే కనిపించింది. రామచంద్రుడి ప్రసన్నవదనం త్యాగయ్యకు ప్రేరణనిచ్చింది.

సొగసు చూడ తరమా
మ గ స రీ గ మమపా
నీ....నీ సొగసు చూడ తరమా
నిగ నిగ మనుచు కపోలయుగముచే
మెరయు మోము సొగసుచూడ తరమా
చిరునవ్వో ముంగురులో
మరి కన్నులతేటో
వర త్యాగ రాజార్చిత వందనీయ
ఇటువంటి సొగసుచూడ తరమా
నీ సొగసు చూడ తరమా-

త్యాగయ్య కంట ఆనందబాష్పాలు జాలువారాయి. సీత తెల్లబోయి నిలబడివుంది.

త్యాగయ్య ఆశువుగా గానం చేసే కృతులను శిష్యులు మామిడి పలకలపైన, తాటాకుమీద రాసుకుంటున్నారు. ఉంచవృత్తి యాత్రలో, కోవెల మంటపంలో సందర్భోచితంగా ఆయన గానం చేసే పదాలను శిష్యులు లిఖితపూర్వకంగా శ్రద్ధ పరచేవారు. సంగీత గురుకులంలో శిష్యులతో కూర్చుని

సామజ వర గమన
సాధు హృత్సార సాబ్జపాల
కాలాతీత విఖ్యాత

సామజ వర గమన
సామ నిగ మజ సుధామయ గాన విచక్షణ
గుణశీల దయాలవాల-మాంపాలయ సామ॥

త్యాగయ్య పాడుతుండగా శిష్యులు సాహిత్యం, స్వరాలు రాసు కుంటున్నారు. లోపలనుంచి ఒక రాగి పాత్రలో మంచినీళ్ళు పట్టుకుని కమలాంబ, భాగవత గ్రంథంతో సీత వచ్చి ఆయన దగ్గర వుంచారు.

"భాగవతం చదువుతుంటే మీ అమ్మాయికి కొన్ని ధర్మసందేహాలు కలిగాయి." కమలాంబ సౌమ్యంగా అన్నది.

త్యాగయ్య చిరునవ్వుతో కూతురును చూసి "అడుగు తల్లీ" అన్నారు వాత్సల్యంగా.

సీత అంతలోనే భిడియపడి "నువ్వుచెప్పు" అన్నట్లు తల్లికేసి చూసింది.

"దేవుడు రామావతారంలో సత్య వాక్పాలనం చెయ్యాలని చెప్పాడు. కృష్ణావతారంలో ధర్మరాజుచేత దగ్గరుండి అసత్యం చెప్పించాడు" కూతురు సందేహాన్ని తల్లి కమలాంబ చెప్పింది.

"అశ్వద్ధామ హతః కుంజరః కదూ అయ్యగారూ" అన్నాడు అక్కడే వున్న ప్రియ శిష్యుడు గణపతి.

"అవును ధర్మ సంరక్షణ కోసం ఆయన ఆ పని చేయించడం జరి గింది"-సందేహ నివృత్తి చేశాడు త్యాగయ్య.

వెంటనే కమలాంబ మరో ధర్మసందేహం వెలిబుచ్చింది.

"రామావతారంలో ఒక్కటే మాట, ఒక్కటే బాణం, ఒక్కటే భార్య అన్నాడు. కృష్ణావతారంలో ఎనమండుగురు భార్యలు పదహారువేల మంది గోపికలు...."

భార్యవేసిన ప్రశ్నకు త్యాగయ్య కన్నులు పైకెత్తి ఆమెను చూసి- "ఇది నీ సందేహం అనుకుంటాను" అన్నాడు. కమలాంబ సిగ్గుపడి, చిరునవ్వుతో తలపక్కకి తిప్పుకుంది.

"పరమాత్ముడు లీలా వినోది. ఆయన కల్పించి ప్రయోగించే జగన్నాటకంలో సూత్రధారీ, పాత్రధారీ కూడా ఆయనే-ఆయన బహు చమత్కారి, సరసుడు. సరస సామదాన భేద దండ చతురుడు. బోధించిన సన్మార్గ వచనములను బొంకుచేసి తాను పట్టిన పట్టును సాధించుకోగల సర్వ సమర్థుడు.

సమయానికి తగు మాటలాడెనే
రంగేశుడు సద్గంగా జనకుడు
సంగీత సాంప్రదాయకుడు
సమయానికి తగు మాటలాడెనే
గోపీజన మనోరథ మొసంగలేకనే
గేలియు చేసెవాడు
వనితల సద సౌఖ్యజేయుచును
మ్రొక్కజేసే
పరమాత్ముడదియుగాక
యశోద తనయుడంచు
ముదంబున ముద్దుబెట్ట నవ్వుచుండు
హరి సమయానికి తగుమాటలాడెనే.

త్యాగయ్య కీర్తన ముగించి- "దేవకి కడుపున పుట్టాడు. పుట్టి సంతోష పెట్టాడా ఆమెకు దూరమై ఏడిపించాడు. రేపల్లెలో యశోద యింట పెరిగాడు కాని ఆమె 'నా బిడ్డ' అంటే నవ్వుకున్నాడు. నవ్వాడు. నవ్వుతూనే తననోట పదునాలుగు భువనాలు చూపించి ఆమెను దిగ్భ్రాంతురాలిని జేశాడు" వివరించి చెప్పాడు. తల్లీ కూతుళ్ళ ముఖాలు విప్పారాయి.

ఇంతలో ఒక రాజభటుడు వచ్చి రాజసందేశం ఏదో త్యాగయ్యకు అందించాడు. త్యాగయ్య అందుకుని నిర్లిప్తంగా శిష్యుడు గణపతికి యిచ్చాడు. గణపతి సందేశం చదివాడు.

"తంజపురాధీశ్వర శ్రీ శ్రీ శ్రీ శరభోజి మహారాజులుంగారి సంస్థాన విద్వాంసులు, శొంఠి వెంకట రమణయ్య వారు తమ ప్రియ శిష్యులు చిరంజీవులూ అయినట్టి త్యాగబ్రహ్మన్ని ఆశీర్వదించి వ్రాయించు శుభ లేఖార్థములు.

నాయనా! త్యాగరాజా!

నీవు శ్రీ త్యాగరాజేశ్వరానుగ్రహపాత్రుడవై సంగీత సాహిత్యాదుల నభ్యసించి ఉత్తమోత్తమ వాగ్గేయ కారకుడవైనావని విని ఆనందభరితుడ నైతిని- గాని కర్ణాకర్ణిగా వినుటయే దప్ప, ముఖతః వినని కారణమున వినగోరు నిచ్ఛవలన వినుటకై రాలేని వయోవృద్ధుడనగుట వలన నీవే స్వయముగ వచ్చి, నీ సంగీతముతో నన్ను, సాటి విద్వాంసులను ఆనందింప చేయ గోరుచున్నాను."

గురువుగారి లేఖ త్యాగయ్యకు యెనలేని ఆనందాన్ని కలిగించింది.

"శ్రీ గురువేనమః" అని లేఖ కనులకు అద్దుకున్నాడు త్యాగయ్య.

# 10

రాజ ప్రసాదంలో సంగీత సభామంటపం శోభస్కరంగా వుంది. సంగీత సమ్మేళనానికి దేశ, విదేశాలనుండి ఎందరో విద్వాంసులు విచ్చేసి వున్నారు. సంగీత కచేరీలకు చక్కని వేదిక ఏర్పాటు చెశారు. సంగీత విద్వాంసులకు సముచితస్థానాలు సమకూర్చారు. సభికులకు చక్కని వసతి చేశారు. విచ్చేసిన ప్రముఖులంతా కొలువుతీరి వున్నారు. ఒక గాయకుడు వేదిక నలంకరించి గానం చేస్తున్నాడు-

రామ చిలుక నొకటి పెంచి
ప్రేమ మాటలాడ నేర్పి
రామ రామ రామ యనుచు
రమణి యొకతె ఆ... ఆ....
రమణి ప్రభు మొక్కగా
ప్రేమ మీర భద్రాద్రి
ధీరుడైన రామ విభుడు
కామి తార్థ ఫలములిచ్చి
కైవల్య మొసగ లేదా "రామ"

ఆ మహాగాయకుని పాటలోని సాహిత్యం ఎంతకీ అంతుపట్టడం లేదు. ఇష్టం వచ్చినట్లు పదాలను విరిచేసి, ప్రక్కవాయిద్యాల వారిని కరిచేసి వాళ్లంతా చెమటలు పట్టించుకున్నాడు. శారీరకంగా కూడా చాలా శ్రమ పడ్డాడు పాపం! పాట పూర్తయింది. అంతా హర్షధ్వానాలు చేశారు. సభ సద్దుమణగ గానే శొంఠి వెంకటరమణయ్య గారు తలెత్తి, గుమ్మంవద్ద తలవంచుకు కూర్చున్న త్యాగయ్యని రమ్మని సైగచేశారు. త్యాగయ్య శిష్యులతో సహా దారిచేసుకుని గురువుగారి దగ్గరకు నడిచాడు.

త్యాగయ్య గురువుగారికి పాదాభివందనం చేశాడు. గురువుగారి ఆశీర్వాదం పొందాడు. సభలోని వారంతా వీరిద్దరినీ ఆసక్తిగా చూస్తున్నారు. అది గమనించిన శొంఠివారు సభికులవైపు గంభీరంగా తిరిగి- "కాకర్ల రామబ్రహ్మంగారి పుత్రుడు-త్యాగబ్రహం." అని పరిచయంచేశారు.

"కొదండీ శొంఠివారి శిష్యుడిని" అన్నాడు నమ్రతగా త్యాగయ్య.

"నాయనా! ఇక్కడ జరుగుతున్న సంగీత విద్వత్సభకై విచ్చేసిన ఈ మహనీయులందరూ సంగీత విద్యలో సుప్రసిద్ధులు. లక్ష్య లక్షణ శాస్త్రాలలో నిధులు. పుంభా సరస్వతులు-వీరి రాకవల్ల నేడు ఈ గృహం పావనమైంది.

జనరంజకమైన మార్గాన నీవు కల్పిస్తున్న కీర్తనల గురించి, అంతా విన్నారు. నీ ముఖతః అవి పాడగా వీరు వినాలన్న ఆకాంక్షతో నిన్ను పిలి పించాను" శొంఠివారి మాటలకు ఇంతకు మునుపు పాట పాడినగాయకుడు వెకి లిగా నవ్వాడు. సభలో మరికొందరు తలలు పక్కకు తిప్పుకు నవ్వుకున్నారు.

త్యాగయ్య గురువాజ్ఞ శిరసావహించి, సభకు నమస్కరించి వేదిక మీదకు కదిలాడు. శిష్యుని చేతిలో తంబురా అందుకుని శ్రుతి మీటాడు. కన్నులు మూసుకుని రాముని ధ్యానించి నమస్కరించుకున్నాడు. సభ చీమ చిటుకుమన్నా వినిపించేటంత నిశ్శబ్దంగా వుంది. త్యాగయ్య ఆరంభించాడు:

ఎందరో మహానుభావులు
అందరికీ వందనములు
చందురు వర్ణుని అంద చందముల
హృదయారవిందమున చూచి
బ్రహ్మానంద మనుభవించు వారెందరో మహానుభావులు
సామ గానలోల సరసిజ లావణ్య
ధన్య మూర్ధన్యు లెందరో మహానుభావులు
మానస వన చర వర సంచారము నిలిపి
మూర్తి బాగుగ పొడ గనే వారెందరో మహానుభావులు
సరగున పాదములకు స్వాంతమను
సరోజములు సమర్పనము సేయు వారెందరో
హొయలు మీర నడలుగల్గు సరసుని
సదా కనుల జూచుచును పులక శరీరులై
ఆనంద పయోధి నిమగ్నులై
ముదంబునను యశంబుగల్గు వారెందరో....
భాగవత రామాయణ గీతాది
శృతిశాస్త్ర పురాణ మర్మములన్
శివాది షణ్మతముల గూఢములన్
ముప్పది ముక్కోటి సురాంతరంగముల
భావంబులనెరిగి-భావరాగలయాది సౌఖ్యముచే
చిరాయువుల్ గలిగి నిరవది సుఖాత్ములై
త్యాగరాజాప్తులైన వారెందరో మహానుభావులు-
అందరికీ వందనములు.

త్యాగయ్య గానామృతంలో విద్వత్సభ ఓలలాడింది. సభికులంతా ఒక్క పెట్టున సుదీర్ఘ హర్షధ్వానాలు చేసారు. గురువుగారి ముఖంలో గర్వం తొణికిసలాడింది.

రామచిలుక పాటపాడిన గాయకుడు సభలోంచి లేచివచ్చి, త్యాగయ్య చేతులను కళ్ళకు అద్దుకున్నాడు. ఆ గాయకుడు చాలా వినయంగా "అయ్యా! నేడు నా జన్మ ధన్యమైంది. మీలోని సంగీత విద్యా వైభవానికి త్రికరణ శుద్ధిగా నమస్కరిస్తున్నాను. నేను పాడిందే సంగీతమన్న అహంతో, అజ్ఞానంతో స్వరాల మీద కసరత్తు చేస్తూ ఇన్నేళ్ళ జీవితం వ్యర్థం చేసుకున్నాను.

సాహిత్యానికీ, సంగీతానికీ, లయకూ ప్రాణంపోసే శక్తి భావమేనని ఈనాడు గ్రహించాను. మీ పాటలు జనరంజకాలని వారు అనగానే, అహంకారంతో అవహేళన చేసినందుకు తమకు మనసా-వాచా-కర్మణా మరోమారు నమస్కరిస్తున్నాను" అంటూ క్షమాపణ వేడుకున్నాడు.

"అంతా ఆ రాముని దయ, నా సద్గురువుల కటాక్షం" అన్నాడు త్యాగయ్య గురువుగారి వంక చూస్తూ.

"నాయనా! త్యాగయ్యా! శొంఠి వెంకటరమణయ్య నీ గురువులు అని చెప్పుకునే స్థితిని ఆనాడే దాటిపోయావు. కాకర్ల త్యాగరాజు ఒకప్పుడు నా శిష్యుడు అని చెప్పుకునే భాగ్యం నాకు కలిగించావు" అన్నారు వెంకటరమణయ్య గారు గద్గద స్వరంతో.

"రేపు జరిగే సదస్సులో త్యాగరాజుకు ఆయన నవ్యగానానికి పట్టాభిషేకం జరగాలి" అని ఒక గాయకుడు సూచించాడు.

"రాజసత్కారం జరగాలి" అన్నారు మరొకరు.

"అవశ్యం" అన్నారు గురువు గారు.

"రేపు నిన్ను తీసుకువెళ్ళి రాజదర్శనం చేయిస్తాను. శొంఠివారి మాటలకు త్యాగయ్య తెల్లబోయాడు.

"నీ గానం విన్నాక వారే నిన్ను ఆస్థాన గాయకులుగా నియోగిస్తారు. వెంకట రమణయ్య గారిచ్చిన హామీ విని సభకులు హర్షధ్వానాలు చేశారు.

"అది మనందరికే సత్కారం. నిజమైన సంగీతానికి నీరాజనం." అన్నాడు ఉత్సాహంగా రామచిలుక గాయకుడు.

త్యాగయ్య సంశయిస్తూ చేతులు జోడించాడు.

"నన్ను మన్నించండి-తమరి ఆజ్ఞను శిరసావహించి ఇక్కడ పాడ దానికి వచ్చాను. రాత్రి ఇల్లుచేరి నా రాముడికి నివేదనం, పవళింపుసేవ చేసుకోవాలి" సూటిగా చెప్పి వెళ్ళడానికి వుద్యుక్తుడైనాడు త్యాగయ్య.

సభలోని వారంతా నిశ్చేష్టిర పోయారు. గురువుగారు తెల్లబోయి చూశారు.

"మీ రాము డెక్కడికి వెళ్తాడు స్వామీ-రేపు రాజదర్శనం, సత్కారం జరిగాక...." ఒక సభికుడు సలహా యివ్వబోయాడు.

"మన్నించాలి" అన్నాడు త్యాగయ్య వింత ప్రవర్తనకు, సిరిలా మో కాలడ్డినట్టు ఈయనెక్కడి మనిషి అనుకుంటున్నారు కొందరు.

త్యాగయ్య గురువుగారి వంక చూసి కన్నులతోనే అనుమతి కోరు కున్నాడు. వెంటనే వెంకటరమణయ్యగారు:

"నాయనా! నీ బాధ నాకర్థమయింది. నువ్వూ, నీ రాముడూ వాగ ర్థాలవంటివారు, శివపార్వతులవంటివారు. వెళ్ళిరా నీకు శుభం జరుగుతుంది." అని దీవించి వెళ్ళడానికి అనుమతి ఇచ్చారు.

గురువుగారికి నమస్కరించి, శిష్యులతో రామసేవకోసం ఇంటి దారి పట్టాడు త్యాగయ్య.

# 11

పూజామందిరంలో శ్రీరామ పంచాయతనం దగ్గర కమలాంబ, సీత పూజకు పూలు, పాలు, తాంబూలం అమరుస్తున్నారు. సావడి మధ్య గంగమ్మ తన అలవాటు ప్రకారం కాళ్ళుజారజాపి కూర్చుని, తీరికగా తాంబూలం వేసుకుంటోంది. తమలపాకు ఈనెలుతీసి దేవుడి దిక్కుగా విలాసంగా విసిరేస్తోంది.

"త్యాగూ! భ్రష్టుడా! ఆగక్కడా" వీధి గుమ్మలోంచి జపేశం కేక వినిపించింది. గంగమ్మలో చలనం లేదుగాని కమలాంబ, సీత అదరిపడి వెనక్కుతిరిగి చూశారు.

వీధి గుమ్మంలో చివరి మెట్టుమీద తలవంచుకు నిలబడి వున్నాడు త్యాగయ్య. వెనక ఇద్దరు శిష్యులు బిక్కుబిక్కుమంటూ, చూస్తూ వుండి పోయారు. జపేశం అరుగుమీద నిలబడి ఆక్రోశపడుతున్నాడు తమ్ముడి మీద—

"రాజ దర్శనం త్రోసి రాజని, రాముడి పూజకోసం వచ్చేస్తావా? ఏం చూసుకునిరా నీకా పొగరు? ఆ కండ కావరం? నాన్నగారికన్న గొప్ప వాడివా? కొత్తగా కొమ్ములు మొలిచాయా? ఆయనతో చిన్నప్పుడు రాజసభకు వెళ్ళలేదూ? అక్కడ రామాయణం చదవలేదూ?"

"అప్పుడు నాన్నగారు రమ్మంటే వెళ్ళాను" త్యాగయ్య క్లుప్తసరి జవాబుకు అన్నగారు మరింత మండిపడి—

"ఇపుడు అన్నగారు వెళ్ళమంటున్నారు, వెళ్ళు" అన్నాడు ఆజ్ఞాపిస్తున్న స్వరంతో. త్యాగయ్య మౌనం వహించాడు.

జపేశం స్వరంమార్చి "వెళ్ళరా...ఒరే....తండ్రంతటి వాడిని నన్ను కాదంటే ఆయొక్క నీ రాముడు కూడా మెచ్చుకోడురా. రాముడి మాటను వాడి తమ్ముళ్ళు ఇలాగే తోసిపారేశార్రా?" త్యాగయ్య ఏమీ చలించలేదు.

గంగమ్మవచ్చి గడపమీద కాలేపి నిలబడి ఈనెలుతీసి వీధిలోకి విసురుతూ—

"అదేంకాదండి. ఆ రాజుగారేమన్నా చదివిస్తే. అందులో సగం మనకి తగలెయ్యాలని గుబులు—మీరూ నేనూ చచ్చాక వెళ్ళి నొల్లుకు తెచ్చుకుంటారు" నిష్ఠూరంగా అన్నది.

జపేశం మళ్ళీ అందుకున్నాడు.

"త్యాగూ!....నిన్నే....! ఉట్టి చేతుల్తో వచ్చి, నీ రాముడికేం పెట్టి పూజ చేస్తావురా?....నైవేద్యానికేముందిరా? బెల్లంముక్కా? అల్లంముక్కా?"

"ఏమీ లేకపోతే, నా కన్నీళ్ళతో కాళ్ళు కడుగుతాను. నా మాటలతో, నా పాటలతో పూజ చేసుకుంటాను" వినయంగా చెప్పాడు తమ్ముడు.

"చేసుకోరా—చేస్కో. ఆ కన్నీళ్ళే నీకు మిగిలేది-ఈ పూట నీకూ నీ రాముడికీ కూడా పస్తే-నా కొంపలోకి రాకు-అక్కడే అఘోరించు" విసురుగా లోపలకు వెళ్ళి ఛళ్ళున తలుపేశాడు జపేశం. త్యాగయ్య నిశ్చలంగా నిలబడిపోయాడు.

# 12

త్యాగయ్య ఇల్లు కోలాహలంగా వుంది. సావడి మధ్యగా రాజుగారు పంపిన కానుకలు పరచివున్నాయి. పట్టు వస్త్రాలు, నగలు, బంగారు కాసులు, పళ్ళు అన్నీ ఒక ప్రదర్శనలా అమర్చివున్నాయి. ఇద్దరు రాజ భటులు, ఒక రాజోద్యోగి, ఊరి పెద్దలు కానుకల దగ్గర నిలబడి వున్నారు. త్యాగయ్య శిష్యులు, ఊరి వారి పిల్లలు వింతగా వాటిని చూస్తున్నారు.

త్యాగయ్య సావడి గోడకు నిస్త్రాణగా చేరబడి ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు. ఆయన ముఖంలో కలవరం, బాధ కొట్టొచ్చినట్టు కనుపిస్తున్నాయి. కమలాంబ వెనక ద్వారంలో తనకి సంబంధం లేనట్టు

నిలబడివుంది. సీత తల్లిముందు నిలబడి, చెంగుతో తన భుజం కప్పుకుని చూస్తోంది

జపేశం సంభ్రమాశ్చర్యాలతో నగలదగ్గర చిందులు తొక్కుతున్నాడు. ఆకొన్నవాడి ముందు షడ్రసోపేత భోజనం వడ్డించినట్టుంది జపేశం వైఖరి.

గంగమ్మ నగలనీ, బట్టలనీ ఆత్రంగా తీసి, చూసి పంటిమీద పెట్టుకుని, చుట్టూవున్న వారికి చూపించి మురిసిపోతోంది. ఒకటి రెండు హారాలు తీసి కమలాంబకి కూడా యివ్వబోయింది. ఆమె వుదాసీనంగా వూరుకుంది. సీతని సావడి మధ్యకి తీసికెళ్ళి పిల్లమెడలో ఓ నగ తొడిగింది, తాను నాలుగు హారాలు తగిలించుకున్నది.


జపేశం రాజుగారు పంపిన పట్టు శాలువా తీసి పైన కప్పుకున్నాడు. రాజుగారు పంపిన ఆహ్వాన పత్రిక కూడా జపేశం చేతిలోనే వుంది. దాన్ని చుట్టవిప్పి మరోసారి చదివి, నమ్మలేనంత ఆశ్చర్యంతో చుట్టూ చూశాడు.


"ఆహా! ఆయొక్క మహారాజులుంగారు స్వయంగా గౌరవ పురస్సరంగా ఇంత గొప్ప కానుకలతో నిన్ను ఆహ్వానిస్తున్నారంటే, ఆహా! నమ్మలేక పోతున్నాను. ఆయొక్క స్వర్గలోకంలో మన తండ్రిగారు ధన్యులై పోతున్నారు" అంటూ త్యాగయ్య వైపు నడిచి—

"త్యాగూ! తమ్ముడూ! వయసులో చిన్నవాడివైనా ఆయొక్క బుద్ధిలో దూరదృష్టిలో నువ్వు చాలా పెద్దవాడివిరా. పెద్దేమిటి....అసాధ్యుడివి. నీ గురువుగారు దయదల్చి ఏర్పాటు చేసిన ఆయొక్క రాజ దర్శనాన్ని మొన్న ఎందుకు కాదన్నావో ఇప్పుడు అర్థమైంది.

దర్జాగా ఈ యొక్క రాజమార్గంలో రాజుగారిచేత పిలిపించుకుంది కన్నమాట—ఆహా....ఇవాళ రాజుగారు నీగురించి వినే, ఇలా పంపించారు అంటే—ఏమంటావయ్యా శెట్టీ! ఇహ మావాడి పాట విని, ఆ యొక్క



































పల్లకీ ఎక్కించి వూరేగిస్తారు. పల్లకీ ఏమిటి ఏనుగే ఎక్కమంటారు. పాటకి కోటి, మాటకి లక్ష గుమ్మరిస్తారు."

త్యాగయ్య అన్నగారి మాటలకు కంగారుపడి ఏదో చెప్పబోయాడు. కాని జపేశం వినేస్థితిలో లేడు—

"ఆ పైన ఇంకా వినగా వినగా సంతోషం పట్టలేక దాసోహమన్చేప్పేసి, ఆ యుక్క 'సింహాసనమే ఒక్కేసి' 'సగం చోటు తీసుకోండి త్యాగరాజుగారూ' అనేస్తాడు."

రామిశెట్టి వంక తిరిగి "ఏవయ్యా మనబోటి పాపిష్టాళ్ళం గోతులు త్రవ్వో, గొంతులు కోసో వందేళ్ళలో కూడబెట్టే సొమ్ములు మా తమ్ముడా యొక్క రావుడి మీద ఒక్క పాట పాడేసి ఒక్క ఘడియలో గడించవతల పారేస్తాడు. ఆ యొక్క..."

జపేశం మాటలకు శెట్టికి తిక్క రేగింది. మాటపూర్తిగా చెప్పకుండానే అందుకుని "ఆయొక్క లేదు, అరటితొక్కా లేదు. ముందా తమ్ములుంగారు 'ఊఁ' అనాలి గదా!" అన్నాడు.

"ఎందుకనడూ? ముందరా రాముడు 'ఊఁ' అంటేనే గదా ఇవొచ్చాయి తమ్ముడూ! మొత్తం మీద మీ రాముడు కూడా నమ్ముకున్నవాళ్ళని అశ్కర్థ చెయ్యడని తేలిపోయింది. కాబోతే నీలాగే వారికీ కాస్త నిదానం, జాస్తి, మా భాషలో ఆలస్యం" చాలా సరదాగా మాట్లాడుతున్నాడు అన్నగారు.

వొంటినిండా, రెండు చేతులా నగలు తొడిగేసుకున్న గంగమ్మ అలంకరించిన అమ్మవారిలా వుంది. అన్ని అలంకారాలున్నా జుట్టు మాత్రం విరబోసుకునే వుంది. గంగమ్మ కళ్ళల్లో ఆశ చిందులు వేస్తోంది.

"ఏవండోయ్! మా రాములవార్ని, మా మరదిగార్ని ఏవన్నా అంటే మేం ఒప్పుకోం. ఆలెస్పంట, అలెస్పం రాముల వారాలస్పెం జెయ్యలే,

పిల్ల పెళ్ళికొచ్చింది. సమ్మంధాలు కూడా కుదిరాయి అని వేళ చూసుకునే లక్షణంగా లక్ష్మివారం పూటా మా లక్ష్మినింటికి పంపించారాయన, ఇంకా వయం" ఇచ్చకాల బుచ్చమ్మలా వాగేస్తోంది గంగమ్మ. సీతని ఆపేక్షగా దగ్గరకు తీసి "ఏదీ? ముందస్తుగా లోపలకెళ్ళి రాములవారికో దణ్ణమెట్టు కురా" అని పురమాయించింది.

సీత లోపలకు వెళ్ళబోతుంటే రాజోద్యోగి చేయి కొంచెం సాచి సూచనగా వారించాడు.

"అమ్మా! ఒక్క ఘడియ. ఇవి మహారాజుగారి కానుకలు. వారు ఒక్కమాటు 'సరే' అనేస్తే అ పైన మీ ఇష్టం" అన్నాడు రాజోద్యోగి.

త్యాగయ్య కలవరపడుతూ ఎటో చూస్తున్నాడు.

"ఒక్కసారేమిటండీ? వందసార్లంటాడు. రాజాజ్ఞ, రామాజ్ఞ రెండూ వాడికొక్కటే. ఆ యొక్క తండ్రి తర్వాత తండ్రంతటి వాడిని నేను చెబుతున్నాను, చాలదూ?" జపేశం మాటలు విని రామిశెట్టి అందు కున్నాడు.

"చాలదయ్యా మొన్నటికి మొన్న నా కానుకలు కాదన్నాడు. విన్న రాజదర్శనం వద్దని చక్కా వచ్చాడు. ఇవాళ ఇది మాత్రం కాదనడని నమ్మకమేమిటని?" తర్కించాడు శెట్టి.

"అదేవిటండీ! అపశకునం మాటలు? పిల్ల పెళ్ళికి నిలువెత్తు ధనం, నగలు, పట్టుబట్టలు పంపిస్తే చేదా? వద్దనే తండ్రెవడండీ" గంగమ్మ మాటకి మాట అప్పగించింది శెట్టికి.

రాజోద్యోగి అందరినీ నిశ్శబ్దంగా వుండమని చేత్తోనే సైగచేసి అంగీకారం కోసం త్యాగయ్య వంక చూసాడు.

త్యాగయ్య ఒక్కసారి అందరినీ చూశాడు. అంతా కలయచూశాడు. నేలమీద నట్టింటవున్న సిరిసంపదల్ని చూశాడు. తల తిప్పాడు—పూజా మందిరంలో రాములవారు కనిపించారు.

అర్థాంగి కమలాంబ కళ్లలోకి సూటిగా చూశాడు. ఆమె భర్తవంక సానుభూతితో చూసి తలపక్కకి తిప్పుకుంది. చిన్నారి సీతని చూశాడు- 'నాకేం వద్దు నాన్నా' అన్నట్లు చూసి, వచ్చే ఏడుపు ఆపుకుంటూ, భయంతో తల వూపింది సీత.

త్యాగయ్య కన్నులరమోడ్చాడు. గాఢంగా నిట్టూర్చాడు. అయన అంగీకారం కోసం రాజభటులు ఆత్రుతగా యెదురు చూస్తున్నారు-త్యాగయ్య పెదవి విప్పాడు:

నిధి చాల సుఖమా రాముని స
న్నిధి సేవ సుఖమా నిజముగ బల్కు మనసా
దధి నవనీత క్షీరములు రుచో
దాశరథీ ధ్యాన భజన సుధారసము రుచో ॥నిధి॥

త్యాగయ్య పలుకులకు, గంగకీ జపేశునికి గుండెలు చెదిరాయి. శెట్టి తృప్తిగా నవ్వుతుని 'అద్గదీ' అన్నట్లు తల పంకించాడు. తల్లి సైగ గమనించిన సీత తల్లి దగ్గరకు వెళ్ళింది. పెదతల్లి తొడిగిని నగలన్నిటినీ వొలిచింది తల్లి. కమలాంబ ముఖంలో ప్రసన్నత, తృప్తి నిండాయి.

రాజాధికారి గంగవైపు చూశాడు. ఆమెకి అర్థమైంది ఆ ఉద్యోగి చూపులోని భావం. పళ్ళు పటపటలాడించింది గంగమ్మ.

త్యాగయ్య రాజోద్యోగికి నమస్కరించి-"పూర్వజన్మ సుకృతంవల్ల గురుకృపవల్ల నాకు లభించిన సంగీతం, సాహిత్యం-నా జీవిత సర్వస్వం-ఆ శ్రీరామచంద్ర ప్రభువుకేనాడో కైంకర్యమైనాయని వారికి మనవి చేయండి" అని విన్నవించాడు. రాజభటులు, గ్రామపెద్దలు, రామిశెట్టి ఆ మాటలకు నిర్ఘాంతపోయారు. గంగమ్మకి గుడ్ల నీరు తిరిగింది. జపేశం ముఖం కందగడ్డలా మారింది.

"మరిదీ! నువ్వు మనిషివి కాదు. ఒక ఆడపిల్లని కన్న తండ్రివి కాదు-కర్కోటకుడివి.

లక్షింవారంపూట మహలక్ష్మి నీ నట్టింటకొచ్చి, నీ బిడ్డని పెళ్లికూతురుగా అలంకారంచేస్తే,అవన్నీ పీకించి పారేశావు-లక్ష్మిని కాల తంతున్నావు ఇల్లాలినేడిపిస్తున్నావు. నువ్వు... నువ్వు మనిషివీ కాదు నీ రాముడు దేవుడూ కాడు-తల్లి తరవాత తల్లంతటి వదిననీ, తండ్రి తరవాత తండ్రంతటి అన్నగారినీ అవమాన పరుస్తున్నావు-నువ్వు అనుభవిస్తావు-ఇంతకింతా అనుభవిస్తావు" శపిస్తున్నట్టు అరిచింది గంగమ్మ.

అప్పటికే రాజభటులు కానుకలను తెచ్చినరీతిగా సర్దుకున్నారు. రాజోద్యోగి వెళ్లబోతూ త్యాగయ్యగారూ! ఈ తిరస్కారం రాజతిరస్కారం అవుతుంది. రాజుగారు గాని, పౌరులు గాని ఎవ్వరూ హర్షించరు." అన్నాడు బెదిరింపుగా.

దానికి త్యాగయ్య జవాబు ఒక నమస్కారమే అయింది. ఆ ఉద్యోగి ఒకసారి కోపంగా చూసి కానుకలతో సహా బైటికి నడిచాడు. జపేశం కప్పుకున్న పట్టు శాలువా తీసి శెట్టి భటులు తిప్పి తీసుకు వెళుతున్న పళ్లెంలో పడేశాడు___

"దేనికైనా పెట్టిపుట్టాలి" వెటకారం చేస్తూ శెట్టి బయటకు నడిచాడు.

ఇంట్లో కోలాహలం చల్లారింది. ఇంట్లో అందరూ తలో దిక్కున నిశ్శబ్దంగా నిలబడి విన్నారు. జపేశం ఉవ్వెత్తున పొంగే దుఃఖాన్ని, కోపాన్ని అణుచుకుని నెమ్మదిగా త్యాగయ్య దగ్గరకు నడిచాడు. ముఖంలో ముఖం పెట్టి జంధ్యం తీసి కుడి అరచేతిలో బుజంపైన, ఎడమచేత నడుము దగ్గర పట్టుకున్నాడు.

కమలాంబ. సీత బిక్కు చిక్కుమని చూస్తున్నారు.

"తృప్తిగా వుందా? కళ్లు చల్లబడ్డాయా?"___హీనస్వరంతో కపి వెళ్లబోస్తూ అడిగాడు జపేశం-మౌనంగా తలదించుకున్నాడు త్యాగయ్య.

"నాకు నువ్వు-నీకు నేను ఇవాల్టితో చచ్చినట్టే" అంటూ చేతిలో

పట్టిన జందాన్ని పుట్టుక్కున తెంపేశాడు జపేశం-కమలాంబ సీత అదరి పడ్డారు.

గంగ ఢిగ్గునలేచి "ఇల్లువాటా వేసేముందు, పెట్టి బేడా తీసుకురండి" అంటూ ఇంట్లో సామానంతా తెచ్చి సావడిలో విసరడం ప్రారంభించింది.

"రాజుగారి కానుకలే వద్దన్నవాడికి మన తట్ట, బుట్ట చెంబు, గింబు ఎందుకు?"-త్యాగయ్య కాపరానికి సామానేమీ లేకుండా యివతలకు తెచ్చి పడేసింది గంగమ్మ. ఏమీ మాట్లాడక త్యాగయ్య మెల్లగా పూజ గదిలోకి నడిచాడు.

అది గమనించిన జపేశం—"ఆయనగారికి-ఆ యొక్క మహావిధి కన్నా రాములవారి సన్నిధే రుచిట!" వేళాకోళంగా అంటూ సామాను సర్దడంలో భార్యకి సహాయ పడుతున్నాడు.

త్యాగయ్య పూజగదిలోంచి వెండిపువ్వులు అమర్చిన పీట, వెండి గిన్నె తెచ్చి అన్నగారికి అందిస్తూ—

"అవునన్నయ్యా! రామ పంచాయతనం మాత్రం నాకు వుంచి మిగిలిన వన్నీ తీసుకోండి. మీకు సర్వాధికారాలూ వున్నాయి. నేను సంతోషంగా సమర్పిస్తున్నాను" అన్నాడు.

జపేశం చప్పున అవి అందుకుని "అనుభవిస్తావు. దౌర్భాగ్యుడా-భ్రష్టుడా. అనుభవిస్తావు....ఇంతకింతా అనుభవిస్తావు-ఇదే నా ఆశీర్వచనం" అన్నాడు. వ్యంగ్యంగా-విసురుగా వెళ్ళబోతూ తమ్ముడికి హేళనగా నమస్కారం చేశాడు జపేశం.

అన్న నమస్కారానికి త్యాగయ్య కించిత్ కలవర పడ్డాడు. అంతలోనే స్థిమితపడి "శ్రీరామ పాదార్పణం" అని ప్రతి నమస్కారం చేశాడు—

ఇన్నేళ్ళుగా ఉమ్మడిగా సాగుతున్న త్యాగయ్య కుటుంబం రెండుగా చీలిపోయింది.

# 13

రాజసభలో శరభోజి మహారాజు కొలువుతీరి వున్నాడు. మంత్రులు సామంతులు, ఒకవంక ఆస్థాన విద్వాంసులు, పురప్రముఖులు ఆసీనులై వున్నారు. త్యాగయ్య ఇంటికి కానుకలు తీసుకు వెళ్ళిన రాజోద్యోగి, భటులు చేతులు జోడించి రాజుగారి ముందు నిలబడి వున్నారు. త్యాగయ్య తిరస్కరించిన కానుకలు కూడా అక్కడే వున్నాయి.

ఉద్యోగి చెప్పిందంతా విన్న శరభోజి ముఖం ఎర్రబారింది. "ఏమీ ఆగాయకుడి అహంకారం! రాజధిక్కారమా? గౌరవంతో పంపిన కానుకలను గడ్డిపోచలా చూస్తాడా? ఇది వ్యక్తిగతంగా మాకేకాదు. సరస్వతీ నిలయమైన ఈ తంజపురి ఆస్థానానికి, కళాపీఠానికే అవమానం. సహించరాని క్షమించరాని అపచారం - తక్షణం వెళ్ళి ఆ పాటగాడిని బంధించి తీసుకురండి - మాముందు ఎందుకు పాడడో మేమూ చూస్తాము" రాజుగారి మాటలకు సభలో కలకలం చెలరేగింది. శొంఠి వెంకట రమణయ్యగారు లేచినిలబడి "ప్రభువులు అనుమతిస్తే ఒక చిన్న మనవి. ఆ త్యాగరాజు త్రికరణ శుద్ధిగా తనకు తాను రాముడికి అంకితం చేసుకున్న పరమభక్తుడు. అతను తమ సమక్షానికి రాని కారణం రాముని పై గల భక్తి తప్ప తమపట్ల తిరస్కార భావంకానే కాదు-" నచ్చ చెప్పాలని ప్రయత్నించారు.

"వెంకట రమణయ్యగారూ! తాము శిష్య వాత్సల్యంలో అన్నమాటలను నేను సమదృష్టితో స్వీకరించలేను. మీరు చెప్పే తాత్పర్యం అతని నోటనే విందాము."

రాజుగారి మాటలకు తలవంచుకున్నారు గురువుగారు. తక్షణం భటుల్ని పంపి అతన్ని రప్పించమని రాజుగారు ఆజ్ఞాపించాడు.

మిట్ట మధ్యాహ్నం వేళ త్యాగయ్య తలదించుకుని నడుస్తున్నాడు.

వెనక ఇద్దరు శిష్యులు. వీధిలో ఎదురుపడిన వారు త్యాగయ్యని చూసి దూరంగా తప్పుకుంటున్నారు. ఎవరూ భిక్ష యివ్వడం లేదు.

"రాజుగారి కానుకలను కాదని అయన్ని అవమానించాట్టమనంయిస్తే బాగుండదు."

"రాజుగారికి తెలిస్తే మన మీదకూడా..." ఇలా రకరకాలుగా పౌరులు అనుకుంటున్నారు.

కొలువు ముగించగానే శరభోజి మహారాజు గారికి తీవ్రమైన కడుపు నొప్పి ఆరంభమైంది. తల్పం మీద విలవిల తన్నుకుంటున్నాడు బాధతో. రాజవైద్యులు, శొంఠివారు తల్పందగ్గరే వున్నారు.

"అయ్యా! ఇంత హఠాత్తుగా ఇంత నొప్పి ఎలా వచ్చిందో అంతు బట్టలేదు. ఉదరవ్యాధికి ఇవ్వదగిన ఔషధాలలో అతిశ్రేష్ఠమైనదే యిచ్చాము. అయినా...." వ్యాధి అంతు చిక్కని రాజవైద్యుడు వాపోయాడు.

రాజుగారు పడుతున్న బాధమాస్తుంటే అక్కడివారికి ఆందోళనగా వుంది.

శొంఠివారు కొంత చొరవ తీసుకొని—

"ప్రభువులు ఆగ్రహించకపోతే నామనసులో మాటమనవి చేస్తాను. ఏ పాపం ఎరగని ఒక రామభక్తుడిని బంధించి లాక్కు రమ్మన్నారు. బహుశా........" అని ఆగిపోయారు.

"శాస్త్రరీత్యా చెప్పతగిన కారణాలు నాకూ కనుపించడం లేదు"— శొంఠివారిని పరోక్షంగా సమర్థించాడు రాజవైద్యుడు.

"ఔను - దైవ భక్తుణ్ణి బాధిస్తే దైవం హర్షించదని తోస్తున్నది. ప్రభూ తమరు ఆజ్ఞనిస్తే—" మంత్రి మాటలకు శరభోజి "పెద్దలు మీ అందరికీ అదే కారణమనిస్తే—" అలాగే కానివ్వండి అన్నట్టు చూశాడు.

వెంటనే మంత్రిగారు బయటకు కదిలారు.

త్యాగయ్యను పట్టిబంధించి తీసుకు రమ్మన్న రాజాజ్ఞ ఉపసంహరించుకోబడింది.

త్యాగయ్యకు ఇవేమీ తెలియవు. శ్రీరామ ధ్యాస వినా వేరే ధ్యాస లేదు. ఆయనకు గ్రామస్థులు భిక్ష వెయ్యకపోయినా ఆయన ఏమీ బాధపడలేదు. ఈశ్వరేచ్ఛ అలావుంది కాబోలు అనుకున్నారు, అంతే.

చేత్తో తీసేసినట్టు రాజుగారి బాధ తగ్గిపోయింది. అందరూ ఆశ్చర్య పడ్డారు. శరభోజి పక్కమీంచి లేచారు. ఆయన ముఖంలో సంతోషం. ఆశ్చర్యం కలగలిశాయి.

"వెంకట రమణయ్యగారు! మీది వేదవాక్కు, కొండలావచ్చిన బాధ మంచులా కరిగిపోయింది. అహంకారం ఆ త్యాగరాజస్వామిది కాదు. నేను చేసింది దైవాపచారమే! రామచంద్ర ప్రభో! రావణాసురుని వంటి రాక్షసుణ్ణి, కాకాసురుడి వంటి నీచుణ్ణి క్షమించావు. నా అపరాధం మన్నించు" అని భగవంతుని ప్రాధేయపడ్డాడు శరభోజి. అందరూ అంతరిక్షాన కొలువుతీరే రామచంద్ర ప్రభువుకు నమస్కరించారు.

# 14

త్యాగయ్య ఒంటరిగా నడుస్తున్నాడు, శిష్యులెవరూ కూడా లేరు. నీడ కూడా తోడులేదు. జరిగిందంతా ఒక్కసారి మనసులో మెదిలింది. త్యాగయ్య ఆత్మవిమర్శ చేసుకున్నాడు.

ప్రాణ మేపాటి యని మానమే మేలంటి
గాని శ్రీ రామ పరమానంధ జలధీ
శ్రీనాథ కులములో లేని దారిని బట్టి
జానెడుదరము నింప నొరుల బొగడితినా?
ఆజాను బాహు యుగ శ్రీ జానకీపతి ప
యోజాక్ష శ్రీ త్యాగరాజనుత చరణ
నాదుపై బలికేరు నరులు
వేద సన్నుత భవము వేరు జేసితి ననుచు
నాదుపై బలికేరు నరులు...

ఒంటరిగా, రిక్త హస్తాలతో ఇల్లు చేరాడు తాగయ్య. కమలాంబ పాదోదకంతో మెట్లదగ్గర నిలబడివుంది. భర్తపాదాలు కడిగి నీళ్ళు శిరసున జల్లుకుంది. ఇద్దరూ ఇంట్లో అడుగు పెట్టారు. ఇల్లు ఖాళీగా బావురుమంటోంది. పూజా మందిరంలో వున్న శ్రీరామ పంచాయతనం తప్ప వేరే చెప్పుకోతగ్గ సామగ్రి ఏదీలేదు. త్యాగయ్య నీరసంగా రాముని యెదుట చతికిలబడ్డాడు.

మనిషి నీరసంగా వున్నా మనసు ఉల్లాసంగా వుంది. పక్కనే వున్న వీణెను అందుకని శ్రుతి చేస్తున్నాడు.

కమలాంబ వంటింట్లోకి వెళ్ళింది. ఖాళీగా వున్న వంట పొయ్యి, అక్కడ ఒక చిన్న కుండలో నీళ్ళు తప్ప మరేం లేవు. కమలాంబ ఒక్క క్షణం ఆలోచించిది. కుండలో నీరు పంచపాత్రలో పోసింది. పెరట్లోకి నడిచింది. నాలుగు తులసిదళాలు తుంచి పంచపాత్రలో వేసింది. ఆ విధంగా సుసంపన్నం చేసిన పంచపాత్రను భర్తముందు ఉంచింది త్యాగయ్య సాభిప్రాయంగా ఆమె కళ్ళలోకి చూసాడు. కమలాంబ సన్నగా నవ్వింది. పంచపాత్రను కళ్ళకు అద్దుకుని 'అమృతమస్తు' అంటూ సగం తీర్థం సేవించి, మిగతా సగం భార్యకు అందించాడు. అందులోని తులసిదళాలను ఉద్ధరిణలో తీసి. అరచేతిలో వుంచి ఆయనకు అందించింది. ఆయన ప్రశ్నార్థకంగా చూసి రెండు దళాలు కళ్ళకు అద్దుకొని నోట్లో వేసుకొన్నాడు.

కమలాంబ భర్త మిగిల్చిన తీర్థం తీసుకొని, మిగిలిన రెండు తులసి దళాలు నమిలింది. ఆమె కళ్ళు మెరిశాయి. త్యాగయ్య మందహాసం చేసి, తాంబూలం బాగుందన్న భావం వ్యక్త పరచాడు ముఖంలో.

"తాంబూలం, తులసి తాంబూలం" అన్నది కమలాంబ తృప్తిగా నవ్వుతూ.

త్యాగయ్య తలపంకించి, చిరునవ్వు నవ్వి, వీణెను అందుకొని తంత్రులను మీటాడు.

నీ మనసు నీ సొగసు
నీ దినుసు వేరే
లావణ్య రామా

త్యాగయ్య భక్తి పారవశ్యంలో గానం చేస్తున్నాడు. శ్రీరామ చంద్రుడు, సీతమ్మతల్లి, హనుమ నిజరూపాల్లో త్యాగయ్య ఇంటిముందు సాక్షాత్కరించారు. వీధి వీధంతా క్షణకాలం దేదీప్యమానంగా వెలిగింది. వారు ముగ్గురు ఒకరినొకరు చూసుకుని నవ్వుకున్నారు.

త్రుటిలో వారు సామాన్య యాత్రికులుగా మారిపోయారు. రాముడు త్యాగయ్య తలుపు తట్టాడు.

తలుపు తట్టిన శబ్దంవిని, వీణె శ్రుతి చేస్తున్న త్యాగయ్య—

"ఎవరూ?" అన్నాడు.

"నేనే" అన్నారు రాములవారు.

"అంటే" మళ్ళీ ప్రశ్నించాడు త్యాగయ్య.

అంతలో కమలాంబ వెళ్ళి తలుపు తెరిచింది. రాముడు లోపల అడుగు పెడుతూనే నవ్వుతూ "అది చాలా పెద్ద ప్రశ్న. ప్రస్తుతానికి నా పేరు జానకిరామయ్య. ఈమె నా ఇల్లాలు జానకి" అంటూ పరిచయం చేశాడు. హనుమ రెండు మూటలు పట్టుకుని ప్రవేశించాడు.

త్యాగయ్య లేచి నిలబడి వారిని సాదరంగా ఆహ్వానించాడు. కమలాంబ చాప పరిచింది.

"త్యాగబ్రహ్మంగారు మీరేనా?" రాముడు వేసిన ప్రశ్నకు తల ఊపాడు త్యాగయ్య.

"మీరు బాగా పాడతారని విని, మీ పాట విని ఆనందించాలని వచ్చాం" సీతారాములిద్దరూ చాపమీద కూర్చున్నారు.

త్యాగయ్య వినయంగా నమస్కరించి—"అది నా భాగ్యం, మంచి ఎండవేళ వచ్చారు. ఒక్క ఘడియ విశ్రమించండి. ఈ లోపల భోజనం ఏర్పాటు...." త్యాగయ్య మాట విని "మేము వచ్చింది ఆ విందుకు కాదు

స్వామీ, వీనుల విందుకు. దేశాటన చేస్తున్న వాళ్ళం. మా జాగ్రత్తలో మేముంటాం, ముందు మీరు పాడండి, ఈలోగా మా బంటు హనుమయ్య ఫలహారాలు పని చూస్తాడు'' అని తెలియజెప్పాడు.

త్వరగా పాట వినాలన్న కుతూహలం వారిలో కనిపించేసరికి త్యాగయ్య వెళ్ళి కూచున్నాడు—ఏదో గుర్తొచ్చినట్టు "అమ్మా! సీతమ్మా!" అన్నాడు త్యాగయ్య.

రాముడి పక్కనున్న సీత "ఊఁ" అని మారు పలికింది. వెంటనే గతుక్కుమన్నది.

త్యాగయ్య చిన్నగా నవ్వి "నన్ను కన్నతల్లి పేరూ సీతమ్మే, నేను కన్నతల్లీ సీతమ్మే" అన్నాడు.

సీత గదిలోంచి తంబుర తెచ్చి తండ్రికిచ్చి, ప్రక్కన కూచుంది. ఆ సీత ఈ సీతని ఇంటిని తేరిపార చూస్తూ—

"అలాగా? పిల్ల పెళ్ళీడుకొచ్చినట్టుంది....ఇల్లు చూస్తే ఇలా వుంది" అని తనలో అనుకొని, రాముడివేపు తిరిగి "ఈయనకి మహా విద్వాంసుడని కీర్తి వుంది. విద్వాంసుల ఇంట సిరినిలవదా స్వామీ'' అని అడిగింది.

"ఆ సంగతి లక్ష్మీ సరస్వతులను అడగాలి. అయనేం చెప్తాడు పాపం?" అన్నాడు రాముడు జాలిపడుతున్నట్టు.

"అలా కాదు...రాజుగారు కానుకలంపితే'' సీత ప్రారంభించేసరికి ఏదో జ్ఞాపకం వచ్చినట్టు రాముడు అందుకుని—

"అవునవును-ఏమిస్వామీ! మేము విన్నది నిజమేనా? తమరు రాజుగారంపిన కానుకలు కాదన్నారు-ఊరివారికి దూరమయ్యారు. చివరకు అన్నగారితో కూడా తెగతెంపులు చేసుకున్నారట! రేపు అమ్మాయికి....?" అనగానే త్యాగయ్య నవ్వి "రామదాసుగారన్నట్లు—రామునివారము మాకేల విచారము? అయ్యా మీరనుకున్నట్టు నేను ఎవరూలేని అనాధుడను కాను—

నా బలగం చాలాపెద్దది" చాలా గర్వంగా చెప్పాడు. వారు వచ్చినదానికి, అడిగినదానికి జవాబుగా కృతి అరంభించాడు.

సీతమ్మ మాయమ్మ శ్రీరాముడు మా తండ్రి
వాతాత్మజ సౌమిత్రి వైనతేయ రిపుమర్దన
తాత భరతాదులు సోదరులు మాకు ఓ మనసా?
॥సీతమ్మ॥

పరమేశ వసిష్ఠ పరాశర నారద శౌనక శుక
సురపతి గౌతమ లంబోదర గుహ సనకాదులు
ధర నిజ భాగవతాగ్రేసరు లెవరో వారెల్లను
వర త్యాగరాజునికి పరమ బాంధవులు మనసా
॥సీతమ్మ॥

సీతారాముల కంట ఆనందబాష్పాలు నిలచాయి.

"అద్భుతం త్యాగయ్యగారూ! మీ గానసుధలో ఆకలేకాదు. అలసట కూడా తీరిపోయింది" అన్నాడు యాత్రకుని రూపంలో వున్న శ్రీరాముడు.

"ధన్యుణ్ణి" అంటూ తలవంచి వందనం చేశాడు త్యాగయ్య. హనుమ ఒక పళ్ళెంలో నేరేడు, అరటి, రేగి, కమలాఫలం, రామాఫలం పెట్టుకుని, మరో గిన్నెలో వడపప్పు వుంచి సీతారాముల ముందు వుంచాడు. రాముడు ఒక పండు తీసి తినబోయాడు. త్యాగయ్య తటాలున లేచి—"అయ్యా! ఒక్క క్షణం—మన్నించాలి. ముందుగా నా రాముడికి నివేదించి ఆయన ప్రసాదంగా స్వీకరించండి" అంటూ ఆ పళ్ళెం తీసుకుని రామ విగ్రహం వద్దకు తీసుకువెళ్ళాడు.

సీతారాములు, హనుమ నివ్వెరపోయి చూస్తున్నారు. స్వామికి నివేదించి తెచ్చి వారికి అందించాడు. శ్రీరాముడు ఒక అరటిపండు తీసి త్యాగయ్యకు యిచ్చాడు. సీతారాములు ఫలహారం అరగిస్తున్నారు.

హనుమ కనుసైగతో త్యాగయ్యను పక్కకు పిలచి—

"త్యాగయ్యగారూ! మా అయ్యవారు సామాన్యులుకారు. మారు

వేషంలో వున్న మహాపురుషులు. పారిజాతం వృక్షం జలజల పూలు కురిపినట్టే ఆయన అడక్కుండానే వరాలు యివ్వగలరు—" రహస్యంగా చెప్పాడు. త్యాగయ్య అనుమానంగా హనుమవంక చూశాడు.

"అడిగితే యిహ చెప్పక్కర్లేదు. మీ సంగీతం ఆయనకు నచ్చింది. మీక్కావల్సిందేవిటో అడిగెయ్యండి" హనుమ బాగా వుత్సాహపరిచాడు.

త్యాగయ్య ముక్కుపుటాలెగరేసి చిరుకోపంతో చూశాడు. రాముడి విగ్రహం దగ్గర మోకరిల్లి—

బంటురీతి కొలు వీయవయ్య రామ
తుంటవింటి వాని మొదలైన మదా
దుల బట్టి నేల గూలజేయు నిజ
బంటురీతి కొలు వీయవయ్య రామ—

ఆ కోరిక విని హనుమ తత్తరపడి రామునివంక దీనంగా చూశాడు. రాముడు అభయం యిచ్చినట్టు నవ్వాడు.

రాముడు చిరుచాప మీద శేషశాయిలా పడుకున్నాడు. సీతమ్మ పాదసేవ చేస్తోంది. హనుమ వీవన వీస్తున్నడు-త్యాగయ్య రాముని విగ్రహం ముందు కూర్చుని భక్తిపారవశ్యంలో పాడుకుంటున్నాడు—

కమల సంభవ నుత
నా హృదయమున రమింపుము
బడలిక దీర
వరమగు నైవేద్యములను
సేయని బడలిక దీర
పరవాలేక సరిపోయినట్టాడిన
బడలిక దీర

భక్తుని గానంలో ప్రచ్ఛన్న వేషంలో వున్న పరమాత్ముడు పరవశించిపోయాడు.

# 15

మంగళం కోసలేంద్రాయ
మహనీయ గుణాత్మనే
చక్రవర్తి తనూజాయ
సార్వభౌమాయ మంగళం!

త్యాగయ్య పూజ ముగించుకుని రాముల వారికి హారతి యిచ్చాడు. కమలాంబ హారతి కళ్ళకద్దుకుంది, సీత గంట మోగిస్తున్నది. బయటనుంచి సన్నాయి మేళం వినుపిస్తోంది.

ఇంతలో శిష్యుడు కంగారుగా వచ్చి "అయ్యగారూ! అయ్యగారూ! తమకోసం ఎవరో దంపతులు మేళ తాళాలతోవచ్చి నుంచున్నారు" అన్నాడు.

"లోపలికి పిలుచుకురా గణపతీ" అన్నారు పూజ మీదవున్న త్యాగయ్య.

"కాదటండీ-వారేదో దీక్షమీద వున్నారట. తమర్ని అక్కడే దర్శనం చేస్తారని...." గణపతి సందేహంగా చెప్పాడు.

"అలాగా" అంటూ త్యాగయ్య బయటకు నడిచాడు.

త్యాగయ్య ఇంటి గుమ్మంలో సన్నాయి మేళం వాయిస్తున్నారు. ఎదురుగా నడివయసు భార్యా భర్తలు భక్తిగా నిలబడి వున్నారు. వారి తీరు చూస్తే బాగా కలవారిలాగే వుంది. వారి వెనుక పది పన్నెండు కావిళ్ళతో సంభారాలు పట్టుకుని పరిజనం వున్నారు. అరటిగెలలు, పప్పులు-ఉప్పులు సమస్త సంభారాలూ-బియ్యం, బళ్ళమీద వున్నాయి.

త్యాగయ్యకు ఏమీ అర్థంకాక ఆశ్చర్యంగా చూశాడు. వచ్చిన దంపతులిద్దరూ ఆయనకు పాదాభివందనం చేశారు.

"రామార్పణం! లోపలికి దయచెయ్యండి" సాదరంగా ఆహ్వానించాడు త్యాగయ్య

"మేము కోరే వరం తమరనుగ్రహించాక అవస్యం వస్తాము. నా పేరు సదాశివయ్య-ఈమె నా భార్య పర్వతవర్ధని-మేము శైవులం-అయినా రామభక్తులం."

ఆ మాటలకు త్యాగయ్య ఆనందపడి-"శైవులే కాదు-ఆ పరమ శివుడే రామభక్తుడు" అన్నాడు—

"చిత్తం...మాకు సంతానం లేక చిరకాలంగా పరితపిస్తున్నాం. తీర్థయాత్రలు చేశాం-నోములు నోచాం-పూజా పునస్కారాలు చేశాం-నాలుగు రోజులనాడు శ్రీరామచంద్రులవారు మాకు కలలో దర్శనం యిచ్చారు. తంజపురి దగ్గరగల తిరువయ్యూరు గ్రామంలో కాకర్ల త్యాగరాజుగారింట ఒక కన్య వివాహ యోగ్యురాలు..." సదాశివయ్య చెబుతుండగా భార్య పర్వతవర్ధిని అందుకుని "సీతాలక్ష్మి అని పేరు కూడా చెప్పారండి— నిజమేనా?" అని అమాయకంగా అడిగింది. త్యాగయ్య దంపతులు ఆశ్చర్య పడి, ఔనని తల వూపారు.

"ఆ కన్యకు మేము మా ధనం వ్యయపరిచి-వివాహం జరిపితే మాకు పుత్ర సంతానం కలుగుతుందని వరమిచ్చారు. తమరు రాజాధి రాజులు పంపిన కానుకలే స్వీకరించలేదని మాకు తెలిసింది. అయినా శ్రీరామాజ్ఞ అయిందిగదా అన్న ధైర్యంతో....ఆశతో....ఇక్కడకు నూరామడ-పదినాళ్ళు ప్రయాణమై సర్వ సంభారాలతో తరలి వచ్చామండి"

అతని మాటలు విని త్యాగయ్య గాఢంగా ఉచ్ఛ్వశించి నిశ్వసించాడు.

"అయ్యగారూ! తమ యిష్టదైవం రాముడి పనుపున వచ్చాము" ప్రాధేయపూర్వకంగా అన్నాడు సదాశివయ్య.

త్యాగయ్య సదాశివయ్య చేతులు పట్టుకుని—

"రామాజ్ఞను శిరసావహిస్తాను.

జరిపించెడు వాడు రామభద్రుండట" అని తన ఆమోదం తెల్పారు.

# 16

సన్నాయి మేళం విజృంభించింది. సీతమ్మ పెళ్ళికూతురు అయింది. పెళ్ళి సంభారాలు త్యాగయ్య ఇంట్లోకి వస్తుంటే మధ్యగోడకు నిచ్చెన వేసి, పైకెక్కి చూస్తున్న గంగమ్మ కళ్ళు చెదిరిపోతున్నాయి.

“అమ్మయ్యో! అమ్మయ్యో-కావిళ్ళక్కావిళ్ళు, బస్తాలకి బస్తాలు! అమ్మనాయనోయ్-నేనేంజేతునమ్మోయ్” చాల బాధపడిపోతోంది గంగమ్మ. ఇంతలో లోపలకు వచ్చిన భర్తకు విడ్డూరంగా విషయమంతా చెప్పబోయింది. “చూశాం, చూశాం” అన్నాడు జపేశం చిరాగ్గా.

కోవెల మంటపంలో కళ్యాణవేదిక ఏర్పరచి, పచ్చని తోరణాలతో, గెలవిడచిన అరటిచెట్లతో అలంకరించారు. పెళ్ళికి ఏర్పాట్లన్నీ చేసిన సదాశివయ్య దంపతులు మంటపం దగ్గర వున్నారు.

త్యాగయ్య, కమలాంబ పట్టుబట్టలు ధరించి పిలుపుకోసం అన్నగారింటికి వెళ్ళారు.

“ఆ రాముడి కృపవల్ల అమ్మాయికి పెళ్ళి నిశ్చయమైంది. మిమ్మల్ని, వదినగారిని పిలవ....” త్యాగయ్య మాట పూర్తికాకుండానే “మేం రాము” కట్టెవిరిచి పొయిలో పెట్టినట్టు అన్నది గంగమ్మ.

“నాకు నువ్వూ, నీకు నేనూ చచ్చామని మొన్నే చెప్పానుగదా!” అన్నాడు జపేశం తీవ్రంగా.

“అవేం మాటలన్నయ్యా”—శాంతంగా అన్నాడు త్యాగయ్య. జపేశానికి కోపం తెరలు తెరలుగా వస్తోంది.

“నీకెంత పొగర్రా? రాజుగారంపిన ధనం తీసుకోరా అని బతిమాలితే, నన్ను చెప్పుతీసుక్కొట్టేటట్టు చేస్తావా? ఇవాళెవడో దారినపోయే దానయ్య ఇలా బిచ్చం పారేస్తే గడ్డి కరుస్తావా? ఎక్కడ చచ్చిందిరా నీ రామభక్తి?”

భర్త మాటకి మద్దత్తు యిస్తూ గంగమ్మ ప్రారంభించింది. "భక్తీ లేదు- భుక్తీ లేదు- గడుసుదనం — ఆనాడాసొమ్ము తీసుకుంటే మనకూడా ఇంత వాటా పారెయ్యాలన్న కుళ్ళు కొద్దీ అది వద్దన్నాడు. ఇవ్వాళ విడిపోయాక దొడ్డివారిన గడ్డికరుస్తున్నాడు.

రేపట్నించి రాజుల దగ్గర, మంత్రుల దగ్గర రాసులు పోగేసుకోపోతే నే చెవికోసుకుంటాను."

భార్య మాటకి తాళం వేశాడు జపేశం.

"ఏరా! నీ యింటి పెళ్ళికి మమ్మల్ని నీ సంపద, నీ వైభవం వెలగబోసి మమ్మల్ని పరాభవించాలనా? భ్రష్టుడా! పో....వచ్చిన దారినే పో...."

జపేశం, గంగమ్మ లోపలకు వెళ్ళి భళ్ళున తలుపేసుకున్నారు. 'అంతా రాముడి లీల' అన్నట్టు తలపంకించి వెనుదిరిగాడు త్యాగయ్య. అనుసరించింది కమలాంబ.

పెళ్ళి పందిట్లో సన్నాయి మేళంతో "మా జానకిని చెట్టబట్టగ" కీర్తన వినిపిస్తున్నది.

మంటపం పెళ్ళికి వచ్చిన పెద్దలు, పేరంటాళ్ళతో కలకలలాడుతోంది.

కళ్యాణ వేదికపై వరుడికి పాదాలు కడుగుతున్నాడు త్యాగయ్య. ఆ వరపూజ వేళలో పెళ్ళికొడుకు రాముడివలె కన్పించాడు ఆయనకు. ఆయన ఊహ అయోధ్యకు వలస వెళ్ళింది.

తళుకు చెక్కుల ముద్దు బెట్ట కౌసల్య
తపమేమి చేసెనో తెలియ...
దశరథుడు శ్రీరామా రారా అని పిలవ
తపమేమి చేసెనో తెలియ....
దహరంబు కరుగ కరమును బట్ట
జానకి తపమేమి చేసెనో తెలియ...

త్యాగయ్య రాముడివి తోడుకుని వస్తున్నాడు. త్యాగయ్య ఇంటి గుమ్మం నుంచి కిరీటిధారి అయిన రాముడు లోపలకు రాబోతున్నాడు.

అసలే గుమ్మం ఎత్తు తక్కువ. స్వామికి ఎక్కడ తగులుతుందోనని భయం—అందుకే

హెచ్చరికగా రారా
హెచ్చరికగా రారా
హే రామచంద్ర!
హెచ్చరికగా రారా
హే సుగుణసాంద్ర!

జాగ్రత్తలు చెబుతూ తోడ్కొని వచ్చాడు. శుభలగ్నం జరుగుతోంది. వరుడు వధువు మెడలో మంగళ సూత్రం కడుతున్నాడు. మంగళ వాద్యాలు మారుమ్రోగాయి. అందరూ నూతన దంపతులపై అక్షతలు జల్లారు. పెళ్ళి తంతు ముగిసింది.

అంతలో త్యాగయ్య శిష్యుడు వెంకటరమణ సీతాలక్ష్మి సమేతుడైన కోదండరాముడి చిత్రపటాన్ని, భద్రంగా గుండెలకు ఆన్చి, అరచేతులపై నిలిపి కానుకగా తీసుకు వస్తున్నాడు. త్యాగయ్య ఆ చిత్రాన్ని చూడగానే ఆనందాతిరేకంతో ఎదురేగాడు. సాక్షాత్తూ రాముడే నడచి వస్తున్నట్టు గోచరించింది ఆయనకు. ఆ ఆనందం పాటగా పల్లవించింది.

నను పాలింప నడచి వచ్చితివో నా ప్రాణనాథ!
వనజ నయన మోమును జూచుట జీ
వనమని నెనరున మనసు మర్మము దెలిసి
నను పాలింప నడచి వచ్చితివో ॥నను॥

పాట పూర్తయింది. సీతారాములు అదృశ్యులై అచ్చోట వెంకటరమణ చిత్రపటంతో నిలబడి వున్నాడు. త్యాగయ్య పటంలో వున్న సీతారాముల్ని తిలకిస్తున్నారు. వెంకటరమణ కనులు చెమర్చాయి.

"అయ్యగారూ! చిరంజీవి సీతమ్మకు పెళ్ళి కానుకగా వ్రాయించి

తెచ్చిన ఈ రాములవారి పటం తమచేత ఇంత మధురమైన కీర్తనలు పలికించింది. ఈ విధంగా నిమిత్త మాత్రుడనైనందుకు నా జన్మ ధన్యమైంది" అంటూ గురువుగారికి నమస్కరించాడు.

# 17

జగదానంద కారక!
జయ జానకీ ప్రాణ నాయక!

గగనాధిప సత్కులజ రాజరాజేశ్వర!
సుగుణాకర సుర శేవ్య భవ్యదాయక
సదా సకల జగదానందకారక!

ఇంద్రనీలమణి సన్నిభాపఘన
చంద్ర సూర్యనయనా ప్రమేయ వా
గేంద్ర జనక సకలేశ శుభ్ర నా
గేంద్ర శయన శమన వైరి సన్నుత ॥జగదా॥

పురాణ పురుష నృవరాత్మజాశ్రిత
పరాధీన ఖరవిరాధ రావణ
విరావణ అనఘ పరాశరమనో
హరా వికృత త్యాగరాజ సన్నుత ॥జగదా॥

కోవెల మంటపంలో ఏకాంతంగా కూర్చుని త్యాగయ్య గానం చేస్తున్నాడు. అప్పటి వరకు దగ్గరలో నిలబడి తన గాన మధురిమలో మైమరచి పోయిన రాజుగారిని, గురువుగారిని త్యాగయ్య గమనించలేదు. మారువేషాలు ధరించివున్న వారిద్దరూ పాట పూర్తి కాగానే ముందుకు వచ్చారు.

"నాపేరు శరభోజి. దేశమేలే రాజునన్న గర్వంతో తమవంటి సంగీత చక్రవర్తిని నా సభకు వచ్చి పాడవలసిందని ఆజ్ఞాపించాను. ఇచ్చే

చెయ్యి నాదేనన్న అహంతో కట్నా కానుకలు పంపి అవమానించాను. ఈనాడు తమ గాన సుధను, దోసిలి ఒగ్గి, తనివారా సేవించి తరించాను" మహారాజు మాటలకు త్యాగయ్య విస్తుబోయాడు. త్యాగయ్య లేచి నిల బడ్డాడు.

"తాము పుట్టిన సీమలో నేనూ వున్నందుకు ధన్యుడనయానని భావిస్తున్నాను. మనసా శిరసా తమకు మరోసారి నమస్సు లర్పిస్తున్నాను" అంజలి ఘటించాడు శరభోజి.

"రామార్పణం" అని ప్రతి నమస్కారం చేశాడు త్యాగయ్య.

పక్కనే వున్న గురువు గారికి కంటనీరు తిరిగింది. గద్గదస్వరంతో "చిరంజీవీ! గురువులకు సరికొత్త వరవడి దిద్దిన ఘనుడువి. 'దొరకునా ఇటువంటి సేవ' అని ఒకనాడు పాడావు. 'దొరుకునా ఇటువంటి శిష్యుడు' అని ఈనాడు పొంగిపోతున్నాను. కేవలం పేరుకు గురువును అయిన కారణంగా, నమస్కరించటానికి మారుగా ఆశీర్వదిస్తున్నాను. నీ సంగీతం ఆ చంద్ర తారార్కం ఆనందసుధను వర్షించాలని ఆకాంక్షిస్తున్నాను."

"సర్వం గురుకృప" అంటూ త్యాగయ్య శొంఠివారికి మోకరిల్లాడు.

# 18

త్యాగయ్య పూజా గృహం నిండుగా వుంది ఆ రోజు. త్యాగయ్య కమలాంబ మందిరానికి ఇరువేపులా కూర్చున్నారు.

నైవేద్యాలు సమృద్ధిగా అమర్చబడి వున్నాయి. పాలు, వెన్న రకరకాల పళ్ళు, వడపప్పు, నవకాయ పిండివంటలు, పులిహోర, దధ్యోజనం అన్నీ అందంగా అమర్చారు. రాములవారికి వాటిని నివేదిస్తూ—

"నన్ను గన్నతండ్రీ! రామచంద్రప్రభూ! జగన్మాతా! జానకీ! పుట్టినదాది నేటివరకూ ఎన్నడూ కళ్ళారా చూచి కూడా ఎరుగని చిత్రాతి

చిత్రమైన చిత్రాలూ, భక్ష్యాలు, భోజ్యాలు, లేహ్యాలూ, పాలు, పెరుగు, వెన్న, ఎన్నో ఈనాడు నీకోసం సమకూర్చాను. నా బిడ్డ పెళ్ళి జరిపించారు. పరమానందంగా వుంది. ఈ పూట నేనిచ్చే విందును తృప్తిగా ఆరగించండి. మీ భుక్త శేషాన్ని ఉదయం దివ్యప్రసాదంగా స్వీకరించాలని ఆశగా వుంది. మీరు ఎంత తక్కువ మిగిల్చితే అంత సంతోషిస్తాను. స్వామీ! ఆరగించండి" అని భార్యాభర్తలిద్దరూ ఏక కంఠంగా—

ఆరగింపవే పాలారగింపవే
రఘువీర! జనకజాకర
పవిత్రతమౌ వెన్న
పాలారగింపవే ॥ఆరగింపవే॥

సారమైన దివ్యాన్నము
షడ్రసయుత భక్షణములు
దారసోదరాదులతో
త్యాగరాజ నుత.... ॥ఆరగింపవే॥

అంతవరకు గొంతు కలిపి పాడుతున్న కమలాంబ 'త్యాగరాజనుత' అని భర్త పేరు రాగానే కొంచెం సిగ్గుపడి తలవంచుకొని మౌనం వహించింది. కమలాంబ తమలపాకులు చిలకలుగా మడిచి, ఒక్కొక్క వేలికి ఒక్కొక్కటి అమర్చుకుని స్వామికి ఇస్తోంది—

విడెము సేయవే
నన్ను విడనాడకవే
ఓ రామ! విడెము సేయవే
పుడమి తనయ చేతి
మంచి మడుపులనుచు
తలచి తలచి
విడెము సేయవే

తర్వాత పవళింపు సేవ చేశారు స్వామివారికి. చిన్న ఊయలలో ఉన్న విగ్రహాల నుంచి భక్తిగా, భయంగా ఊయల వూపుతూ—

ఉయ్యాల లూగవయ్య
శ్రీరామ ఉయ్యాల లూగవయ్య
సయ్యాట పాటలను
సత్సార్వభౌమా
ఉయ్యాల లూగవయ్యా

ఆ నాటికి స్వామివారి సేవలు ముగించి, ఇద్దరూ లేచి సద్దు చేయక మెల్లగా అడుగులు వేస్తూ గది బాయటకు వచ్చి తలుపు మూశారు.

# 19

అన్నదమ్ముల భాగాలకు అడ్డంగా వున్న గోడ దగ్గర ఎత్తు పీటఎక్కి గంగమ్మ త్యాగయ్య వాటాలోకి తొంగి చూసింది. నిండుగా, సమస్త సంభరాలతో వున్న ఆ కాపరాన్ని చూసి నిట్టూర్చింది. జపేశం స్తంభాన్ని ఆనుకుని భార్యని గమనిస్తున్నాడు భయం భయంగా.

"వీళ్ళసాధ్యం గూలా—వీళ్ళిల్లు వల్లకాడుగానూ, పదేళ్ళకి సరిపడ గ్రాసం వచ్చి పడిపోయిందండీ కొంపలోకి—" ఈర్ష్య వెళ్ళబోసింది గంగమ్మ.

"అదే....ఆయొక్క మనం తొందరపడి విడిపోయామేమో అని పిస్తోంది" దిగులుగా అన్నాడు జపేశం.

"తొందరా లేదు. బొందరా లేదు. ఇదంతా పెద్ద మాయ. అసలా కిటుకంతా, ఆ మహత్తంతా ఆ బొమ్మల్లో వుంది. బొమ్మలుంచుకుని మిగతా చెత్త సామానంతా మన మొహాన కొట్టాడు మీ తమ్ములుంగారు".

భార్య మాటలు విని, "అలాగా? అయితే, అందులో సగం వాటా అడిగి తెచ్చుకుంటే" తన ఆలోచన చెప్పాడు జపేశం.

"మీరెంత వెర్రివాళ్ళండీ! సగం కాదు అంతా తెచ్చుకున్నా మనకేం

ఒరిగి పడదు. ఆ రాముడూ వాళ్ళూనూ కుమ్మక్కై పోయారు. వాళ్ళూ వాళ్ళూ ఒకటే" తెలివితక్కువ గంగమ్మ నిందిద్దామని తనకు తెలియకుండానే త్యాగయ్యను పొగిడింది. మరేం చెయ్యాలనే సంశయాలలో పడ్డాడు జపేశం.

"మనకి రాపోయినా సరే వాళ్ళకుండ కూడదు. ఆ విగ్రహాలు తీసేస్తే వచ్చిన గ్రాసాలు వచ్చిన దార్నే పోతాయి. కొత్త నీరొచ్చి పాత నీరుని కొట్టేసిందని, వున్నవి కూడా పోతాయి."

"అలాగా?....కానీ మనం అడిగితే వాళ్ళిస్తారంటావా" మళ్ళీ సందేహంగా అడిగాడు జపేశం.

"ఇవ్వకపోతే లాక్కు వచ్చెయ్యండి. అదీ వీలు లేక పోతే ఎత్తుకు వచ్చెయ్యండి" భార్య ఘంటాపదంగా చెప్పేసరికి "అంతేనంటావా." అన్నాడు ధైర్యంగా జపేశం.

అనుకున్నదే తడవుగా చిన్న నిచ్చెన తెచ్చి గోడకి వేసింది. జపేశం నిచ్చెన ఎక్కాడు. మెల్లగా తమ్ముడి భాగంలోకి దిగాడు-దేవుడి గదిలోకి వెళ్ళాడు. చుట్టూ చూశాడు-త్యాగయ్య, కమలాంబ నిద్రపోతున్నారు. మందిరంలోంచి శ్రీరామ పంచాయతనం తీసి, రెండడుగుల్లో గోడ యెక్కి విగ్రహం భార్యకు అందించి తాను మెల్లగా దిగాడు. గంగమ్మ విగ్రహాలను ఒక తుండుగుడ్డలో చుట్టి భర్తకు అందించింది.

"తీసుకువెళ్ళి కావేట్లో పారేసిరండి. పీడా విరగడై పోతుంది" భార్య మాటలువిని జపేశానికి కొద్దిగా జంకు కలిగించి.

"వాడి పీడ సంగతలా వుంచు—ఆ యొక్క మనం విరగడై పోతా మేమో!" అన్నాడు సంశయిస్తూ.

"మరే భయం లేదు-ఈ రాముడు చేతిలో బాణాలు నోట్లో నాలికా లేని వాడు" భార్య ధైర్యం చెప్పింది.

జపేశం విగ్రహాల్ని పైకెత్తి చూస్తూ—"ఏమయ్యా రామయ్యా నీతో నాకేం లేదు. అంతా మావాడితోనే. ఆ యొక్క నీ సావాసం చేసి

చెడిపోయాడు కూా నిన్ను తప్ప ఒకళ్ళని పొగడనంటాడు. నువ్వేమో ఎంత పొగిడినా చిల్లిగవ్వ రాల్చవాయె. వాడు చెడిపోతాడన్న భయంతో.... అదన్న మాట.... అంచేత వాడి బాగుకోరి నిన్ను వాడికి దూరం చేస్తున్నాను.

తండ్రి తరవాత తండ్రిలాటి వాడిని నాకా అధికారం వుంది. ఏమంటావు?" జపేశం రాముడి విగ్రహంతో మాట్లాడుతుంటే గంగమ్మ తొందర తెట్టింది.

"మీరు పదండి- పని చూడండి-తెల్లారొస్తోంది. మళ్ళీ ఆయనగారు లేచి రామా, భీమా....అంటూ పాటలు మొదలెడితే...."

"అవును కదూ"- కర్తవ్యం గుర్తొచ్చి వెంటనే కదిలాడు జపేశం. విగ్రహంతో కావేరి వద్దకు వచ్చాడు. ఒడ్డున నిలబడి విగ్రహాన్ని చూస్తూ—

"ఏమయ్యా రామయ్యా! ఈత రాని వాళ్ళచేత సముద్రాలు, అంతకన్న వెడల్పాటి సంసార సాగరాలూ ఈదించేస్తావని మా తమ్ముడు నీ గురించి పాడుతూ వుంటాడు.

అంచేత నీక్కూడా ఈత వచ్చే వుంటుందిలే. అయినా నువ్వు బొమ్మవే కదా—మనలో మాట, మీ పినతల్లి కైకమ్మ చెప్పిందని నిన్ను మీ తండ్రిగారు అడవిలోకి పొమ్మన్నా కూడా! నీకానాడు కోపం రాలేదట! ఇవాళ నేను మా ఇంటిదాని మాటమీద నేనూ అలాంటి పనే చేస్తున్నాను. తండ్రి తరవాత తండ్రిలాటి వాణ్ణి. ఆ! అంచేత కోపం చేసూకోకు వుంటాను మరి—" విగ్రహానికి వీడ్కోలు చెప్పి కావేరిలోకి విసిరి పారేశాడు జపేశం.

# 20

కౌసల్యా సుప్రజా రామా
పూర్వా సంధ్యా ప్రవర్తతే
ఉత్తిష్ఠ నర శార్దూల కర్తవ్యం....

త్యాగయ్య పొద్దున్నే స్నానంచేసి పూజగది తలుపు తెరుస్తూ మేలు కొలుపు ప్రారంభించాడు.

తలుపు తెరచిన క్షణం నుంచి ఆయన చూపు నైవేద్యాల మీద నుంచి వాటిని పరికించి క్రమంగా పైకివెళ్ళి రాముడిపై ప్రసరించబోయింది.

అక్కడ రాముడు లేడు!

అర్థోక్తిగా ఆగిపోయాడు. కళ్ళను నమ్మలేక, కళ్ళు చిట్లించి పరిశీలనగా చూశాడు. దేవుని మందిరం ఖాళీగావుంది. భయంగా అనుమానంగా రెండు చేతులతో రామ పంచాయతనం వుండేచోట తడిమాడు. విగ్రహాలు లేవని నిర్ధారణ అయింది.

"రామా!....రామచంద్రా!" తట్టి మేల్కొలుపుతున్నట్టు పిలిచాడు— చుట్టూ చూశాడు. ఎక్కడా విగ్రహాల జాడలేదు. కంగారుగా కమలా... గణపతీ అంటూ కేకపెట్టాడు. వారంతా హడావిడిగా పరుగెత్తుకువచ్చారు.

"ఏవిటండీ?"

"రాముడు....నా రాముడు"

కమలాంబ, గణపతి మందిరం చూసి వులిక్కిపడ్డారు. "విగ్రహాల నెవరో దొంగలెత్తుకెళ్ళారు" అన్నాడు గణపతి.

త్యాగయ్యకు దుఃఖం పొంగి వస్తోంది. "కాదునాయనా కాదు— దొంగలైతే యివన్నీ విడిచిపెడతారా? నా రాముడు వెళ్ళిపోయాడు....నామీద కోపగించుకుని కాదు ఏవగించు కుని వెళ్ళిపోయాడు-సతీసమేతంగా సపరి వారంగా వెళ్ళిపోయాడు"

"అంతమాటనకండి-మీరేం పాపం చేశారని?" కమలాంబ వూరట కలిగించబోయింది.

త్యాగయ్య చేతుల్లో ముఖం దాచుకుని—"చేశాను కమలా—నిన్న నాకు అహం కమ్మేసింది. నా కళ్ళకి, మాటకి, మనసుకి కొవ్వు తెరలు

కమ్మేశాయి. నా స్వామి నాకు పంపిన ప్రసాదాన్నే ఆయనకు పొగరుగా నైవేద్యం పెట్టాను.

'ఎన్నడూ లేనంత గొప్ప భోజనం పెట్టాను తినవయ్యా' అన్నాను. 'నేను మహాభక్తుడిని రాముడు ఎవరికోసం వస్తాడని' విర్రవీగాను.

ఆయన కరుణా సముద్రుడు కాబట్టి నన్నేమీ అనకుండా తానే వెళ్ళిపోయాడు. ఇదేం కఠిన దండన స్వామీ! నేను భరించలేను తండ్రీ! రామా! రామయ తండ్రీ!" బావురుమన్నాడు త్యాగయ్య. ప్రసాదాలవంక భయంతో చూశాడు. అవన్నీ వెగటు తోచాయి.

"ప్రసాదం కొంచెం వుంచమన్నాను. అంతా నా మొహాన వేసి వెళ్ళిపోయాడు. గణపతీ!....కమలా...ఇది ప్రసాదం కాదు-విషాన్నం.... నా స్వామి తిరస్కరించిన విషాన్నం-ఇదంతా బయట పడెయ్యండి. ఈ వంటకాలు ఈ గిన్నెలు అన్నీ బయట పడెయ్యండి. ఇవేకాదు మొన్న పెళ్ళికంటూ ఆ దంపతులిచ్చిన సంభారాలు, పప్పులు, ఉప్పులు, పాత్రలు సమస్తం బయట పడెయ్యండి-అవి ఒక్క క్షణం యింట్లో వుండకూడదు...."

పూనకం వచ్చినవాడిలా శాపించాడు త్యాగయ్య. శిష్యులు, కమలాంబ ముఖాలు చూసుకున్నారు-తక్షణం సామగ్రి అంతటినీ బయట పడవేసే పనిలో నిమగ్నమయ్యారు శిష్యులు—

పక్కవాటాలో కిటికీలోంచి జపేశం, గంగమ్మ వింత చూస్తున్నారు.

"చూశారా—నేచెప్పలే—ఆ బొమ్మలో ఏదో తంత్రం, మంత్రం వున్నాయని. అవలా పారేశాం—ఇంట్లోకి ఎలావచ్చిన సరుకు అలా వీధిలోకి వెళ్ళిపోతోంది"

భార్య మాటలు వింటున్న జపేశానికి చెయ్యి బాధ గుర్తొచ్చి మూలిగాడు. విగ్రహం విసిరేసిన దగ్గర్నించి జపేశానికి చెయ్యి స్వాధీనం తప్పింది.

"వాడి సంపద చట్టుబండలుగాను. నా చెయ్యి పడిపోయిందిగా!" అన్నాడు బాధగా—

"ఏం కాదు—ఆ విసుర్లో బెణికింది కాస్త—ఇంకో రెండు మంత్రాలు వేసి, ఆవదం కాస్త మర్దనా చేస్తే అదేపోతుంది" ధైర్యం చెప్పింది గంగమ్మ.

మరిది కొంప మామూలు స్థితికి వచ్చినందుకు గంగమ్మ సంతృప్తిగా నిట్టూర్చింది. జపేశం సంతోషాన్ని చెయ్యి బాధ మింగేసింది.

# 21

కావేరీ తీరాన చెట్ల నీడన ఒంటరిగా కూర్చున్నాడు త్యాగయ్య. కన్నీరు కావేరిగా ప్రవహిస్తున్నది. చూపులు దీనాతి దీనంగా శూన్యంలోకి చూస్తున్నాయి.

ఎటుల బ్రోతువో తెలియ
ఏకాంత రామయ్యా
ఎటుల బ్రోతువో తెలియ
కట కట నా చరితము
కర్ణ కఠోరమయ్యా
ఎటుల బ్రోతువో తెలియ

కమలాంబ గిన్నెలో పాలు తీసుకుని వచ్చింది. నెమ్మదిగా త్యాగయ్య దగ్గర కూచుని "ఉదయం నుంచీ ఏమీ తీసుకోలేదు. కాపినిపాలు...." అంటూ గిన్నె అందివ్వబోయింది. త్యాగయ్య భారంగా నిట్టూర్చాడు- ఒక నిర్ణయానికి వచ్చాడు.

"నా రాముడు లేని యింట, పచ్చి మంచినీళ్ళు కూడా ముట్టలేను.... కమలా! నేను వెళ్తాను. నా స్వామిని వెతుక్కుంటూ వెళ్తాను. క్షమాపణ చెప్పుకుని, బ్రతిమాలి యింటికి తీసుకువస్తాను."

"ఎక్కడని వెదుకుతారండీ?" బాధగా అన్నది భార్య.

"దొరికేవరకూ.... కంఠంలో ప్రాణం వుండేవరకూ...." ఆయన జవాబుకు కమలాంబ కంగారుగా చెవులు మూసుకుంది.

"అమంగళం పలక్కండి. పదండి. మీ వెంట నేనూ వస్తాను. మీరు లేని యింట్లో నేను మాత్రం వుండగలనా?"

"వద్దు కమలా! ఒకవేళ నేనటు వెళ్ళగానే చూపి జాలిపడి నా స్వామి ఇంటికివస్తే- ఇద్దరం లేకపోతే ఎలా?" త్యాగయ్య మాటకి బదులు చెప్పలేకపోయింది కమలాంబ. ఆయన చెప్పిందీ నిజమే అనుకున్నది.

"పసుపు దేవుళ్ళను నిలిపి పూజ చేస్తూవుండు కమలా. నా స్వామి నాకు తప్పక కనిపిస్తాడు" అంటూ భార్యను తలపై నిమిరి అన్వేషణకు బయలుదేరాడు త్యాగయ్య.

కావేరి పరిసరాలలో వేయి కన్నులతో వెదుకుతూ తిరుగుతున్నాడు త్యాగయ్య.

ఎందు వెదకుదురా
నే నెందు వెదకుదురా
హరీ!
నే నెందు వెదకుదురా
హరిని- నే నెందు వెదకుదురా?

ఒక పాడుపడిన గుడిదగ్గర వెదకి, వెదకి నిస్త్రాణగా కూలబడ్డాడు. దీనంగా రాముని వేడుకుంటున్నాడు.

జార చోర భజన చేసితినా
సాకేత సదన
మారు బల్కకున్నా వేమిరా
మా మనోరమణ
మారు బల్కకున్నా వేమిరా?

కొలను ఒడ్డున చెట్టుమానుకు జేరబడి రామునికోసం పరితపి స్తున్నాడు—

ఎన్నడు చూతునో ఇనకుల తిలక
నిన్నెన్నడు చూతునో
పన్నగ శయన - భక్తజనావన
పున్నమి చందురుబోలు ముఖమును
ఎన్నడు చూతునో—

త్యాగయ్య పడుతున్న వేదనని, అనుభవిస్తున్న అవేదనని సపరి వారంగా యాత్రలకు వెళుతున్న సుందరేశ మొదలి అనే ఒక శ్రీమంతుడు చూశాడు. త్యాగయ్య వెంటవున్న గణపతిని వివరం అడిగి తెలుసుకున్నాడు సుందరేశ మొదలి.

నా మొరాలకింపవేమి
నా మొరాలకింపవేమి శ్రీరామ!

దారి తెన్నూ తెలియక స్వామి అన్వేషణలో పిచ్చివాడిలా పాడుతూ తిరుగుతున్నది త్యాగయ్యగారని తెలిసి సుందరేశం నివ్వెరపోయాడు.

వెంటనే త్యాగయ్య దగ్గరకు వచ్చి వినయంగా నమస్కరించి "త్యాగయ్యగారూ! నా పేరు సుందరేశ మొదలి. మాది కోవూరు." పరిచయం చేసుకున్నాడు. త్యాగయ్య నిర్లిప్తంగా చూశాడు.

"తమగురించి విద్వాంసులు, గాయకులు ఎంతో చెప్పగా విన్నాను. ఈ నాడు తాము పాడుతుండగా వినే భాగ్యం కలిగినా తమరిని ఈ స్థితిలో చూడడం ఎంతో బాధగా వుంది." సానుభూతి వచనాలు త్యాగయ్య చెవికి యెక్కలేదు. త్యాగయ్య చూపు, మనసు ఎక్కడో వున్నాయి- ఎటో చూస్తూ బాధగా—

"చేసిన పాపానికి శిక్ష అనుభవిస్తున్నాను" అన్నాడు.

"అయ్యా! పెద్దలు....తమకు చేప్పే యోగ్యత ఏ విధంగానూ

లేనివాడనయినా సాహసిస్తున్నాను. మధుర మంజుల గానామృతంతో లోకాన్ని పరవశింపచేయగలిగిన వరప్రసాదులు, కారణజన్ములు- తాము ఈ విధంగా కేవలం పూజా విగ్రహాలు పోయాయని పరితపిస్తూ...." సుందరేశం ఓదార్పు మాటలకు ఒక్కసారి తలెత్తి చూసాడు త్యాగయ్య. ముఖం దీనంగా వుంది.

"పోయినవి విగ్రహాలు కావు స్వామీ. నా ఇంటి దేవతలు - నా రాముడు, సీతమ్మతల్లి, లక్ష్మణుడు, హనుమంతుడు, అందరూ నన్నేవగించుకుని వెళ్ళిపోయారు. ఆ రూపాల్లో మళ్ళీ వాళ్ళు కన్పించేవరకూ యీ జీవితానికి శాంతిలేదు". త్యాగయ్య దృఢనిశ్చయానికి, భక్తికి సుందరేశ మొదలి విభ్భ్రాంతి చేతులు జోడించాడు___

"స్వామీ! తమ హృదయాన్ని అర్థంచేసుకోలేక ఏదో చెప్ప బోయాను. మన్నించండి. ఒక్క మనవి. మీరు దైవాన్వేషణలో వున్నారు. నేనూ కుటుంబంతో తీర్థయాత్రలు చేస్తున్నాను. తమకు అభ్యంతరం లేక పోతే మా బృందంతో దయచేయండి. ఏ గుడిలో ఏ దేవుడో కరుణించి మీకు మీ స్వామిని చూపించకపోడు."

సుందరేశం బృందంతో తీర్థయాత్రలు చేస్తూ తన రాముని వెదక డానికి నిశ్చయించుకున్నారు త్యాగయ్య. అంగీకారం తెల్పగానే తన జన్మ ధన్యమైనట్లు ఆనందించాడు మొదలి.

యాత్రికుల బృందం అందరితో ముందుకు సాగింది.

# 22

యాత్రికుల బృదం కాంచీపురం చేరింది. అక్కడ వరదరాజస్వామి ఉత్సవం, ఊరేగింపు జరుగుతున్నాయి. వరదరాజస్వామిని భక్తితో కొలిచాడు త్యాగయ్య.

వరదరాజ నిన్నే కోరి వచ్చితిరా—మ్రొక్కేరా
వరదరాజ నిన్నే కోరివచ్చితిరా
వరగిరి వైకుంఠమట—వర్ణించ తరముగాదట

నిర్జరులను తారకలలో చంద్రుడవై మెరయుదువట—
వరత్యాగరాజ నుత గరుడసేవ జూడ
వరదరాజ నిన్నే కోరి వచ్చితిరా—

ఉత్సవాన్ని కనులారా తిలకించాడు త్యాగయ్య. ఆలయంలో కూచిపూడి భాగవతుల 'భామాకలాపం' ప్రదర్శనకు సుందరేశమొదలి, ఇతర యాత్రికులతోబాటు త్యాగయ్య కూడా హాజరైనాడు-కూచిపూడి సంప్రదాయంలో వేదిక, అవనికలు అమర్చారు. భాగవతుల గానం సుశ్రావ్యంగా ప్రారంభమైంది—దానికి తగిన నాట్యం కనులవిందు చేయసాగింది.

మధురా నగరిలో చల్లనమ్మబోదు
దారి విడుము కృష్ణా! కృష్ణా!
మాపటి వేళకు తప్పక వచ్చెద
పట్టకు కొంగు గట్టిగాను కృష్ణా మధురా॥
కొసరి కొసరి నాతో సరసములాడకు
రాజమార్గమిది కృష్ణా! కృష్ణా!
వ్రజ వనితలు ననుచేరవత్తురిక
విడు విడు నాచేయి కృష్ణా! కృష్ణా! మధురా॥

నృత్యం పూర్తయింది. కూచిపూడి భాగవతులు గోపీకృష్ణుల పాత్రధారులు, వీణ, వేణువు. మృదంగం వాద్యకారులు రంగస్థలం దిగి త్యాగయ్యను సమీపించారు. వారంతా సవినయంగా నమస్కరించారు.

"శ్రీరామచంద్ర కటాక్ష ప్రాప్తిరస్తు. చాలా చక్కగా వున్నది నృత్యం. నృత్యం, సంగీతం, సాహిత్యం అన్నీ సమ్మోహనకరంగా వున్నాయి" అంటూ వారిని దీవించి, ప్రశంసలందించాడు త్యాగయ్య.

వారిలో ఒక కళాకారుడు ముందుకువచ్చి—"స్వామీ! ఈ కీర్తన చిరంజీవిగా వుండాలని కలకాలం జనులు పాడుకోవాలనీ తమరు వరమివ్వాలి" అని కోరాడు.

త్యాగయ్యకు, మొదలికి ఏమీ అర్థంకాలేదు. వారివంక ప్రశ్నార్థకంగా చూశాడు త్యాగయ్య.

వెంటనే ఆ భాగవతులు—"నా మనసులో మాట ధైర్యంచేసి చెప్పేస్తున్నాను. తమరు ఈ ఆనందభైరవి రాగాన్ని మాకు పరిదానంగా అనుగ్రహించాలి"

త్యాగయ్య సాలోచనగా చూశాడు.

"తమరు సంగీత సముద్రులు—స్వరార్ణవాన్ని ఔపోశనం పట్టిన అగస్త్యులు. ఈ ఒక్క ఆనందభైరవి రాగంలో తమరు ఇటుపై పాటలు చెప్పకుండా వుంటే నాపాట చిరకాలం బతుకుతుందని ఆశ-ఎందుకు మీరీ రాగాన్ని వదిలేశారూ—అన్న ప్రశ్న వచ్చినపుడల్లా, ఈ పాటనీ మమ్మల్ని ప్రజలు తలచుకుంటారు" అంటూ చేతులు జోడించాడు.

"తథాస్తు" అన్నాడు త్యాగయ్య మందహాసం చేస్తూ.

యాత్ర కొనసాగిస్తూనే వున్నారు. చుక్కల పర్వత శిఖర దర్శనం చేశారు.

తిరుపతి కోవెల శిఖరం గోచరించింది.

"అదిగో, అల్లదిగో శ్రీహరివాసము" అంటూ భక్తులు గానంచేస్తూ కొండపైకి స్వామి దర్శనార్థం వెళుతున్నారు భక్తులు. యాత్రికులు తండోప తండాలుగా గోవింద నామస్మరణ చేస్తూ సప్తగిరులపై సాగిపోతున్నారు.

త్యాగయ్య, శిష్యులు, మొదలి అతని అనుచరులు ఏడుకొండలూ యెక్కి శ్రీ వెంకటేశుని ఆలయ ప్రాంగణంలో అడుగుపెట్టారు. ముఖ మంటపం దాటి గర్భాలయంలో అడుగుపెట్టారు. స్వామి గర్భగుడి

గుమ్మంలో తెర అడ్డంగా వుంది. త్యాగయ్య శిష్యుడు కొంచెం ధాటిగా ముందుకువచ్చి "ఏమిటీ అన్యాయం? ఏమిటీ అవమానం? మా గురువుగారు మహాభక్తులు సాటిలేని మేటి గాయకులు-వారు రాగా చూసి, తెర అడ్డు వేస్తారా? తియ్యండి" అంటూ అర్చకులమీద ఆగ్రహపడ్డాడు. వెంటనే త్యాగయ్య శిష్యుణ్ణి శాంతించమని సైగచేశారు.

"నాయనా! గణపతీ! ఆలయ మర్యాదలను పూజా సంప్రదాయాలను విమర్శించడం ధర్మంకాదు. స్వామివారి పూజలు ఆపి, తెరలు తీయవలసిన గొప్పతనం ఈ భూమి మీద ఎవరికీలేదు-ఆ తెరకన్న దట్టమైన తెరలు మనలో చాలా వున్నాయి. అవి తొలగించమని స్వామిని వేడుకుందాం"

తెర తీయగ రాదా
నాలోని తెర తీయగ రాదా
తిరుపతి వెంకటరమణ
మత్సరమను తెర తీయగ రాదా!

పరమ పురుష!
ధర్మాది మోక్షముల పారదోలుచున్నది
నాలోని తెర తీయగ రాదా
వాగురమని తెలియక మృగగణములు

వచ్చి, తగులు రీతి యున్నది
వేగమే నీ మతము ననుసరించిన
త్యాగరాజనుత మద మత్సరమను
తెర తీయగ రాదా—

పాట ముగిసేసరికి తటాలున స్వామి ఎదుటవున్న తెరజారి నేలకి పడిపోయింది. మూల విరాట్ సాక్షాత్కరించాడు.

త్యాగయ్య భక్తితో నమస్కరించాడు. అక్కడి వారంతా జరిగిన సంఘటనకు నివ్వెరపోయారు—అర్చకులు సంభ్రమాశ్చర్యాలతో వచ్చి

త్యాగయ్యకు నమస్కరించి సకల ఆలయ మర్యాదలతో లోనికి తీసుకు వెళ్ళారు. స్వామిని తనివితీర దర్శించుకున్నాడు త్యాగయ్య. ఆయనకు స్వామి శివుడుగా, విష్ణువుగా, రాముడుగా, కృష్ణుడుగా-అనేక రూపాలలో దృగ్గోచరమైనాడు—త్యాగయ్య బహు రూపాలలో భగవంతుని దర్శించి తన్మయుడై—

ఎవరని నిర్ణయించిరిరా
నిన్నెట్లారాధించిరి రా
నరవరు లెవరని నిర్ణయించిరి రా
శివుడవో, మాధవుడవో
కమల భవుడవో పరబ్రహ్మవో ॥ఎవరని॥

శివ మంత్రమునకు 'మ' జీవము
మాధవ మంత్రమునకు 'రా' జీవము
ఈ వివరము దెలిసిన ఘనులకు మ్రొక్కెద
వితరణ గుణ త్యాగరాజ వినుత
నిన్నెవరని నిర్ణయిచిరి రా—

అంటూ ఒక కృతిలో స్తుతించాడు.

# 23

రోజులు గడిచిపోతున్నాయి. త్యాగయ్య రాముని జాడకోసం క్షేత్రాలన్నీ గాలిస్తున్నాడు. ఎక్కడా స్వామివారు లభ్యంకావడం లేదు.

ఇంటిదగ్గర కమలాంబ భర్తకోసం పరితపిస్తోంది దీనంగా విషణ్ణ వదనంతో ఇంటిదగ్గర పొద్దుబుచ్చుతోంది. భర్త కూచుని పాడే చోట, గురుకులం దాపున వారి అడుగు జాడలకోసం ఆశగా వెదకుతున్నట్టు అక్కడ తిరుగుతోంది. ఎప్పుడూ రంగవల్లులతో, రామసంకీర్తనంతో నిండివుండే

గురుకులం శిథిలమైంది. పిచ్చిమొక్కలు, రెల్లుదుబ్బులు లేచాయి ఆ ప్రాంగణంలో—

కమలాంబ తన బాధని ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక చివరకు సీతమ్మతల్లిని వేడుకున్నది—

"ఎడబాటు ఎంత బాధో నీకూ నీ స్వామికి బాగా తెలుసు. భర్తలేని ఈ మరు భూమిలో - చీకటిలో నీడలా వుండీ లేనట్లున్నాను తల్లి. భరించే శక్తి నన్నుగిల్లిపోతూంది— నన్నుబ్రోవమని చెప్పవే - సీతమ్మతల్లీ!" అని ప్రాధేయపడింది కమలాంబ.

కమలాంబ గోడు సీతమ్మతల్లి చెవిన పడ్డట్లుంది. త్యాగయ్య బృందం కొండదిగి వస్తుంటే, మారువేషాలతో సీతారాములు, హనుమ యెదురుపడి త్యాగయ్యను పలకరించారు....

"తమరు తిరువయ్యూరు త్యాగబ్రహ్మంగారు కదూ" అని అడిగాడు హనుమ. ఔనన్నట్టు తల వూపాడు త్యాగయ్య.

"మేము గుర్తున్నామా స్వామీ" అన్నాడు రాముడు.

"ఇంటినీ ఇల్లాలినీ మరిచి తిరిగే మహానుభావులకు ఒక పూట అతిథులం మనమెక్కడ గుర్తుంటాము" అన్నది సీతమ్మ ఎత్తిపొడుపుగా— త్యాగయ్యకు ఆ మాట ముద్రున తగిలింది. కొంచెం కంగారుగా—

"అదికాదు తల్లీ! నా యింట శ్రీరామ పంచాయతనం...." అంటూ ఏదో చెప్పబోతున్న త్యాగయ్య మాట పూర్తికాకుండానే సీతమ్మ కొంచెం కటువుగా—

"తెలుసు ...మీరా దేవుళ్ళను వెతుక్కుంటూ దేశాటన చేస్తుంటే అక్కడా యిల్లాలు దిక్కూ మొక్కూలేక మీ కోసం కంటికీ మింటికీ ఏక ధారగా ఏడుస్తోంది. అయినా కాకపోయినా దేవుళ్ళని వెదకడం ఏమిటయ్యా స్వామీ! రాముడు ఎక్కడ లేదు? ఎక్కడ వుండడు? ముందు వెనకల ఇరు పక్కల తోడై నీ వెంట నడుస్తుంటాడు గదయ్యా"-మందలించింది.

"నువ్వు వెంటనే నీ యింటికివెళ్లి నీ యిల్లాలి కన్నీరు తుడు-ఆ సీతా రాములకు జాలి, అవీ తెలిస్తే నిన్ను వెతుక్కుంటూ వాళ్లే నీ యింటికి వస్తారు" అని సలహా యిచ్చింది.

ఆమె మాటలకు జవాబు చెప్పలేక త్యాగయ్య తలదించుకున్నాడు. రాములవారు మందహాసంచేసి-"సాటి యిల్లాలి బాధ తెలిసి. మా ఆవిడ కొంచెం కోపగించి ఆవేశంగా మాట్లాడింది. తమరు వేరేగా భావించ కండి" అంటూ సమర్థించబోయాడు.

"లేదు స్వామీ! ఆమె నా కన్ను తెరిపించింది. నాలోని అజ్ఞానపు తెరను తొలగించింది. అమ్మా! నీ మేలు ఎన్నటికి మరువను-సెలవు" అని త్యాగయ్య వారికి నమస్కరించాడు. సీతారాములు ముందుకు కదిలారు.

అప్పటికే త్యాగయ్య బాగా డస్సి వున్నాడు. పరిస్థితి గమనించిన సుందరేశ మొదలి-"అయ్యా! ఈ స్థితిలో తాము అంత దూరం కాలినడకన వెళ్లడం క్షేమం కాదు. పల్లకీ ఏర్పాటు చేస్తాను, కాదనకండి" అన్నాడు.

అంగీకార సూచనగా తలపంకించాడు త్యాగయ్య. తిరుగు ప్రయాణానికి సన్నద్ధుడైనాడు త్యాగయ్య. ఆలయంలో ప్రదక్షిణం చేస్తున్న గురువుగారి దగ్గరకు గణపతి ఆదుర్దాగా పరుగెత్తుకువచ్చి—

"ఈ వూళ్ళో పులిభయం జాస్తిటండి. చీకటిపడితే అరిచ్చచ్చినా ఎవరూ తలుపులు తియ్యరుట. పాపం ఆ బాటసారి పెళ్ళాం పిల్లలతో నిన్నరాత్రి వచ్చాట్ట! ఎక్కడా ఎవ్వరూ పలక్కపోతే గుళ్ళోనైనా తలదాచుకుందామని చూశాడు. ఆ తలుపులూ గడియవేసి వున్నాయి. తను గడియ తీస్తానని చెప్పి గోడ దూకాట్ట! గోడవతల దిగుడుబావి వుందిట - అందులో పడి చనిపోయాడు" అని జరిగిన కథంతా వివరించాడు.

అటు చూస్తే ఎదురుగా ఒక గుంపు కనబడింది. శోకాలు వినిపిస్తున్నాయి.

త్యాగయ్య కంట నీరు తిరిగింది. విశ్చలంగా చూస్తూ "లోకంలో

జీవులు పుట్టడం, పోవడం సహజమే. కాని నీ శరణుకోరి పవిత్రమైన నీ ఆలయంలో కాలుపెట్టిన మనిషి - నీ ఎదుటే చనిపోవడం సత్యంకాదు - కాకూడదు.

తండ్రీ! నీదయకు దూరమై అనాధుడిగా తిరుగుతున్న నాకీ తనువుతో పనిలేదు - నా ప్రాణం యిస్తాను. నా పుణ్యం సర్వస్వం ధారపోస్తాను - అతన్ని బతికించి ఆ యిల్లాలినీ బిడ్డలనీ దయచూడు తండ్రీ!" అని స్వామికి విన్నవించాడు.

ఈసారి ఆలయంలోకి వెళ్ళాడు. స్వామివారి సన్నిధిలో కూర్చున్నాడు.

నా జీవాధారా
నా జీవాధారా
నా జీవాధారా

నాదం రోదసి అంతటా నిండిపోయింది. త్యాగయ్య వదనం దుర్నిరీక్షంగా, సూర్యబింబంలా వెలిగిపోతోంది. కన్నీరు ధారలై ప్రవహిస్తోంది.

నా జీవాధారా
నా నోముఫలమా
రాజీవలోచన
రాజ రాజ శిరోమణి
నా జీవాధారా
నా చూపు ప్రకాశమా
నా నాసికా పరిమళమా
నా జపవర్ణ రూపమా
నాదు పూజా సుమమా
త్యాగరాజ నుత
నా జీవాధారా

పాట పూర్తయే సరికి చనిపోయిన మనిషి కదిలాడు. అప్పుడే నిద్ర మేల్కొన్నట్టు ఠగ్గున లేచాడు - జనంలో కలకలం బయలుదేరింది.

"మహాప్రభూ! ఆదేవుడు చంపేస్తే ఈ దేవుడు బతికించాడు. మీరే మాదేవుడు" - కుటుంబ సభ్యులంతా త్యాగయ్యకు మొక్కారు. ఆయన ధ్యానం వదలి.

"తప్పుతల్లీ! నీకూ నాకూ అందరికీ తల్లీ, తండ్రీ, ప్రాణదాత అన్నీ ఆ దేవుడే - మనరాముడే? రాముడికి మొక్కుతల్లీ" అన్నాడు.

కోవెల దేవుడికి అందరూ మొక్కారు.

# 24

పల్లకీలో ఇంటికి బయలుదేరాడు త్యాగయ్య. పల్లకిలో వెనక్కి చేరబడి నిస్త్రాణతో వున్నాడు. పక్కన శిష్యుడు గణపతి చురుగ్గా నడుస్తున్నాడు.

ఇంతలో పల్లకీపై ఎవరో రాళ్లు రువ్వడం ప్రారంభించారు, పల్లకీ ఆగింది. బోయీలు పల్లకీ దింపి, కర్రలు తిరగేసి అటూ యిటూ పరికించి చూస్తున్నారు.

ఏమిటి సంగతి అని అడిగాడు త్యాగయ్య___

"దొంగలెవరో మనను వెంటాడి రాళ్లు రువ్వుతున్నారు" అని చెప్పాడు గణపతి.

"దొంగలా? దోచుకుందుకు మనదగ్గరేముంది? పాపం! ప్రయాస పడవద్దని చెప్పిరా" అన్నాడు చాలా శాంతంగా.

గణపతి కొంచెం యిబ్బంది పడుతూ—"పల్లకీలో వెయ్యి వరహాలు సొమ్ము దాచానండీ" అన్నాడు.

"సొమ్ము ఎక్కడిది? ఎవరిచ్చారు?" త్యాగయ్య కంఠం ఖంగు మన్నది.

"వారే సుందరేశ మొదలిగారు..." నసిగాడు గణపతి.

"గణపతీ నువ్వెందుకు తీసుకున్నావు? నా కెందుకు చెప్పలేదు" నిగ్గ దీశాడు గురువుగారు.

"వారికి చెప్పానండి. కాని వారు 'ఈ సొమ్ము మీ గురువుగారికి కాదు. మీ వూరి శ్రీరాములవారి కైంకర్యానికి' అని చెప్పారండి."

త్యాగయ్య మనసు తేలిక పడింది. "అలాగా? ఇక మనకేల చింత? రాముడిసొమ్ము రాముడే చూసుకుంటాడు. పదండి" అన్నాడు.

పల్లకి కదిలింది. త్యాగయ్య ఆనందంగా పాడుతున్నాడు—

ముందు వెనుక
ఇరుప్రక్కల తోడై
మురఖరహర
రారా రారా రామ
చండభాస్కర కులాబ్ధిచంద్ర
కోదండపాణియై రారా రారా
అండగొలుచు సౌమిత్రి సహితుడై
అమిత పరాక్రమ
రారా రామ

నలుగురు దొంగలు పల్లకీని చుట్టు ముట్టాలని కత్తులు, కర్రలు పట్టుకుని వస్తున్నారు. రామలక్ష్మణులు పల్లకీ వెనుక, ముందూ ఆ దొంగలు

ఎటు వెళితే అటు కనబడి బాణాలతో కొడుతున్నారు-దొంగలు దెబ్బ తగిలినా ఆనందంతో ముగ్ధులై వారినిచూపి పక్కకు పోతున్నారు. మళ్లీ వస్తున్నారు—

తెల్లవారింది. పల్లకిని కావేరి ఒడ్డున దింపారు బోయీలు. త్యాగయ్య బయటకు వచ్చాడు.

దొంగలు పరుగు పరుగున వచ్చి ఆయన పాదాలకు మొక్కి-లేచారు—

"మహారాజా! మమ్మల్ని కాపాడండి-మమ్మల్ని కాపాడండి."

త్యాగయ్య ఒక్కక్షణం ఆశ్చర్య పోయాడు-అంతలోనే ఆయనకు అర్థమైంది.

"నేను మహారాజును కాదు నాయనా. ఈ వాహనం యీ వైభవం నావికావు. ఒకానొక భక్తుడు...."

ఆయన మాట పొంతం వినకుండానే—

"అదేంకాదు మీరు మహరాజులె' అని వాదించాడొక దొంగ.

"మా దేసంలో వున్న మారాజుగారు" అన్నాడు మరొకడు. "మీ రాజుకాపోతే చక్కరవర్తుల్లా వున్న ఆ రాజభటులిద్దరూ తమరెంట తెల్లార్లూ కాపలాగా ఎందుకు నడుస్తారు?" అని అడిగాడు మొదటి దొంగ.

"రాజభటులా?" త్యాగయ్య నివ్వెరబోయాడు.

"అబ్బో ఎంత చక్కని భటులు!"

"ఎంత గొప్ప బటులు!"

"ఏవి ఎలుగు? ఏవి జిలుగు?"

"ఎంతెలుగంటే, సూటిగా సూత్తే కళ్ళోతాయని బయవేసింది"

"ఎదవ కళ్ళు పోతేపోనీ—మల్లింకోపాలి సూడాలన్నంత ఆశ కలిగేది"

"ఆళ్ళు బాణాలేపి సావగొడుతున్నా వోబుద్ధిగా లేదండి"

"ఆళ్ళు కొట్టడం, మేం పారిపోడం, మల్లెల్లడం మల్లా బాణం దెబ్బలు...."

"ఎంత మంచోల్లంటే ఎదవల్లారా! ములుకులున్న బాణాలేత్తే సత్తారు పొండిరా అంటూ పిట్టల్నిగొట్టే బాణాలేపి కొట్టారండి"

"అయ్యా! ములుకు బాణాలేపి పాణం దీపినాసరే, ఇంకొక్కపాలి ఆళ్ళని సూపించండి—సంతోసంగా సచ్చిపోతాం"

రకరకాలుగా చెప్పిన దొంగల మాటలతో త్యాగయ్యకు విషయమంతా అవగతమైంది. ఆయన చూపు ఎక్కడికో వెళ్ళిపోయింది. ఉద్వేగంతో, బాధతో పెదిమలు వణికిపోతున్నాయి. దొంగల భుజాలపై చేతులు వేసి నిమిరాడు—

"నాయనా! మీరు ఎంతో పుణ్యాత్ములు. జన్మంతా తపసుచేసినా, ఒక్కక్షణంపాటు మనోనేత్రానికూడా స్ఫురించని దివ్య మంగళ విగ్రహాన్ని మీరు కళ్ళారా చూశారు. నరాకృతి ధరించిన నాద పరబ్రహ్మం. ఆ శ్రీరామ చంద్రమూర్తి దర్శనం మీకు లభించింది. రాత్రంతా ఆయనను చూస్తూ నడిచిన మీరు ధన్యులు. నేనుకూడా మీ తోడుదొంగనైతే నాకూ ఆ దర్శన భాగ్యం అబ్బేదేమో!"—ఉద్వేగంతో, బాధతో

'ఎన్నగ మనసుకు రాని పన్నగశాయీ

నీ సొగసు పన్నుగ కను గొనని కన్నులేలే

కంటి మిన్నలేలే' అని స్వరరహితంగా అనుకుంటూ నడిచాడు త్యాగయ్య. ఆయన కంఠం రుద్ధమైంది.

"తండ్రీ! రామచంద్ర ప్రభూ! పాపాత్ముడిని కూడా క్షమించగలిగిన కరుణా సముద్రుడివి. ఆశ్రిత పారిజాతానివి. నన్నెందుకిలా కఠినంగా శిక్షిస్తున్నావయ్యా! నాకు రక్షపేరిట నా వెనుక నడిచావా? నాకు ముందు వెనుక లిరుపక్కల తోడై నడుస్తూనే నాక్కనపడకుండా దాగుడుమూత లాడుతావా? నన్ను దోచవచ్చిన దొంగలకు దర్శనమిచ్చావా? నీకిది ధర్మం కాదు—ఈ దండన భరించలేను"

త్యాగయ్య చెట్టువెనక, పుట్టవెనక పిచ్చివాడిలా వెదకడం ప్రారంభించాడు. "ఎక్కడున్నావు రామా—ఒక్కసారి కనిపించు రామా—పరంధామా? నాయనా! లక్ష్మణస్వామీ! నువ్వైనా మీ అన్నకు చెప్పవయ్యా. ఈ జీవి యీ దండన భరించలేదు." కావేరి నీటి అంచుకు వచ్చాడు జల ప్రవేశానికి సిద్ధమైనాడు.

"రామా! నా తండ్రీ! నా ప్రాణమా! నా జీవాధారా! నా సర్వస్వమా నువ్వు కనబడకపోతే నేనీ కావేరిలో తనువు చాలిస్తాను—ఈ అగ్నిని భరించలేను—రామా! పరంధామా!" అంటూ కావేరిలోకి పరుగెత్తాడు త్యాగయ్య.

కావేరి ఏమీ ఎరగనట్టు, కాలవాహినిలాగే ప్రవహిస్తోంది. క్రమంగా సూర్యుడు బంగారు నీరాజనం పట్టగా నీటిలోంచి శ్రీరామ పంచాయతన విగ్రహాలు పైకి లేచాయి. త్యాగయ్య విగ్రహాలను గట్టిగా పట్టుకుని

గుండెలకు హత్తుకున్నాడు. విగ్రహాలను కళ్ళారా చూసుకున్నాడు. ఆయన ముఖంలో కోటి దీపాలు వెలిగాయి. ఆనందం, ఆశ్చర్యం, సంభ్రమం పరవళ్ళు తొక్కాయి. పరవశించి పాడాడు—

కనుగొంటిని
శ్రీరాముని నేడు కనుగొంటిని
నా రాముని నేడు కనుగొంటిని
ఇనకులమందు ఇంపుగాను పుట్టి
ఇలలోన సీతా నాయకుని నేడు కనుగొంటిని
శ్రీరాముని నేడు కనుగొంటిని —

తడిబట్టలతో వున్న త్యాగయ్య రాముడు దొరికిన ఆనందంలో మైమరచి చిందులు వేస్తూ పాడుతున్నాడు. స్వామిని ఊరేగింపుగా ఇంటికి తోడ్కొని వెళ్ళాడు.

రారా! మా యింటి దాకా
రామ! రారా! మా యింటి దాకా
రఘు వీర! సుకుమార! మ్రొక్కెరా!
రారా! దశరథ కుమార నన్నేలుకోరా!
తాళలేరా! రారా! మా యింటి దాకా—

వాడలోని ప్రజలంతా వీధిలోకి వచ్చి వింతగా చూశారు. ఆ రామునికి నమస్కరించారు.

తన స్వామితోసహా వేంచేస్తున్న తన స్వామిని చూడగానే కమలాంబ కళ్ళు మెరిసిపోయాయి. ఆమె హారతితో ఎదురువచ్చి స్వాగతం పలికింది.

పతికి హారతీరే
సీతా పతికి హారతీరే
అతి మృదుతర సత్య భాషణునికి
అఖిలాండ నాథునికి
సీతా పతికి హారతీరే
బంగరు రంగు భుజంగుని పైని
చెలంగుచును
మరకతాంగుడు మెరపు తెరంగున
మెరయు తనయుంగనతో
పలుకంగ జూచి యుప్పొంగుచు
పతికి హారతీరే—

శ్రీరామ పంచాయతనాన్ని తిరిగి యథాస్థానంలో వుంచారు.

గంగమ్మ, జపేశం లోపలకు వచ్చి దోషులవలె తలదించుకు నిలబడ్డారు.

త్యాగయ్య వారిని ఆప్యాయంగా పలకరించాడు. "అన్నయ్యా! మన రాముడు మనింటికి మళ్ళీ వచ్చేశాడు. మనని అనుగ్రహించాడు. మీరు బాగున్నారా అన్నయ్యా!"

త్యాగయ్య చూపిన ఆప్యాయతకు జపేశం సిగ్గుపడిపోయాడు. "చేసిన పాపానికి చెయ్యి పడిపోయింది త్యాగూ" అంటూ భుజం మీది కండువా తొలగించాడు జపేశం. సొట్ట చెయ్యి కొట్టొచ్చినట్టు కనిపిస్తోంది. త్యాగయ్య అర్థంకానట్టు చూశాడు.

"నీ రాముడిక్కడుంటే, నువ్వు ఎప్పటికీ బాగుపడవన్న మూర్ఖాలోచనతో, పొగరుతో, నీమీద అసూయతో నేనే విగ్రహాలు కావేరిలో పారేశాను. విసిరిన మరుక్షణం చెయ్యి కొయ్యబారింది. నాటికి నేటికి ఇంతే" అంటూ మొద్దుబారిన చెయ్యి చూపాడు జపేశం. జపేశం గద్గద స్వరంతో- "నీ దేవుడి సాక్షిగా చెబుతున్నాను. నా చెయ్యి పోయిందని

చింతలేదు. నువ్వు ఇన్నాళ్ళకి నీ రాముడితో ఇల్లు చేరావు. నాకదే పది వేలు. చిన్నవాడివైనా ఈ అన్నని క్షమించానని అనరా"—అని వేడుకున్నాడు.

"అన్నయ్యా ఎంత మాట! తండ్రివంటి వారు" అంటూ త్యాగయ్య పూజామందిరంవేపు నడిచాడు. జపేశం తమ్ముణ్ణి అనుసరించాడు—అర్ధ నిమీలిత నేత్రాలతో రాముని ధ్యానిస్తూ—

రామా!
ఎన్నో తప్పులు గలవారిని
రాజన్య! నీవు బ్రోచినావు గనుకను
నడిమి ప్రాయమున త్యాగరాజనుత
నా పూర్వజు బాధను
దీర్పలేని నన్నన్యాయము
సేయకురా
రామా! అన్యునిగా జూడకురా
నా యెడ అన్యాయము సేయకురా—

జపేశం చెయ్యి స్వాధీనమైంది. జపేశం కళ్ళు ఆనందంతో మెరిశాయి. చెయ్యి విదిలించాడు. క్రిందికీ, పైకీ కదిలించి చూసుకున్నాడు.

"నా చెయ్యి స్వాధీనమైంది. తమ్ముడూ నా చెయ్యి నాకొచ్చేసింది, ఆ రాముడు క్షమించాడు" అంటూ రాముడి విగ్రహం ముందు సాష్టాంగ నమస్కారం చేసాడు.

# 25

నిస్త్రాణగా గోడకు జేరబడి నిలచివున్న కమలాంబ క్రమంగా జార పడిపోయింది. త్యాగయ్య అది చూసి పరుగున వెళ్ళి ఆమెను పట్టుకున్నాడు. కూర్చుని ఒడిలోకి తీసుకున్నాడు - అన్న వదిన ఆదుర్దాగా వచ్చారు. వదిన

నీళ్ళు ముఖాన చల్లి, చెంగుతో గాలి విసరసాగింది - కమలాంబ మెల్లగా కనులు తెరచింది.

"కమలా! కమలా! ఏమిటిది? ఇంతలో ఏమైంది?" ఆత్రుతగా అడిగాడు త్యాగయ్య. కమలాంబ ఒక్కసారి భర్త కళ్ళలోకి చూపి.

"ఏ పూర్వ జన్మలోనో చేసుకున్న కాస్త పుణ్యానికి నోచుకున్న నోము లకు ఈ జన్మలో మీ యింటి ఇల్లాలినయే భాగ్యం కలిగింది" — కృతజ్ఞత పూర్వకంగా అన్నది.

"కమలా! ఏవిటీ పిచ్చిమాటలు? ఇప్పుడవన్నీ ఎందుకు?"

"ఆనాడు మీరు నన్ను విడిచి ఇల్లు వదలిన క్షణానే నా ప్రాణాలు పోయాయి కాని....పసుపు దేవుళ్ళను పూజిస్తూ మీరొచ్చేదాకా, వుండమని చెప్పి వెళ్ళారు. అందకని మీరూ మీదేవుడూ ఇంటికొస్తారని రాగానే హారతి యివ్వాలని ఆశ పెట్టుకుని, కొన ప్రాణంతో బతికి వున్నానండీ. ఇవ్వాళ మీ యిద్దరూ ఇంటికొచ్చారు. చాలు నాకు వేళయింది."

కమలాంబకు మగత కమ్మింది. కళ్ళు తెరవబోయింది. రెప్పలు వాలి పోతున్నాయి.

"మీ ఒడిలో ఒరిగి సుమంగళిగా వెళ్ళిపోతున్నాను. సంతోషంగా వుంది కాని ఒక్కకోరిక మిగిలి.... ..." — కమలాంబకు మాట పెగిలి రావడం లేదు.

"చెప్పుకమలా! ఏమిటది" అనునయంగా అడిగాడు త్యాగయ్య.

"మూసి వాయినాల నోము చేసి ముత్తయిదువులకు తాంబూలా లిచ్చి మరీ వెళ్ళాలని ఒక్క ఆశ........" భార్య కోరిక విని "అవశ్యం కమలా" తప్పతుండా అన్నాడు త్యాగయ్య.

క్షణాలమీద ఏర్పాట్లు జరిగాయి. మూపి వాయనం నోము భక్తిగా తీర్చుకుంది. భర్త ఒడిలో, చివరి క్షణాలలో ముత్తైదువులకు బొట్టుపెట్టి వాయినాలు యిచ్చింది కమలాంబ.

శ్రీ పార్వతీదేవి దీవించు నిన్ను
నిత్యకల్యాణిగా నిండు నూరేళ్ళు
ఇస్తినమ్మ వాయనం
పుచ్చుకొంటి వాయనం....
... .... .... .... .... .... .....

అంటూ వచ్చిన ముత్తైదువులకు తన కోరిక తీర నోము వాయినాలు యిచ్చింది. త్యాగయ్య అపస్మారక స్థితిని సమీపించిన కమలాంబ చెయ్యి పట్టి, శ్రద్ధగా వాయినాలు యిప్పించాడు.

కమలాంబ రెండు కోరికలూ తీరాయి. నోము తీరింది. పసుపు కుంకుమలతో నిండు ముత్తైదువుగా భర్త ఒడిలో కన్నుమూసింది కమలాంబ.

# 26

భార్యా యోగం భరింపరాని బాధ అయింది త్యాగయ్యకు. స్తంభానికి జేరబడి ఖిన్నుడై కూర్చుని—

మనసా ఎటులోర్తునే
నా మనవి చేకొనవే
దినకర కుల భూషణుని
దీనుడవై భజన చేసి
దినము గడుపు మనిన
నీవు వినవదేల గుణవిహీన

పరిపరి విధాల పరితపిస్తున్నాడు. "రామచంద్ర ప్రభో! సీతను విడచి వుండలేక నువ్వుపడిన ఆవేదన, భరించిన క్షోభ ఎంతటిదో నా

ధర్మపత్ని నన్ను విడిచి వెళ్ళాక ఇప్పుడిప్పుడే కొంచెం బోధపడుతోంది. తండ్రీ! నువ్వు పురుషోత్తముడవు. నేను అల్పజీవిని. ఈ బాధ సహించలేను త్వరగా ముక్తి ప్రసాదించు, నీ పాదాల చెంతకు చేర్చుకో."

త్యాగయ్య పిచ్చివాడిలా తయారయాడు. రూపం మారిపోయింది. చెట్టు క్రింద కూర్చుని సాలోచనగా పాడుకుంటున్నాడు.

మోక్షము గలదా
భువిలో
జీవన్ముక్తులు కాని వారలకు
మోక్షము గలదా?

త్యాగయ్య ఆవేదన, ఆ రామునికై ఆరాటం అధికమైనాయి. పలు విధాలుగా స్వామిని వేడుకుంటున్నాడు. కరుణించమని, కనుపించమని ప్రార్థిస్తున్నాడు.

ఖగరాజు నీ యానతి విని
వేగ చన లేదో
గగనానికి ఇలకూ
బహుదూరం బనినాడో
జగమేలే పరమాత్మ
ఎవరితో మొరలిడుదు
వగ జూపకు తాళను
నన్నేలుకోరా
త్యాగరాజ నుత
నీ నగుమోము కనలేని
నా జాలి తెలిసి
నను బ్రోవ రారాదా
శ్రీరఘు వరా!

భక్తుని మొరతా ఆలకించాడు. త్యాగయ్యకు రామసాక్షాత్కారం లభించింది. ఆనందంతో పొంగింది మనసు—

గిరిపై నెలకొన్న రాముని
గురి తప్పక గంటి
గిరిపై నెలకొన్న రాముని

సరయు నదిపై సీతాదేవితో నౌకా విహారం చేస్తున్న రాముడు అలవోకగా చూసి, చిరునవ్వుతో అభయహస్తం చూపాడు. త్యాగయ్య తన్మయుడై—

సరిలేని సీతతో
సరయూ మధ్యంబున
నా పరితాపము గని యాడిన
పలుకుల మరచితివో
వరమగు బంగరు ఓడను
మెరయుచు
పది పూటలపై కరుణించెద ననుచు
క్రీగనుల త్యాగరాజుని
పరితాపము గని యాడిన
పలుకులు మరచితివో—

త్యాగరాజస్వామి సన్యాసాశ్రమం స్వీకరించి 'నాదబ్రహ్మానంద' అనే ఆశ్రమ నామధేయం ధరించారు. త్యాగయ్య వద్దకు జపేశం వచ్చి సాష్టాంగ దండ ప్రమాణంచేసి, ఆశ్రమంలో ఉన్న శ్రీరామపంచాయతనం వద్ద కూచుని సంకల్పం చెప్పాడు. ఆ విగ్రహాలకు నిత్యపూజలు జపేశం జరుపుతున్నాడు.

సన్యాసిగా వున్న త్యాగయ్య ఆశ్రమానికి పిన్నలు, పెద్దలూ పండితులూ వచ్చి భజగోవిదం కీర్తిస్తున్నారు.

భజగోవిందం—భజగోవిందం
గోవిందం భజ మూఢ మతే
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతిడు క్రుఙ్ కరణే ॥భజ॥

పునరపి జననం పునరపి మరణం
పునరపి జఠరే శయనం
ఇహ సంసారే బహుదుస్తారే
కృపయా పారే పాహి మురారి ॥భజ॥

సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వం
నిర్మోహత్వే నిశ్చలతత్వం
నిశ్చలతత్వే జీవన్ముక్తిః ॥భజ॥

నాదబ్రహ్మానందగా ఆశ్రమ జీవితం గడుపుతున్న త్యాగరాజస్వామి నుండి ఒక జ్యోతి ఆవిర్భవించి, క్రమంగా శ్రీరాముని సమీపించి స్వామిలో ఐక్యమైంది.

# పాటలు

## వేటూరి సుందర రామమూర్తి

శ్రీ పార్వతీదేవి దీవించు నిన్ను
నిత్యకళ్యాణిగా నిండు నూరేళ్లు
ఇస్తినమ్మ వాయినం
పుచ్చుకొంటి వాయినం

పుట్టి నింటికి వాసిగా
మెట్టినింటికి రాసిగా
నీవు మెట్టిన పంచనదమే
మాకు దక్షిణకాశిగా
అన్నపూర్ణవు నీవుగా
నాయన్న వారికి నీడగా
తులసివై మావాడలో
వెలసిన పుణ్యవతివమ్మా

॥ ఇస్తినమ్మ ॥

నిధులుకోరగలేదు పతిపాద సన్నిధేగాని
విధులు మానగలేదు - పూజావిధులనే పూని
నిన్ను చూచుట నోముగా - నిన్ను తలచుట వ్రతముగా
నీదు దర్శన భాగ్యమే నిత్య సౌభాగ్యమ్ముగా

॥ ఇస్తినమ్మ ॥

నను బ్రోవమని చెప్పవే

సీతమ్మతల్లీ!

నను బ్రోవమని చెప్పవే

నను బ్రోవమని చెప్పు నారీ శిరోమణి

జనకుని కూతుర - జనని జానకి

నను బ్రోవమని చెప్పవే

పసుపు, కుంకుమ, తాళి, పూలు, పారాణి

పడతులకిలలో పంచప్రాణాలని తెలిసిన తల్లీ

నే నలసియున్నానమ్మ - తెలియక పతిజాడ

తలవాకిట నున్న నను బ్రోవమని చెప్పవే

వినుమా ఓ తల్లిరో! హనుమ నాతోడు లేడు

వినతి సేయగ వినతాసుతుడు లేడు

సుదతిరో నా అడతోడని నిన్నే నమ్ముకుంటిని

లంకలో కన్నీరులింకగ కుమిలిన ఎడబాటు మరవక

నను బ్రోవమని చెప్పవే

నాపాలి భాగ్యమా

నా ప్రాణ దీపమా

నా నోము ఫలమా

నా తులసీ దళమా

అమ్మా! అమ్మా! సీతమ్మ


# త్యాగయ్య

## రాగ మాలిక

| నెం. | కీర్తన | రాగం | తాళం |
|---|---|---|---|
| 1. | శ్రీ గణపతిని సేవింప రారే | సౌరాష్ట్ర | ఆది |
| 2. | మేలుకోవయ్యా రామా | బౌళి | ఝంప |
| 3. | వందనము రఘునందన | శహన | ఆది |
| 4. | సొగసుగ మృదంగ తాళము | శ్రీరంజని | రూపకం |
| 5. | సంగీత జ్ఞానము | ధన్యాసి | దేశాది |
| 6. | రమించు వారెవరురా | సుపోషిణి | రూపకం |
| 7. | శాంతము లేక సౌఖ్యములేదు | సామ | దేశాది |
| 8. | శ్రీరామ పాదమా | అమృతవాహిని | ఆది |
| 9. | ఓడను జరిపే ముచ్చట | సారంగ | ఆది |
| 10. | నాపతను మనిశం | చిత్తరంజని | ఆది |
| 11. | నారద ముని | భైరవి | ఆది |
| 12. | బాలకనకమయ చేల | అఠాణ | ఆది |
| 13 | అలక లల్లలాడగ గని | మధ్యమావతి | రూపకం |
| 14. | సొగసు చూడ తరమా | కన్నడగౌళ | ఆది |
| 15. | సామజవర గమన | హిందోళం | ఆది |
| 16. | సాధించెనే ఓ మనసా | ఆరభి | ఆది |
| 17. | ఎన్నగాను రామ భజన | పంతువరాళి | రూపకం |
| 18. | ఎందరో మహానుభావులు | శ్రీరాగం | ఆది |

| నెం. | కీర్తన | రాగం | తాళం |
|---|---|---|---|
| 19. | రామభక్తి సామ్రాజ్యము | శుద్ధబంగాళ | ఆది |
| 20. | నిధి చాల సుఖమా | కల్యాణి | త్రిపుట |
| 21. | నాదుపై పలికేరు నరులు | మధ్యమావతి | జంప |
| 22. | లావణ్య రామా | పూర్ణషడ్జమం | రూపకం |
| 23. | సీతమ్మ మాయమ్మ | లలిత | రూపకం |
| 24. | బంటురీతి కొలువు | హంసనాదం | దేశాది |
| 25. | భవనుత రమింపుము | మోహన | ఆది |
| 26. | శ్రీరామ జయరామ | యదుకుల కాంభోజి | జంప |
| 27. | నను పాలింప | మోహన | దేశాది |
| 28. | హెచ్చరికగా రార | యదుకుల కాంభోజి | జంప |
| 29. | జగదానంద కారక | నాట | దేశాది |
| 30. | ఆరగింపవే | తోడి | రూపకం |
| 31. | విడెము సేయవే | ఖరహరప్రియ | ఆది |
| 32. | ఉయ్యాల లూగవయ్య | నీలాంబరి | జంప |
| 33. | ఎటుల బ్రోతువో తెలియ | చక్రవాకం | త్రిపుట |
| 34. | ఎందు వెదుకుదురా | హరి కాంభోజి | ఆది |
| 35. | మారు బల్కకున్నావేమిరా | శ్రీరంజని | ఆది |
| 36. | ఎన్నడు జూతునో | కళావతి | ఆది |

| నెం. | కీర్తన | రాగం | తాళం |
|---|---|---|---|
| 37. | నా మొరాలకింపవేమి | దేవగాంధారి | రూపకం |
| 38. | వరద రాజ నిన్నేకోరి | స్వరభూషిణి | రూపకం |
| 39. | మధురా నగరిలో | ఆనందభైరవి | ఆది |
| 40. | తెర తీయగ రాదా | గౌళిపంతు | ఆది |
| 41. | ఎవరని నిర్ణయించిరిరా | దేవామృతవర్షిణి | దేశాది |
| 42. | నా జీవాధార | బిలహరి | ఆది |
| 43. | నను బ్రోవమని చెప్పవే | మోహన | చాపు |
| 44. | ముందు వెనకాకల | దర్బారు | ఆది |
| 45. | కనుగొంటిని | బిలహరి | దేశాది |
| 46. | రారా మా ఇంటిదాకా | అసావేరి | ఆది |
| 47. | పతికి హారతీరే | సురటి | ఆది |
| 48. | శ్రీ పార్వతీదేవి దీవించు నిన్ను | సింహేంద్రమధ్యమం | జంప |
| 49. | మనసా ఎటులోర్తునే | మలయ మారుతం | రూపకం |
| 50. | మోక్షము గలదా | సారమతి | దేశాది |
| 51. | నగు మోము గనలేని | ఆభేరి | ఆది |
| 52. | గిరిపై నెలకొన్న | శహన | ఆది |
| 53. | పరితాపము గని | మనోహరి | రూపకం |
| 54. | పరమాత్ముడు వెలిగే | వాగధీశ్వరి | ఆది |
| 55. | భజ గోవిందం | మాయామాళవగౌళ | ఆది |



శ్రీ త్యాగరాజ స్వామి

తిరువైయార్‌లో స్వామి సమాధి వద్ద

నెలకొన్న విగ్రహం.

—చిత్రకారుడు-గంగాధర్.



నవత సినీ ఆర్ట్స్
త్యాగయ్య